www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 11-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 326

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి ఉ. 10.46 తదుపరి విదియ; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 11.04 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ.10.23-11.47; దుర్ముహూర్తం: మ.12.49-1.37, మ.3.12-3.59; అమృతఘడియలు: రా.6.50-8.14; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.30; సూర్యాస్తమయం: 6.21

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టీమ్ ఇండియా.. సూపర్ ఫోర్



టెస్టులు, వన్డేలు, టి20ల్లో నంబర్ వన్

ఇంగ్లండ్‌పై సిరీస్ విజయంతో ముందుకు

టెస్టు చాంపియన్‌షిప్‌లోనూ టాప్‌లోనే

ఏక కాలంలో 4 విభాగాల్లో అగ్రస్థానంలో..

సాత్విక్-చిరాగ్ జోడీదే 'ఫ్రెంచ్' కిరీటం

11





1 ఎండిన పొలంలో గొర్రెల మేత

1) మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామంలో సాగునీరు అందక ఎండిన వరి పొలంలో మేస్తున్న గొర్రెలు

1 ఎండకుండా చూసేందుకు నీటి పోత

2) అదే మండలంలోని యారోనిపల్లి గ్రామంలో వరి పొలాన్ని కాపాడుకునేందుకు ట్యాంకర్‌తో నీటిని పోస్తున్న రైతు

జల గోస

రాష్ట్రవ్యాప్తంగా సగటున 8.7 మీటర్ల లోతుకు నీరు

యాసంగికి సాగు నీటి కొరత.. ఎండుతున్న పంటలు

ఒకటికి మూడు బోర్లు తవ్విస్తున్నా ఫలితం శూన్యం

రాష్ట్రంలో జలాశయాలన్నిటిలో కొడిగడుతున్న నిల్వలు

ఇప్పుడే ఇలాగైతే వచ్చే రెండు నెలలు పరిస్థితులు క్లిష్టం

పాలేరులో నీరు లేక గొంతెండుతున్న ఖమ్మం జిల్లా

నైరుతి, ఈశాన్య రుతుపవనాలతో చాలీచాలని వర్షాలు

జలాశయాల్లో నిరుటి కంటే 155 టీఎంసీలు తక్కువ

డెడ్ స్టోరేజీకి చేరువలో నాగార్జున సాగర్ నీటి మట్టం

సాగర్, ఏఎమ్మార్పీ, జూరాల కింద పంట విరామం

ఎస్సారెస్పీలో 25 టీఎంసీలే.. ఆన్‌ఆఫ్ పద్ధతిలో విడుదల

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎండిపోతున్న చెరువులు.. అడుగంటుతున్న బావులు..! ముదురుతున్న ఎండలు.. లోలోతుకు భూగర్భ జలాలు..! పంటను కాపాడుకునేందుకు బోరు పక్కన బోరు..! గొంతు తడుపుకొనేందుకు ఇంటికి ట్యాంకర్లు..! వెరసి ఆయకట్టుకు కటకట.. తాగునీటికి తంటా..! ఇదీ ప్రస్తుతం రాష్ట్రంలోని పరిస్థితి..! వర్షాలు సమృద్ధిగా కురవని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జలాశయాల్లో నిల్వలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. భూగర్భ జలాలు పాతాళంలోకి పడిపోతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఎండలు ముదిరే వచ్చే రెండు నెలలు ఇంకెన్ని ఇబ్బందులు తలెత్తుతాయోననే ఆందోళన నెలకొంది. వాస్తవానికి నాలుగైదేళ్లుగా రాష్ట్రంలో వర్షా కాలం సీజన్ ముగిసిన తర్వాత కూడా వానలు కురిశాయి. రెండు, మూడేళ్ల నైరుతి రుతు పవనాలు రాష్ట్రం నుంచి ఆలస్యంగా నిష్క్రమించాయి. ఈశాన్య రుతు పవనాల సమయంలో

మిగతా 13వ పేజీలో...



వన్యప్రాణులకు దాహం.. దాహం

కొత్తగా సాసర్‌పిట్ల నిర్మాణాలు లేవు

ఉన్నవాటికి మరమ్మతులు కరువు

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా బంద్

సోలార్‌బోర్ల పునరుద్ధరణ గాలికి

నీటికోసం గ్రామాల వైపు వెళ్లి

మృత్యువాత పడుతున్న మూగజీవాలు

13

ఉద్యోగులకు.. ఏడో గ్యారెంటీ!

అభిప్రాయాలు వెల్లడించే స్వేచ్ఛ, సమస్యలు చెప్పుకొనే చాన్స్

సమస్యలను పరిష్కరిస్తాం.. డీఏ, పీఆర్సీపై త్వరలో నిర్ణయం

ప్రభుత్వ పాఠశాలల్లో కిందిస్థాయి సిబ్బందిని నియమిస్తాం

సీపీఎస్, ఓపీఎస్‌పై మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తాం

కోదండరాం మండలికి.. తెలంగాణ బాపు జయశంకర్ సార్

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

2 గంటలపాటు సమస్యలను ఓపిగ్గా విన్న ముఖ్యమంత్రి



హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు పదేళ్లుగా తమ సమస్యలు చెప్పుకొనే అవకాశం రాలేదని, వారి ఆవేదన వినేవారే లేక ఇబ్బందులు పడ్డారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అందుకే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే అంశాన్ని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని తెలిపారు. దానిని నెరవేర్చే బాధ్యత ప్రజా ప్రభుత్వానిదని చెప్పారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలను చెప్పుకొనే, అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛ ఉందని, ఇందుకు ఎటువంటి అడ్డంకులు ఉండబోవని ప్రకటించారు. ఇది తమ ప్రభుత్వ ఏడో గ్యారెంటీగా హామీ

మిగతా 2వ పేజీలో...

పేదింటి పండుగ

నేడు 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్

భద్రాచలంలో రాముల వారి దర్శనం అనంతరం శ్రీకారం

మార్గదర్శకాలు ఖరారు.. నిర్మాణాలకు మూడు నమూనాలు

మహిళ పేరు మీద మంజూరు.. ప్రత్యేక పోర్టల్‌తో పర్యవేక్షణ

లబ్ధిదారు ఇష్టప్రకారమే నిర్మాణం.. వంటగది, టాయ్‌లెట్ కచ్చితం

పూర్తయ్యాక ఇంటిపై అభయహస్తం లోగో, 3 రంగులు

బడుల్లో మార్పు రావాల్సిందే

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించండి

అనుభవజ్ఞులైన టీచర్లతో డిజిటల్ పాఠాలు చెప్పించండి

సర్కారీ బడులు, కళాశాలలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలి

అధికారులతో సమీక్షలో సీఎం

2

నేటి నుంచి యాదాద్రి నృసింహుడి బ్రహ్మోత్సవాలు

తొలిరోజు పూజల్లో పాల్గొననున్న సీఎం రేవంత్



జహీరాబాద్ బీఆర్ఎస్ నేతలతో

కేసీఆర్ భేటీ

పార్టీ ఎంపీ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్?

3

ఆంధ్రోళ్ల బూట్లు నాకి.. పార్టీలు మారిన రేవంత్

నేను ఆయనలా రాజకీయాల్లోకి రాలేదు

ఉద్యమ నాయకుడు కేసీఆర్ కొడుకుగా వచ్చా

సిరిసిల్ల నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచా

హామీలు నెరవేర్చకుంటే కాంగ్రెస్ పని పడతాం

కోడ్‌కు ముందే ధాన్యానికి 500బోనస్ ఇవ్వాలి

కాంగ్రెస్‌లోనే మానవ బాంబులు ఉన్నాయి

రేవంత్ రెడ్డి కాదు.. పొంగనాల పోతిరెడ్డి

కామారెడ్డి, గంభీరావుపేట బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి భేటీలో కేటీఆర్

కేటీఆర్ సమక్షంలోనే బయటపడ్డ విభేదాలు

కామారెడ్డి/సిరిసిల్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): "అయ్య పేరు చెప్పి కుర్చీలో కూర్చున్నానంటూ సీఎం రేవంత్‌రెడ్డి నాపై పదే పదే విమర్శలు చేస్తున్నాడు. సీఎం హోదాలో ఉండి కేసీఆర్ పట్ల దిగజారుడు మాటలు మాట్లాడుతున్నాడు. ఆయన విమర్శలకు నేనూ సమాధానం చెప్పదల్చుకున్నా. రేవంత్‌రెడ్డి లాగా ఆంధ్రోళ్ల బూట్లు నాకి, సంచులు మోసి, పార్టీలు మారి.. నేను రాజకీయాల్లోకి రాలే. ఉద్యమ నాయకుడు కేసీఆర్ కొడుకుగా వచ్చా. సిరిసిల్ల నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచా" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మిగతా 3వ పేజీలో...



కారులోంచి కమలానికి

ఢిల్లీలో తరుణ్ చుగ్ సమక్షంలో బీజేపీలోకి సీతారాం నాయక్, నగేశ్, జలగం వెంకట్రావ్, శానంపూడి

లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కార్: ఎంపీ లక్ష్మణ్

నేడు బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ.. లోక్‌సభ అభ్యర్థుల రెండో జాబితాపై కసరత్తు

రాష్ట్రం నుంచి ఐదారుగురిని ప్రకటించే అవకాశం.. రేపు తెలంగాణకు కేంద్ర మంత్రి అమిత్ షా రాక



తరుణ్‌చుగ్ సమక్షంలో బీజేపీలో చేరిన సీతారాం నాయక్, నగేశ్, సైదిరెడ్డి, వెంకట్రావ్, శ్రీనివాస్

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలవడంతో గులాబీ నేతలు ఒక్కొక్కరుగా కారు దిగిపోతున్న వేళ.. ఆదివారం ఆ పార్టీకి చెందిన నలుగురు కీలక నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకుని బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి నడిచిన మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాం నాయక్.. ఉమ్మడి రాష్ట్రంలో గిరిజన శాఖ మంత్రిగా పనిచేసిన మాజీ ఎంపీ గొడం నగేశ్.. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు తనయుడు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్.. కాంగ్రెస్ కంచుకోట, ఒకప్పటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గం హుజూర్‌నగర్‌లో తొలిసారిగా బీఆర్ఎస్‌కు విజయాన్ని అందించిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బీజేపీలో చేరారు. వీరితోపాటు పెద్దపల్లికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గోమాస శ్రీనివాస్ కూడా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం ఢిల్లీలోని బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్ వారికి కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని అన్నారు. రాష్ట్రం సాధించిన తర్వాత కేసీఆర్ ఉద్యమకారులను పక్కన పెట్టేశారని ఆరోపించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని

మిగతా 3వ పేజీలో...



భర్త, కుమారుడితో శ్వేత (ఫైల్)

13

భార్యను కొట్టిచంపి.. డస్ట్‌బిన్‌లో పడేసి..

ఆస్ట్రేలియాలో హైదరాబాదీ ఘాతుకం

ఏమీ ఎరుగనట్టు హైదరాబాద్‌కు రాక

నాలుగేళ్ల కొడుకును అత్తమామలకు అప్పగించి.. క్షమాపణలు చెప్పి పరార్

12 ఏళ్ల క్రితం కులాంతర వివాహం

ఆస్ట్రేలియాలో స్థిరపడిన దంపతులు

కొన్నాళ్లుగా మనస్పర్థలతో ఘోరం

ఖమ్మం టికెట్ రాకుండా అడ్డుకుంటున్న భట్టి

పనిచేసినోడికి సీఎం పదవి రావాలన్నందుకే నాపై కక్ష: వీహెచ్

వీహెచ్‌కు టికెటిస్తే గెలిపిస్తాం

అడ్డుపడుతున్నాననడం అపోహ: భట్టి

2

ప్రణీత్‌రావుపై ఎఫ్ఐఆర్

ఐపీసీ, పీడీపీపీ, ఐటీ చట్టాల కింద కేసు

నాన్-బెయిలబుల్ సెక్షన్ల ప్రయోగం

డిసెంబరు 4న ఎస్ఐబీలో హార్డ్‌డిస్క్‌లు, కంప్యూటర్ల దహనం

అదనపు ఎస్పీ రమేశ్ ఫిర్యాదు

పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు

3

400 సీట్లిస్తే రాజ్యాంగాన్ని

మార్చేస్తాం

పీఠిక నుంచి 'లౌకిక వాదం' అన్న మాటను తొలగిస్తాం

బీజేపీ ఎంపీ అనంత హెగ్డే

మండిపడ్డ కాంగ్రెస్

నియంతృత్వం కోసమే: ఖర్గే

10



బెంగళూరు పేలుళ్లతో జగిత్యాలకు లింకు?

రామేశ్వరం కెఫే బాంబు పేలుళ్ల ఘటనలో

పీఎఫ్ఐ కార్యదర్శి సలీం హస్తమున్నట్లు అనుమానాలు

జగిత్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కెఫె బాంబు పేలుళ్లతో జగిత్యాలకు లింకులున్నట్లు ప్రచారం జరుగుతోంది. జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఇస్లాంపురకు చెందిన నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) కార్యదర్శి అబ్దుల్ సలీంకు బెంగళూరు పేలుళ్ల కేసుతో సంబంధాలున్నట్లుగా కేంద్ర దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా మైదుకూరు మండలం చెర్లోపల్లి ప్రాంతంలో

మిగతా 10వ పేజీలో...

సీఈసీతో విభేదాలతోనే?

ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామాపై చర్చ

బెంగాల్‌లో పోలింగ్‌పై సీఈసీతో అభిప్రాయ భేదాలు

ఆ రాష్ట్ర పర్యటన మధ్యలోనే ముగించి ఢిల్లీకి గోయల్

అనంతరం మూడు రోజులకే పదవికి రాజీనామా

నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరిన కేంద్రం

ససేమిరా అన్న కమిషనర్.. ప్రభుత్వ వర్గాల వెల్లడి

ఒత్తిడికి తలవంచని గోయల్‌కు సెల్యూట్: మమత

బెంగాల్ హైకోర్టు మాజీ జడ్జిలా గోయల్ కూడా లోక్‌సభకు పోటీ చేస్తారా?: జైరాం రమేశ్

ఈ నెల 15లోపు ఇద్దరు కొత్త కమిషనర్ల నియామకం

ప్రధాని సారథ్యంలో భేటీ కానున్న ఎంపిక కమిటీ

న్యూఢిల్లీ, కోల్‌కతా, మార్చి 10: పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ఏర్పాట్ల విషయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)తో తలెత్తిన విభేదాలే ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ ఆకస్మిక రాజీనామాకు కారణమా?.. శనివారం రాత్రి గోయల్ రాజీనామా చేయటం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇంకా దాదాపు నాలుగేళ్ల సర్వీసు, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ అయ్యే అవకాశం ఉన్నా కూడా.. వాటన్నింటినీ వదులుకొని గోయల్ ఎందుకు రాజీనామా చేశారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం (ఈసీ) వర్గాలు.. సీఈసీ రాజీవ్ కుమార్‌తో

మిగతా 10వ పేజీలో...

బెంగాల్‌లో అన్ని సీట్లలో టీఎంసీ పోటీ

లోక్‌సభ బరిలో మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్, సినీ నటి రచనా బెనర్జీ

బహిష్కృత ఎంపీ మహువాకు మళ్లీ అవకాశం

10



క్రెడాయ్ ప్రాపర్టీ షోలో మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య మాస్టర్ ప్లాన్

» క్రెడాయ్ సలహాలను స్వీకరిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ సిటీ మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'ఔటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు మధ్య అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నాం. ఈ రెండు దారుల మధ్య ఇండస్ట్రియల్ క్లస్టర్లను నిర్మిస్తాం. ఈ విషయంలో క్రెడాయ్ సలహాలు, సూచనలను స్వీకరిస్తాం. హైదరాబాద్‌ను మహానగరంగా తీర్చిదిద్దడంలో అప్పట్లో.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలదే ప్రధాన భూమిక' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైటెక్స్‌లో ఆదివారం జరిగిన 'క్రెడాయ్ ప్రాపర్టీ షో' ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. "మా ప్రభుత్వం ఏర్పాటవ్వగానే.. రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) భూకేటాయింపులకు నిధులను కేటాయించాం. మూణ్నెల్ల కాలంలోనే కేంద్రంతో మాట్లాడి, ఎలివేటెడ్ కారిడార్ పనులకు పునాదులు వేశాం" అని వివరించారు. మూసీని థేమ్స్ నది మాదిరిగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రత్యేక జలాశయం ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

స్టాన్‌ఫోర్డ్‌లో కేస్‌స్టడీగా హైదరాబాద్ మెట్రో రైల్

» ఇది అరుదైన గౌరవం : ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు మరో గౌరవం దక్కింది. ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ మేనేజ్‌మెంట్ ప్రాక్టీషనర్లు, విద్యార్థులకు ఈ ప్రాజెక్టు కేస్ స్టడీగా మారింది. ప్రాజెక్టు విజయగాథను స్టాన్‌ఫోర్డ్ సోషల్ ఇన్నోవేషన్ రివ్యూ (ఎస్ఎస్ఐఆర్) తాజా సంచిక (స్ప్రింగ్-2024)లో ప్రచురించింది. ఇది ఒక భారతీయ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుకు దక్కిన అరుదైన గౌరవంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) అభివర్ణించింది. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టిన మొదటి దశ మెట్రో రైల్ ప్రాజెక్టు విజయవంతంకావడంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఆయన బృందం అసాధారణ నాయకత్వ ప్రతిభను కనబరిచారని అధ్యయనంలో పేర్కొన్నారు. కాగా, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ.. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టును కేస్‌స్టడీగా తీసుకుని విద్యార్థులకు వివరించడం తమకు లభించిన అరుదైన గౌరవమని ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు.

పొగాకు రైతాంగ ఉద్యమ రథసారథి 'శివాజీ'

» 'ఎదురీత' పుస్తకావిష్కరణలో కంభంపాటి హరిబాబు

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): క్రాప్ హాలిడే పదబంధాన్ని సృష్టించి, పొగాకు రైతాంగ ఉద్యమాన్ని నడిపిన రథసారథి యలమంచిలి శివాజీ అని మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు కొనియాడారు. రైతునేస్తం ప్రచురించిన యలమంచిలి శివాజీ రాజ్యసభ ప్రసంగాలు 'ఎదురీత' పుస్తకాన్ని ఆదివారం తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాజీ తనకు 'జై ఆంధ్ర' ఉద్యమంలో పరిచయమయ్యారని, 52 ఏళ్లుగా తమ స్నేహం కొనసాగుతోందని తెలిపారు. ప్రతి రాష్ట్రానికి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి కౌన్సిల్ ఉండాలని, వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా మార్చాల్సిన అవసరం ఉందని హరిబాబు నొక్కి చెప్పారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. శివాజీ రాజకీయ జీవితం కూడా ఎదురీతనే ప్రారంభమైందని, రుణమాఫీ ఆయన ఉద్యమ ఫలితమని, పులిచింతల ఆయన ఆశల సౌధమని తెలిపారు. యలమంచిలి శివాజీ మాట్లాడుతూ తన రాజ్యసభ ప్రసంగాలు కొన్నింటిని 'ఎదురీత'గా వెలువరించినట్లు చెప్పారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఎంను కోరిన డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్లు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్ల సభ్యులు కోరారు. ఆదివారం డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, ఎస్.ఆర్ సరిత, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, అసోసియేట్ ప్రెసిడెంట్ పూల్‌సింగ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, పూర్వ వీఆర్ఓ, వీఆర్ఏల పెండింగ్ సమస్యలు, తహసీల్దార్ల అద్దె వాహనాలకు బిల్లుల చెల్లింపు, క్యాడర్ బలోపేతం, తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. అన్ని అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించినట్టు అసోసియేషన్ల ప్రతినిధులు తెలిపారు.

పేట్ బషీరాబాద్ స్థలాన్ని అప్పగించండి

» మంత్రి పొంగులేటికి జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ వినతి

హైదరాబాద్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రభుత్వం పేట్ బషీరాబాద్‌లో కేటాయించిన 38 ఎకరాల స్థలాన్ని తమ సొసైటీకి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ (జేఎన్‌జే) సొసైటీ ప్రతినిధి బృందం రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. సొసైటీకి నూతనంగా ఎన్నికైన కిరణ్ కుమార్ (అధ్యక్షుడు), రవికాంత్ రెడ్డి (ఉపాధ్యక్షుడు), వంశీ శ్రీనివాస్ (సీఈఓ), రమణా రావు (డైరెక్టర్)ల బృందం ఆదివారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని నివాసంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించింది. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని మంత్రి ఈ సందర్భంగా వారికి తెలిపారు. నిజాంపేటలో కేటాయించిన స్థలం అభివృద్ధితో పాటు పేట్ బషీరాబాద్‌లో ప్రతిపాదించిన 38 ఎకరాల స్థలాన్ని సొసైటీకి స్వాధీనం చేసేందుకు త్వరలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు సొసైటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. జర్నలిస్టులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

'న్యూస్ టాప్' నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

» పోలీసులకు టీపీసీసీ నేత కుమార్‌రావు ఫిర్యాదు

» 'నమస్తే..' పత్రికలను దహనంచేసిన కాంగ్రెస్ శ్రేణులు

హైదరాబాద్ సిటీ/కమ్మర్‌పల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా 'న్యూస్ టాప్' వెబ్‌సైట్‌లో అసత్య ప్రచారాలు చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు టి.కుమార్‌రావు సైఫాబాద్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. 'బేగంపేట విమానాశ్రయంలో టీడీపీ చీఫ్ చంద్రబాబును, సీఎం రేవంత్‌రెడ్డి కలిశారని.. ఏపీ ఎన్నికల్లో టీడీపీకి సహకరించాలని చంద్రబాబు కోరగా రేవంత్ అంగీకరించారని న్యూస్ టాప్ వార్తా కథనంలో పేర్కొంది. కల్పిత వార్తలతో సీఎం రేవంత్ ప్రతిష్ఠకు భంగం కలిగించిన వెబ్‌సైట్ నిర్వాహకుడు సాయిశేఖర్‌పై చర్యలు తీసుకోవాలి' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు, ఇదే విషయమై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలోనూ అసత్యపు వార్తను ప్రచురించారని కాంగ్రెస్ శ్రేణులు మండిపడ్డాయి. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో 'నమస్తే తెలంగాణ' దినపత్రికలను దహనం చేశారు.

సౌదీలో కనిపించిన నెలవంక

గల్ఫ్‌లో నేటి నుంచి రంజాన్.. భారత్‌లో రేపటి నుంచి రోజా!


దుబాయ్, మార్చి 10: గల్ఫ్‌లో రంజాన్ సందడి మొదలైంది. ఆదివారం సాయంత్రం సౌదీలో నెలవంక కనిపించింది. దీంతో.. గల్ఫ్ దేశాల్లో సోమవారం నుంచి రంజాన్ రోజా(ఉపవాసాలు) మొదలవుతాయి. భారత్‌లో నెలవంక దర్శనమీవకపోవడంతో.. మంగళవారం నుంచి రంజాన్ ప్రారంభమవుతుందని మతపెద్దలు తెలిపారు. భారత్‌తోపాటు.. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఇతర దక్షిణాసియా దేశాల్లో సోమవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని, మంగళవారం నుంచి ఉపవాసాలు మొదలవుతాయని పేర్కొన్నారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

» తొలిరోజు పూజల్లో పాల్గొననున్న సీఎం

» పట్టు వస్త్రాలు, తలంబ్రాల సమర్పణ

యాదగిరిగుట్ట, మార్చి 10: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10గంటలకు ప్రధానాలయ ముఖ మండపంలో అర్చక, వేదపండితుల బృందం సంప్రదాయరీతిలో లక్ష్మీనృసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిరోజు వైదిక పూజల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనున్నారు. ఆయన సోమవారం ఉదయం 9గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో కొండపైకి చేరుకుని వీవీఐపీ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. 9.30గంటలకు ప్రధానాలయంలో స్వయంభువులను దర్శించుకుంటారు. స్వామి, అమ్మవార్లకు



లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విద్యుద్దీపాల వెలుగులు

పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవస్థాన అధికారులకు అందజేస్తారు. ఉదయం 11గంటలకు రేవంత్ హెలికాప్టర్‌లో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి బయల్దేరివెళతారు. సీఎం రేవంత్ పర్యటన నేపథ్యంలో కొండ కింద పాత గోశాల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ వద్ద పనులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదివారం పరిశీలించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు పూజల్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, పలువురు మంత్రులు పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఈసారి రూ.1.60కోట్లు కేటాయించామని, అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18న జరిగే తిరుకల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనే విధంగా 600 టికెట్లను విక్రయిస్తామని, ఒక్కో టికెట్ ధర రూ.3వేలని తెలిపారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న రాత్రి ఎదుర్కోలు, 18న రాత్రి తిరుకల్యాణోత్సవం, 19న రాత్రి దివ్య విమాన రథోత్సవ ఘట్టాలను నిర్వహిస్తారు. ఈ నెల 20న మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం ఉంటుంది. 21వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

ఉద్యోగులకు ఏడో గ్యారెంటీ!

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల డీఏ, పీఆర్సీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఎంసీహెచ్ఆర్డీలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్ని రోజులూ ఆయా ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నది కేసీఆర్ కుటుంబమేనన్నారు. నిర్బంధాలతో పాలన సాగిస్తామనుకోవడం వారి భ్రమ అని, సమస్యలకు చర్చలే పరిష్కారం తప్ప.. నిర్బంధాలు కావని అన్నారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు విశ్వాసం కల్పించడానికే చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం శాఖల వారీగా సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటుందని, సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. ఉద్యోగుల డీఏతో పాటు ఇతర అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, వివిధ శాఖల్లో ఉన్న 1100 మంది రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపుపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచితంగా విద్యుత్తు ఇచ్చే విషయంలోనూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిందిస్థాయి సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తారీకునే జీతాలు వేసినా తాము ప్రచారం చేసుకోవడం లేదన్నారు. రోజుకు 18 గంటలు పనిచేస్తూ పాలనను గాడిలో పెడుతున్నామని చెప్పారు.

తెలంగాణ బాపు కేసీఆర్ కాదు..

మాజీ సీఎం కేసీఆర్ తనకు తాను తెలంగాణ బాపుగా చెప్పుకొంటున్నారని, అలా చెప్పుకోవడానికి కనీస పోలిక ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ బాపు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని, తెలంగాణ ఆత్మను గౌరవించకపోతే సమాజం



మనల్ని క్షమించదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆదాయం పడిపోతే.. మద్యంపై వచ్చే ఆదాయంపైనే ఆధారపడేలా కేసీఆర్ పాలన సాగిందని విమర్శించారు. విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని రేవంత్ అన్నారు. రక్తం చిందించకుండా తెలంగాణ సాధించామని కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంలో ఎవరి రక్తమూ చిందలేదని, కానీ.. కానిస్టేబుల్ కిష్టయ్య లాంటివారు రక్తాన్ని చిందించారని, శ్రీకాంతాచారి లాంటివారు మాంసపు ముద్దలయ్యారని అన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను శాసన మండలికి తప్పక పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ఎమ్మెల్సీగా ఉంటే శాసనమండలికి గౌరవమన్నారు. ఈ విషయంపై గవర్నర్ తమిళిసైతో మాట్లాడతానన్నారు. ఈ సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, కోదండరామ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీచర్లు, ఉద్యోగులలో సంతోషం..

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి ముఖాముఖి సమావేశం కావడం పట్ల ఆయా సంఘాలు సంతోషం వ్యక్తం చేశాయి. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ఏర్పాటైన ఈ సమావేశంలో.. ప్రధాన డిమాండ్లను సీఎం దృష్టికి టీజీవోఏ తీసుకెళ్లింది. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో మూడింటిని ఇవ్వాలని, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరింది. వీటితోపాటు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని విన్నవించింది. కాగా, ముఖ్యమంత్రి రెండు గంటలపాటు తమ సమస్యలపై మాట్లాడమే కాకుండా ఎంతో ఓపికగా విన్నారని సంఘాల నేతలు తెలిపారు. గతంలో కనీసం సమస్యలు వినే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. కాగా, వైద్యశాఖలో పని చేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ అందరినీ బదిలీ చేయాలని మెడికల్ జేఏసీ.. ముఖ్యమంత్రిని కోరింది. ఉస్మానియాకు కొత్త భవనం కట్టాలని, అశాస్త్రీయంగా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్యను తగ్గించాలని సూచించింది. ఆస్పత్రుల్లో విధులకు వచ్చే నర్సులు దుస్తులు మార్చుకునేందుకు కనీసం రూమ్‌లు లేని విషయాన్ని నర్సుల అసోసియేషన్ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. ఇక సాధారణ బదిలీలు, పదోన్నతులు, 317 సమస్యను పరిష్కరించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణపై ఆయా సంఘాల ప్రతినిధులు సీఎంకు వినతి పత్రం ఇచ్చారు. ప్రధానంగా టీచర్లకు సంబంధించిన మల్టీజోన్, స్పౌజ్ సమస్యలు, స్థానికత, బదిలీలు, ఆరోగ్య బీమా, పెండింగ్ డీఏ లాంటి సమస్యలను వివరించారు. కాగా వినతి పత్రాలను కొన్నింటిని సీఎం నేరుగా తీసుకున్నారు.

సీఎంకు పీఆర్‌టీయూ నేతల కృతజ్ఞతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించడమే కాకుండా సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం పట్ల పీఆర్‌టీయూ నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

లోకం తీరు



అధికారంలోకి వచ్చిన 72 రోజులకే

31వేల ఉద్యోగాలిచ్చాం

మరో గ్యారెంటీకి శ్రీకారం: పొంగులేటి

మాటిస్తే కాంగ్రెస్ మడమ తిప్పదు: సురేఖ

జీవో 3పై కవిత వ్యాఖ్య విడ్డూరం: సీతక్క

వరంగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాము అధికారంలోకి వచ్చిన 72 రోజుల్లోనే 32వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, యుద్ధప్రతిపాదికన ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువత ఉసురు తీసుకుందని, తాము 11,600 టీచర్ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ కోసం నోటిఫికేషన్ ఇచ్చామని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో రూ.68 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు, వరంగల్ నగరంలో రూ.280.85 కోట్లతో చేపట్టిన పనులకు మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని తెలిపారు. ఒకటో తేదీ నుంచి మూడో తేదీలోపు ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం తమదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని మంత్రి కొండా సురేఖ అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగరానికి రూ.260కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. జీవో నంబరు 3కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం విడ్డూరమని, అసలు ఆ జీవో ఇచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు బంద్ చేసి, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని సూచించారు.

భట్టి నాకు ద్రోహం చేస్తున్నారు

» ఖమ్మం టికెట్‌ను అడ్డుకుంటున్నారు: వీహెచ్

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తనకు ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం లోక్‌సభ సీటు తనకు రాకుండా భట్టి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. 'భట్టిని అప్పట్లో ఎమ్మెల్సీని చేయడంలో నాదే కీలక పాత్ర.. భట్టి ఈరోజు పార్టీలో ఈస్థానంలో ఉండడానికి కారణం నేనే.. 2019 వరకు ఖమ్మంలో ప్రతి కార్యక్రమానికి ఆయన నన్ను రమ్మన్నారు.. ఆ తర్వాత పిలవడం మానేశారు. పనిచేసినోడికి ముఖ్యమంత్రి పదవి రావాలని నేను అన్నందుకే నాపై కక్ష కట్టారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ పార్టీ కోసం చాలా కష్టపడ్డారని చెప్పారు. 'రాహుల్‌ఖమ్మం నుంచి పోటీ చేస్తే నేను తప్పుకుంటా.. లేదంటే ఆ సీటుకు నేను అన్నివిధాల అర్హుడిని.. ఖమ్మం టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తా.. పదవి ఉన్నా లేకపోయినా చనిపోయేవరకు కాంగ్రెస్‌లోనే ఉంటా.. చనిపోయిన తర్వాత పార్టీ జెండా నాపై ఉంటుంది' అని వ్యాఖ్యానించారు.

వీహెచ్‌కు ఖమ్మం టికెటిస్తే కలిసికట్టుగా గెలిపిస్తాం

» నేను అడ్డుపడడం..ఆయన అపోహే: భట్టి

చింతకాని, మార్చి 10: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీదే తుది నిర్ణయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆ కమిటీ నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన భట్టి.. ఎంపీ టికెట్ల కేటాయింపు విషయమై పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం వీహెచ్‌కు ఖమ్మం ఎంపీ టికెట్ ఇస్తే జిల్లా మంత్రులు, నాయకులు, కార్యకర్తలు.. అందరం కలసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని చెప్పారు. ఖమ్మం ఎంపీ టికెట్ వీహెచ్‌కు రాకుండా తాను అడ్డుపడటం లేదని.. అది కేవలం ఆయన అపోహ మాత్రమేనన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా వీహెచ్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో పాటు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ తక్షణ కర్తవ్యమన్నారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక విషయంలో అధిష్ఠానం నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని తెలిపారు.

మాకు న్యాయం చేయండి

» 317 జీవో వల్ల బాధితులుగా మారాం

» మంత్రి దామోదరను కలిసిన నర్సులు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత సర్కారు హయాంలో విడుదల చేసిన జీవో నంబరు 317 వల్ల తాము బాధితులుగా మారామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ నర్సులు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం నిరంకుశంగా జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి తమ జీవితాలతో చెలగాటం ఆడుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 317జీవోపై క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించి, అందరికీ న్యాయం చేస్తామనిమంత్రి ఉద్యోగులకు భరోసానిచ్చారు.

పేదింటి పండుగ

నేడు 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఖమ్మం/భద్రాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. "ఇందిరమ్మ ఇల్లు" పథకం కార్యరూపం దాల్చనుంది. రాములవారు కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం దీనికి వేదిక కానుంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇల్లు ఐదోది. అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో నాలుగు పథకాలను అమలు చేసింది. కాగా, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి మూడు నమూనాలను కూడా సోమవారం ప్రకటించనున్నారు. పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను సర్కారు సిద్ధం చేసింది. ఇల్లు లేని అర్హులైన పేదలందరికీ దశలవారీగా వర్తింపజేయనున్నారు. స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు, లేనివారికి స్థలం ఇచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని నాలుగు దశల్లో మంజూరు చేస్తారు. ఈ ఏడాదిలో నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లను మంజూరు చేయగా.. రిజర్వ్ కోటా (సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిధి)లో మరో 33,500 కేటాయించారు. మొత్తంగా 4.50లక్షల ఇళ్లు మంజూరు కానున్నాయి. తొలి దశలో సొంత స్థలం ఉన్నవారికి అందనుండగా.. స్థలం లేనివారికి రెండో దశలో పథకాన్ని వర్తింపజేస్తారు. ఇంటి నిర్మాణం విషయంలో లబ్ధిదారుదే పూర్తి నిర్ణయం అయినప్పటికీ.. ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో పాటు కచ్చితంగా వంట గది, బాత్‌రూమ్ ఉండాలి. అనంతరం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం కింద నిర్మించినదని తెలిసేలా 'అభయహస్తం' లేదా ప్రత్యేకంగా తయారు చేసే కొత్త లోగోను ఉంచనున్నారు. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల విషయంలో చేసిన తప్పులు ఈసారి జరగకుండా, అర్హులకే పథకం అందేలా మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ పథకానికి అర్హులైన వారు దాదాపు 30-40 లక్షలమంది ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ప్రజాపాలన' దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తయ్యాక హెచ్చుతగ్గులు ఉండొచ్చని కూడా భావిస్తోంది. దరఖాస్తులన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అవసరమైతే గ్రామసభల్లోనూ మరో సారి పరిశీలించనున్నారు. గ్రామసభల్లో వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రొఫార్మాను రూపొందించింది.



పథకం కోసం రుణం..

ఇందిరమ్మ ఇల్లు పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల రుణం తీసుకోనుంది. ఎన్ని ఇళ్లను ఏయే దశల్లో నిర్మిస్తామనే వివరాలను కూడా తెలిపింది. తొలి దశలో గ్రామీణ ప్రాంతాల్లో 57,141, పట్టణాల్లో 38,094 ఇళ్లను నిర్మిస్తామని పేర్కొంటూ ఈ నె 5న జీవో విడుదల చేసింది. దీని ప్రకారం నియోజకవర్గానికి 800 ఇళ్లు అందనున్నట్లు తెలుస్తోంది. ఈ గణాంకాలు, అంచనాలు హడ్కో రుణం కోసం సంబంధించినవేనని సమాచారం. వీటికి మరికొన్ని కలిపి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని మహిళ పేరు మీద అందిస్తారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా నిర్మాణాలను పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుకి రేషన్ కార్డు కచ్చితంగా ఉండాలి. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొంది ఉంటే అనర్హులు. మంజూరైన ఇళ్ల కంటే లబ్ధిదారులు ఎక్కువ ఉంటే.. వారికి మరో విడతలో అందిస్తారు.

సీఎం భద్రాచలం పర్యటన షెడ్యూల్ ఇది

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 12:10 గంటలకు భద్రాచలం రాముడిని దర్శించుకోనున్నారు. 1:30కు వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటుచేసిన సభలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రారంభిస్తారు. 2:30 నుంచి 3:30 మధ్య భద్రాచలం ఆలయం, సాగునీటి, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమై సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షిస్తారు. సాయంత్రం 4 గంటలకు మణుగూరులో సభకు హాజరవుతారు. 6:10 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి చేరుకుంటారు.

భద్రాచలం రామాలయం అభివృద్ధిపై ఆశ

హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా భద్రాచలం వచ్చిన రేవంత్.. అధికారంలోకి వస్తే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం హోదాలో ఇప్పుడు భద్రాద్రి అభివద్ధికి వరాలు ప్రకటిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధికి రూ.100కోట్లు ప్రకటించినా రూపాయీ ఇవ్వలేదు.

అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా హామీలు నెరవేరుస్తున్నాం: తుమ్మల

ఖమ్మంకార్పొరేషన్: ప్రజల సొమ్ము దోచుకోవటమే ధ్యేయంగా పనిచేసిన గత ప్రభుత్వం తమకు అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సాహసంతో ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా బూడిదెంపాడు వద్ద రూ.38.50 కోట్లతో ఖమ్మం-ఇల్లెందు రెండులైన్ల రహదారి నాలుగులైన్లుగా విస్తరణ, అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. సోమవారం భద్రాద్రి రాముడి సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి ఐదో గ్యారెంటీగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. శ్రీశైలం, సాగర్‌లో నీళ్ల లేకపోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలే కారణమన్నారు.



బడుల్లో మార్పు రావాల్సిందే!

» మౌలిక సదుపాయాలు కల్పించండి

» సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని.. వాటిపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కారీ బడులు, కళాశాలలకు తక్షణమే ఉచిత విద్యుత్ అమలయ్యేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ఆదివారం ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష జరిపారు. విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణ బాధ్యతలను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి వాటిని రాష్ట్రంలో అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేసి.. టీ-శాట్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ పాఠాలు అందించాలని, బడులపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని, సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నం చేయాలని, సౌకర్యాలను మెరుగుపరచేందుకు ఎన్నారైల సహకారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఐఎస్‌బీ తరహాలో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. న్యాక్‌పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. సచివాలయం నుంచి కిందిస్థాయి వరకూ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) తీసుకువచ్చే అంశంపై సీఎం చర్చించారు. సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

100 ఐసీయూ పడకలతో కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి



కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి హాజరైన ఏబీఎన్, ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ, ఆస్పత్రి చైర్మన్ భాస్కర్‌రావు తదితరులు

- బేగంపేటలోని కొత్త భవనంలో మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభం
- ఏబీఎన్, ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ, దర్శకుడు రాజమౌళి హాజరు

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా అత్యాధునిక వసతులతో హైదరాబాద్, బేగంపేటలో కొత్తగా నిర్మించిన భవనంలో ఏర్పాటు చేసిన కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, సినీ దర్శకులు ఎస్ఎస్ రాజమౌళి, సినీ నిర్మాత అల్లు అరవింద్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి చైర్మన్ భాస్కర్‌రావు మాట్లాడుతూ కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిని డాక్టర్ గురవా రెడ్డి నేతృత్వంలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిగా ఏర్పాటు చేశామని ప్రకటించారు. ఆర్థోపెడిక్‌తోపాటు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, కార్డియాలజీ, గైనకాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, పల్మొనాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ వంటి అన్ని రకాల వైద్య సేవలు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వంద ఐసీయూ బెడ్‌లు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ 400 పడకల ఆస్పత్రిగా కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆడిటోరియంను ఎస్ఎస్ రాజమౌళితో కలిసి భాస్కర్‌రావు, డాక్టర్ గురవారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, సినీ నటులు మురళీమోహన్, ప్రకాశ్‌రాజ్, జగపతి బాబు, తనికెళ్ల భరణి, గుండు సదర్శన్, ప్రదీప్ మాచిరాజు తోపాటు ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, 12 అంతస్థుల భవనంలో ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రిలో 100 ఐసీయూ బెడ్స్ ఆధునిక వసతులున్న 15 ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి.

బీఆర్ఎస్‌తో బీఎస్పీ పొత్తు

- మాయావతి అనుమతిచ్చారు
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీతో పొత్తు కొనసాగించేందుకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి అనుమతించారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఇరు పార్టీలు కలిసి పోటీచేస్తాయని 'ఎక్స్' వేదికగా ఆదివారం ఆయన వెల్లడించారు. ఎన్డీయే, ఇండియా.. రెండు కూటముల్లో బీఆర్ఎస్ లేనందున ఆ పార్టీతో కలిసి పనిచేసేందుకు బీఎస్పీ అధిష్ఠానం అనుమతించిందని తెలిపారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీలు ఉమ్మడిగా పోటీచేసే స్థానాలపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో జరిగే తదుపరి చర్చలకు బీఎస్పీకి చెందిన రాజ్యసభ ఎంపీ, కేంద్ర సమన్వయకర్త రాంజీ గౌతమ్ బెహన్జీ పాల్గొంటారన్నారు. ఇరు పార్టీల మధ్య సీట్ల పంపకాలు, ఉమ్మడి భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే సంయుక్తంగా మీడియాకు వెల్లడిస్తామని తెలిపారు.

ఏం సాధించారని కరీంనగర్ 'కదనభేరి': బండి సంజయ్

మల్యాల, మార్చి 10: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్ఎస్‌ను ఊడ్చిపారేసినా.. ఆ పార్టీ నేతల తీరు మారలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్‌లో ఏం సాధించారని బీఆర్ఎస్ నేతలు కదనభేరి పేరిట సభ పెడుతున్నారని ప్రశ్నించారు. ఈ సభలో కేసీఆర్ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెబితే తప్ప ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితి లేదన్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో ఆదివారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి కేటీఆర్ కళ్లు నెత్తికెక్కి, కండకావరంతో అనవసరంగా తన గురించి మాట్లాడుతున్నాడని ఫైర్ అయ్యారు. 'ఈనెల 12న జరిగే క్యాబినెట్ సమావేశంలో ఎన్నికల హామీలు, ఆరు గ్యారెంటీల అమలుకు ఆమోదం తెలిపి నిధుల మంజూరుకు ఆదేశాలివ్వాలి. లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసగించినట్లే..' అని వ్యాఖ్యానించారు.

కారులోంచి కమలానికి

(మొదటి పేజీ తరువాయి)

గిరిజన తెగలన్నీ అభివృద్ధి చెందాయని అన్నారు. ఖమ్మం అభివృద్ధి కోసమే బీజేపీలో చేరానని జలగం వెంకట్రావ్ తెలిపారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను విస్మరించిందని, మైనింగ్ యూనివర్సిటీ ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. భద్రాచలం రామాలయాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. మోదీ దూరదృష్టి నచ్చి బీజేపీలో చేరానని సైదిరెడ్డి తెలిపారు. ఆదివాసీ గూడేల అభివృద్ధి మోదీతోనే సాధ్యమని నగేశ్ అన్నారు. దేశమంతా మోదీ పాలనను కోరుకుంటోందని, తెలంగాణ ప్రజలు సైతం అదే ఆశిస్తున్నారని గోమాస శ్రీనివాస్ తెలిపారు.

బీజేపీ మరింత బలపడుతుంది: చుగ్

తెలంగాణలో పదేళ్లుగా కేసీఆర్ అరాచక పరిపాలన సాగించారని తరుణ్‌చుగ్ విమర్శించారు. తండ్రి, కొడుకు, కూతురు కలిసి రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఐదుగురు కీలక నేతల చేరికతో రాష్ట్రంలో బీజేపీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో అత్యధిక పార్లమెంట్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కారే కొలువుదీరుతుందని తెలిపారు. తెలంగాణలో భవిష్యత్తు బీజేపీదేనని చెప్పారు.

నేడు బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ దగ్గర పడుతున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టింది. దేశవ్యాప్తంగా 543 స్థానాలకు గాను ఇప్పటికే 195 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించింది. మిగిలిన స్థానాలకు సంబంధించి ఇప్పటికే కోర్ కమిటీ సమావేశాలు నిర్వహించింది. సోమవారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ప్రధాని మోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొనే అవకాశం ఉంది. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలకు గాను తొలి జాబితాలో 9 మంది అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. మరో ఎనిమిది స్థానాలపై శనివారం ఢిల్లీలో చర్చ జరిగింది. అయితే, రెండో జాబితాలో తెలంగాణకు సంబంధించి ఐదారు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆదివారం బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన నలుగురి పేర్లు రెండో జాబితాలో ఉంటాయని తెలిసింది. ఆదిలాబాద్ నుంచి సిటింగ్ ఎంపీ బాపూరావును కాదని మాజీ మంత్రి నగేశ్‌కు సీటు ఖరారు చేసినట్టు సమాచారం. మహబూబాబాద్ నుంచి మాజీ ఎంపీ సీతారాం నాయక్, ఖమ్మం నుంచి మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్, నల్లగొండ నుంచి మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పేర్లు రెండో జాబితాలో ఉంటాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకు పెద్దపల్లిలో గాయకుడు మిట్టపల్లి సురేందర్ పేరు దాదాపుగా ఖరారైనట్టేనని అందరూ భావించారు. అయితే, అనూహ్యంగా అదే నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పార్టీలో చేరారు. పెద్దపల్లి టికెట్ తనదేనని శ్రీనివాస్ చెబుతుండగా.. ఆ స్థానం తనకే దక్కుతుందని సురేందర్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రెండో జాబితాలోనే మహబూబ్‌నగర్ స్థానాన్ని ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. అక్కడ డీకే అరుణ, జితేందర్ రెడ్డి పోటీ పడుతున్నారు. వీరిలో ఒకరి పేరును ఇప్పటికే ఫైనల్ చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మెదక్ నియోజకవర్గం నుంచి బలమైన నేతను నిలబెట్టాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. వరంగల్ నుంచి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌ను రంగంలోకి దింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ఆ స్థానం నుంచి మాజీ ఐపీఎస్ అధికారి కృష్ణ ప్రసాద్, పార్టీ సీనియర్ నేతలు చింతా సాంబమూర్తి, శ్రీధర్ వంటి నేతలు పోటీ చేయాలని ఆశిస్తున్నారు.

సైదిరెడ్డి చేరికపై తీవ్ర అసంతృప్తి..

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డిని పార్టీలో చేర్చుకోవడంపై బీజేపీ సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సైదిరెడ్డికి టికెట్ ఇవ్వొద్దని జాతీయ నాయకత్వానికి లేఖ రాశారు. ఒకవేళ ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తే తాము సహకరించబోమని తేల్చిచెప్పారు. కాగా, బీజేపీ సీనియర్ నేత మేడ్చల్-మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు హరీశ్ రెడ్డి తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.

రేపు తెలంగాణకు అమిత్ షా

హైదరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా మంగళవారం రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఉదయం 11 గంటలకు ఆయన భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఇంపీరియల్ గార్డెన్స్‌లో పార్టీ సోషల్ మీడియా వారియర్స్‌తో సమావేశమవుతారు. 2 గంటలకు ఎల్బీ స్టేడియంలో పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి నాయకులతో నిర్వహించనున్న సమ్మేళనంలో పాల్గొంటారు. ఈ సభ ఏర్పాట్లపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 12 ఎంపీ స్థానాలను గెలుచుకుంటుందని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ చెప్పారు. కాంగ్రెస్ హామీలను అమలు చేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పాస్‌పోర్టు కేసులో ఏసీబీ ఎంట్రీ!

- కీలక దశలో సీఐడీ విచారణ
- జగిత్యాలలో మరో ముఠా గుట్టురట్టు
- గతంలో పట్టుబడ్డ ముఠాలపైనా సీఐడీ ఫోకస్

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నకిలీ ధ్రువీకరణ పత్రాలతో శ్రీలంక, ఇతర దేశస్తులకు భారత పౌరసత్వం కల్పించి, పాస్‌పోర్టులు ఇప్పించిన కేసులో.. ముఠాలకు సహకరిస్తున్న ఇతర ప్రభుత్వోద్యోగులపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దృష్టి సారించింది. ఈ కోవలో స్పెషల్ బ్రాంచ్(ఎస్బీ) పోలీసులతోపాటు.. పలు ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది సహకారం ఉన్నట్లు ఇప్పటికే తేలింది. ఈ క్రమంలో ఎస్బీ సిబ్బందిపైనా సస్పెన్షన్ వేటు పడింది. ఐదుగురు పోలీసులు సస్పెండ్ అవ్వగా.. వారిని సీఐడీ అరెస్టు చేసింది. మరికొందరు పోస్టల్ ఉద్యోగుల పాత్ర తేలడంతో, వారినీ అరెస్టు చేసినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. ఎస్బీ విచారణ సమయంలో కానిస్టేబుళ్లకు డబ్బులు ఇచ్చి, మేనేజ్ చేసుకున్నట్లు ఇప్పటికే నిందితులు సీఐడీకి ఇచ్చిన వాంగ్మూలంలో వెల్లడించారు. ఆ స్టేట్‌మెంట్ ఆధారంగా ఇప్పుడు ఏసీబీ అధికారులు అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు పెట్టి, దర్యాప్తునకు సిద్ధమవుతున్నారు.

రోజుకొకరుగా పట్టుబడుతున్న ముఠా

ఈ కేసులో రోజుకు కనీసం ఒకరు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా జగిత్యాలలో మరో ముఠా పట్టుబడింది. ఈ ముఠాలకు పశ్చిమ బెంగాల్ కేంద్రంగా ఉన్న కొన్ని గ్యాంగులు నకిలీ సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. జగిత్యాలకు చెందిన మహేశ్ గల్ఫ్ వెళ్లేందుకు పాస్‌పోర్టు కోసం ప్రయత్నించాడు. 'ఇమిగ్రేషన్ చెక్ నాట్ రిక్వైర్డ్' స్టాంపింగ్ కోసం పదోతరగతి నకిలీ సర్టిఫికెట్‌ను జత చేశాడు. ఇందుకు చంద్రయ్య అలియాస్ చందూ సహకరించాడు. కరీంనగర్‌కు చెందిన రజిత, శ్రావణ్‌కుమార్ దంపతులను సంప్రదించి, రూ.28 వేలకు ఓపెన్ ఎస్సెస్సీ సర్టిఫికెట్ పొందాడు. అయితే.. ఎస్బీ విచారణ సమయంలో మహేశ్ పదోతరగతి సర్టిఫికెట్ నకిలీదని తేలడంతో ముఠా గుట్టురట్టయింది. అయితే.. పోలీసుల దర్యాప్తులో రజిత, శ్రావణ్‌కుమార్ పశ్చిమ బెంగాల్‌కు చెందిన రబీరాయ్, లక్ష్మీరాయ్ సాయంతో ఐదేళ్లుగా నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్నట్లు తేలింది. పదోతరగతి, ఇంటర్ సర్టిఫికెట్లకు రూ.30 వేలు, డిగ్రీ సర్టిఫికెట్‌కు రూ.40 వేలు, ఇంజనీరింగ్ సర్టిఫికెట్‌కు రూ.50 వేల నుంచి రూ.60 వేల చొప్పున బెంగాల్ ముఠా వసూలు చేస్తున్నట్లు దర్యాప్తులో నిర్ధారించారు. రజిత, శ్రావణ్‌కుమార్ లాంటి ఏజెంట్లు ఇక్కడి నుంచి ఆర్డర్లివ్వగానే.. బెంగాల్ ముఠా నకిలీ సర్టిఫికెట్లను తయారు చేసి, కొరియర్‌లో పంపుతుందని తేలింది. బెంగాల్ ముఠాపైనా సీఐడీ పోలీసులు దృష్టి సారించారు. అదే సమయంలో నకిలీ సర్టిఫికెట్ల కేసుల్లో గతంలో పట్టుబడ్డ ముఠాలను కూడా జల్లెడపడుతున్నారు.

ఆంధ్రోళ్ల బూట్లు నాకి.. పార్టీలు మారిన రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో గెలిచే వాడే మగోడా? ఓడినవాడు కాదా? అట్లైతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి ఇద్దరం పోటీ చేద్దామని, ఎవరు మగాడో తేల్చుకుందామని సవాల్ విసిరారు. కామారెడ్డిలో ఆదివారం బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, కాంగ్రెస్ పాలనలో రైతుల బతుకులు ఆగమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సాగునీరు ఇవ్వడం మానేసి.. మేడిగడ్డ పిల్లర్లు కుంగాయంటూ కాంగ్రెస్ రాజకీయ పబ్బం గడుపుతోందన్నారు. రేవంత్‌రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎన్నికల కోడ్ రాకముందే ఆడబిడ్డలకు రూ.2500, పంట నష్టపోయిన వారికి ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత యాసంగి సీజన్ నుంచే ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడంతోపాటు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలన్నారు. మార్చి 15వ తేదీ వరకూ ఓపికగా ఉంటామని, అప్పటికీ హామీలు అమలుచేయకపోతే కాంగ్రెస్ భరతం పడతామని హెచ్చరించారు. 39 స్థానాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి ప్రజలు ప్రతిపక్ష హోదాను ఇచ్చారన్నారు. ప్రజల తీర్పును తాము స్వీకరిస్తున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి ముందుకు వెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని త్వరలోనే ప్రకటిస్తామని, భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇస్తుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు.



కామారెడ్డిలో మాట్లాడుతున్న కేటీఆర్

భగ్గుమన్న విభేదాలు

కామారెడ్డి బీఆర్ఎస్ నాయకుల మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. కేటీఆర్ సమక్షంలోనే నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పార్టీ ముఖ్యనేత తిర్మల్‌రెడ్డి.. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేరు ప్రస్తావించలేదంటూ ఆయన అనుచరులు ఆందోళనకు దిగారు. పలువురు నేతలు స్టేజి వద్దకు దూసుకువచ్చి తిర్మల్‌రెడ్డిని నిలదీశారు. మరోవైపు.. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కామారెడ్డి సెగ్మెంట్ బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు అప్పగిస్తే బీఆర్ఎస్‌కు తాను రాజీనామా చేస్తానని పార్టీ సీనియర్ నేత నిట్టు వేణుగోపాల్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనతో పాటు మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, మరో ఆరుగురు కౌన్సిలర్లు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

మరమ్మతు చేసి సాగునీళ్లివ్వండి

'ప్రభుత్వాన్ని ఎవరు కూల్చినా మానవబాంబులు అవుతామని రేవంత్‌రెడ్డి అంటున్నాడు.. మానవ బాంబులు కాంగ్రెస్‌లోనే ఉన్నాయి. మెడలో పేగులు వేసుకుంటా.. జేబులో కత్తెర్లు పెట్టుకొని తిరుగుతున్నా.. లాగులో తొండలు సొర్రగొడుతా' అనేవి ముఖ్యమంత్రి మాట్లాడే మాటలేనా? అని కేటీఆర్ ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే మేడిగడ్డ ప్రాజెక్టుకు మరమ్మతు చేసి సాగునీళ్లు ఇవ్వాలన్నారు. కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఒక్క పనైనా చేశాడా? అని ఆయన ప్రశ్నించారు.

జహీరాబాద్ బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ భేటీ

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్యనేతలతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ వ్యూహం, గెలుపే లక్ష్యంగా చేపట్టాల్సిన కార్యాచరణ వంటి అంశాలపై చర్చించారు. ఆదివారం నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ ముఖ్యులు పాల్గొన్నారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులు, సిటింగ్ ఎంపీ పార్టీని వీడటం, ఇతర అంశాలపై పార్టీ నేతలతో కేసీఆర్ చర్చించినట్లు తెలుస్తోంది. జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ పేరును కేసీఆర్ నిర్ణయించినట్లు సమాచారం.

ప్రణీత్‌రావుపై ఎఫ్ఐఆర్

- ఐపీసీ, పీడీపీపీ, ఐటీ చట్టాల కింద కేసు
- నాన్-బెయిలబుల్ సెక్షన్ల ప్రయోగం
- ఎస్ఐబీలో హార్డ్‌డిస్క్‌లు, కంప్యూటర్ల కాల్చివేతపై అదనపు ఎస్పీ రమేశ్ ఫిర్యాదు
- పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు

పంజాగుట్ట/హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ)లో తన అధికారాన్ని దుర్వినియోగం చేసి, విపక్ష నాయకుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న డీఎస్పీ ప్రణీత్‌రావుపై కేసు నమోదైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాతి రోజున.. అంటే.. గత ఏడాది డిసెంబరు 4న ప్రణీత్‌రావు కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లను కాల్చివేశాడంటూ ఎస్ఐబీ అదనపు ఎస్పీ డి.రమేశ్ ఆదివారం పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంజాగుట్ట పోలీసులు ప్రణీత్‌రావుపై భారత శిక్షా స్మృతి(ఐపీసీ)లోని 409, 427, 201, 120(బి) సెక్షన్లు, ప్రివెన్షన్ ఆఫ్ డామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ చట్టంలోని సెక్షన్ 3, సమాచార సాంకేతిక(ఐటీ) చట్టంలోని సెక్షన్లు 65, 66, 70 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రణీత్‌రావు 2018 నుంచి ఎస్ఐబీలో పనిచేస్తున్నారు. తొలుత ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ప్రణీత్‌రావుకు గత ఏడాది యాగ్జిలరీ పదోన్నతి లభించింది. దాంతో డీఎస్పీ అయ్యారు. "ఎస్ఐబీలోని ఇతర బృందాలతో సంబంధం లేకుండా.. తన కోసం ప్రత్యేకంగా రెండు గదులను ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ ఇంటర్నెట్ కనెక్టివిటీతో 17 కంప్యూటర్లను ఏర్పాటు చేసుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా, అనధికారికంగా, చట్ట విరుద్ధంగా సేకరించేవారు. ఆ కార్యకలాపాలన్నీ ప్రణీత్‌రావు స్వయంగా పర్యవేక్షించేవారు" అని అదనపు ఎస్పీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబరు 3న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఆ తర్వాతి రోజున ప్రణీత్‌రావు తన కార్యాలయంలోని సీసీ కెమెరాలను ఎలక్ట్రీషియన్‌తో ఆఫ్ చేయించారు. 17 కంప్యూటర్లలో ఉన్న డేటాను, సమాచారాన్ని, హార్డ్‌డిస్క్‌లతో సహా కాల్చివేశారు. ఎవరికీ అనుమానం రాకుండా.. కొత్త హార్డ్‌డిస్క్‌లను ఏర్పాటు చేశారు. తన పదవిని దుర్వినియోగం చేస్తూ.. ఇతరులతో కలిసి, ఉద్దేశపూర్వకంగా కుట్రలు పన్నారని అదనపు ఎస్పీ రమేశ్ పంజాగుట్ట పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పంజాగుట్ట పోలీసులు వివరించారు.



నేడో రేపో అరెస్టు?

ప్రణీత్‌రావును పంజాగుట్ట పోలీసులు ఒకట్రెండ్రోజుల్లో అరెస్టు చేసే అవకాశాలున్నాయి. ఇప్పటికే డీజీపీ రవిగుప్తా ఆయనను సస్పెండ్ చేశారు. జిల్లా హెడ్‌క్వార్టర్స్ దాటి వెళ్లకూడదంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఇక ప్రణీత్‌రావుపై పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు నాన్-బెయిలబుల్ కేటగిరీలో ఉన్నాయి. అంటే.. ప్రణీత్‌రావు ముందస్తు బెయిల్ తీసుకునేందుకు వీల్లేదు. అరెస్టయ్యాక కూడా.. బెయిల్ వచ్చే అవకాశాలు తక్కువే. తీవ్రమైన కేసు కావడంతో ప్రభుత్వం దర్యాప్తు బాధ్యతను సీఐడీకి అప్పగించే అవకాశాలున్నాయి. లేనిపక్షంలో సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)ను ఏర్పాటు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రణీత్‌రావు అరెస్టయ్యాక.. కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని విచారించే అవకాశాలున్నాయి.

తల్లిదండ్రులే పిల్లల పాలిట కర్కోటకులై...

- పాలల్లో విషం కలిపి తాగించి ఇద్దరి ప్రాణం తీశారు
- మహబూబాబాద్ జిల్లా అంకన్నగూడెంలో ఘటన

గార్ల (మహబూబాబాద్ జిల్లా) మార్చి 10: మూడేళ్ల పాప ఒకరు.. అసలు లోకమే తెలియని 11 నెలల చిన్నారి మరొకరు.. వారి ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో శవాలై కనిపించారు. వరుసగా ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారనో.. మరేదైనా కారణమో తెలియదు కానీ.. పాలల్లో పురుగు మందు కలిపి ఇచ్చి అభంశుభం తెలియని ఆ ఇద్దరు ఆడపిల్లల ప్రాణాలను తల్లిదండ్రులే తీశారనే అనుమానాలు బలంగా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేట గ్రామపంచాయతీ అంకన్నగూడెంలో ఆదివారం జరిగిన ఈ అమానవీయ ఘటనలో మరణించిన చిన్నారుల తల్లిదండ్రులు పరారీలో ఉన్నారు. అంకన్నగూడెంనకు చెందిన పెండగట్ల అనిల్, బయ్యారం మండలం నామాలపాడు చెందిన దేవి ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అనిల్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా దేవి కూలి పనులకు వెళుతుంటుంది. ఈ దంపతులకు లాస్య(3 ఏళ్లు), జశ్విత (11 నెలలు) అనే కుమార్తెలు ఉన్నారు. అనిల్ ఇంటిపక్కనే మరో ఇంట్లో అతని తండ్రి వెంకన్న నివాసముంటారు. అనిల్ దంపతులు ఎప్పట్లాగే శనివారం రాత్రి కూడా పిల్లలతో కలిసి ఇంట్లోనే నిద్రించారు. ఆదివారం తెల్లవారేసరికి ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన వెంకన్న.. కిటికీలో నుంచి లోపలికి తొంగి చూశాడు. లాస్య జశ్విత విగతజీవులుగా మంచంపై పడి ఉండడాన్ని చూసి చుట్టుపక్కల వారికి విషయం చెప్పి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పరిశీలించి.. మంచంపై ఉన్న పాలడబ్బా, పక్కనే ఉన్న పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకున్నారు. అనిల్ దంపతుల ఆచూకీ లేకపోవడంతో... అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి చిన్నారుల మరణంపై దర్యాప్తు ప్రారంభించారు. పాలల్లో పురుగుల మందు కలిపి తాగించి అనిల్ దంపతులే చిన్నారులను హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వేతన సవరణతో బాధ్యత కూడా పెరిగింది

- ఉద్యోగులకు టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ దిశానిర్దేశం

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణతో ఆర్టీసీ ఉద్యోగుల బాధ్యత మరింత పెరిగిందని టీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ అన్నారు. ప్రభుత్వం సంస్థపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, మరింత నాణ్యమైన సేవలందించి ప్రజా రవాణా వ్యవస్థను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. 2017 వేతన సవరణలో భాగంగా 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన నేపథ్యంలో ఆర్టీసీ బస్‌భవన్ నుంచి క్షేత్రస్థాయి సిబ్బందితో సజ్జనార్ ఆదివారం వర్చువల్‌గా మాట్లాడారు. 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటనపై సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ బకాయిల నుంచి బయటపడాలంటే ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలని, ఆక్యుపెన్సీ రేషియో తగ్గకుండా బస్సులు నడపాలని సిబ్బందికి సూచించారు. మహాలక్ష్మి పథకం కింద 90 రోజులుగా 25 కోట్లమంది మహిళలను గమ్యస్థానాలకు చేర్చామని ఇదంతా సిబ్బంది కృషి వల్లనేనని ప్రశంసించారు.

ఠాణాలోనే రౌడీషీటర్ బర్త్‌డే వేడుకలు

- మొగుళ్లపల్లి ఎస్సైపై బదిలీ వేటు..!

మొగుళ్లపల్లి, మార్చి 10: ఠాణాలోనే రౌడీషీటర్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన ఓ ఎస్సైపై బదిలీ వేటు పడింది..! జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 3న మండల కేంద్రానికి చెందిన రౌడీషీటర్ వేముల మహేందర్‌గౌడ్ జన్మదిన వేడుకలను ఎస్సై తీగల మాధవ్‌గౌడ్ నిర్వహించి కేక్ కట్ చేయించారు. ఈ విషయం కాస్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారి.. పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ఎస్సై మాధవ్‌గౌడ్‌ను ఆసిఫాబాద్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మొగుళ్లపల్లి ఎస్సైగా అశోక్ బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

భారత్ జాగృతి కమిటీలన్నీ రద్దు!

హైదరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భారత్ జాగృతికి సంబంధించిన కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఆ సంస్థ కార్యాలయం వెల్లడించింది. భారత్ జాగృతి అధ్యక్షురాలు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదేశం మేరకు విదేశీ, జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీలను రద్దు చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం తిరోగమనంలోకి..

- పల్లెలు, పట్టణాల్లో తాగునీటి సమస్య: జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మూడు నెలల పాలన తెలంగాణను తిరోగమనం వైపు తీసుకువెళ్తోందని మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి విమర్శించారు. పల్లెలు, పట్టణాల్లో తాగునీటి సమస్య పెరుగుతోందని, ప్రజలు ట్యాంకర్ల కోసం ఎదురుచూసే రోజులు మళ్లీ వచ్చాయని ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రాజెక్టుల్లో నీళ్లనా.. వాటిని వినియోగించే విధానం ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదు. నాగార్జున సాగర్‌లో నీళ్లున్నా పంటల సాగుకు నీళ్లివ్వడం లేదు. కర్ణాటక నుంచి నీళ్లడిగి తీసుకోవడానికి ఈ సర్కారు ప్రయత్నించడం లేదు' అని మండిపడ్డారు. ఎటువంటి సమీక్షలు జరపకుండా.. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. మానవ బాంబులు అవుతాం.. పేగులు మెడలో వేసుకుంటామంటూ ఉన్మాద భాష మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. పేద రైతుల పేగులు మెడలో వేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. గుత్తా అమిత్‌రెడ్డిని ఎవరూ అడ్డుకోవడం లేదని, ఆయనే అలా చెప్పుకుంటున్నారన్నారు. నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను అధినేత కేసీఆర్ రెండ్రోజుల్లో ప్రకటిస్తారని చెప్పారు.

తిరుమలలో మూడేళ్ల బాలుడి కిడ్నాప్

- నాలుగున్నర గంటల్లో తల్లి ఒడికి చేర్చిన పోలీసులు

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం మూడేళ్ల బాలుడు కిడ్నాప్‌కు గురయ్యాడు. సీసీ కెమెరాల ఫుటేజ్, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం ఆధారంగా నాలుగున్నర గంటల్లోనే కిడ్నాపర్‌తో సహా బాలుడిని పోలీసులు తిరుపతిలో గుర్తించారు. తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజకు చెందిన నగేష్, పరిమళ దంపతులు కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం ఆదివారం తిరుమలకు వచ్చారు. గది లభించకపోవడంతో రద్దీగా ఉండే యాత్రికుల వసతి సముదాయం-2 (పీఏసీ-2)లో సేదతీరారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పరిమళ నిద్రలేచి చూడగా కుమారుడు అభినయ్ (3) కనిపించలేదు. దీంతో తిరుమల టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. వారు తిరుపతి రైల్వేస్టేషన్ ఎదుట బాలుడిని తీసుకువెళుతున్న మహిళను సీసీ ఫుటేజీలో గుర్తించారు. కొంత సమయానికి తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్ వద్ద ఓ లాడ్జిలో ఆ మహిళ బాలుడితో ఉన్నట్టు సమాచారం అందగా పోలీసులు కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకుని బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రుల నుంచి దూరమైన బిడ్డను తిరిగి అమ్మఒడికి చేర్చడంలో సోషల్ మీడియా కీలకపాత్ర పోషించింది. ఓ ఆర్టీసీ ఉద్యోగి వాట్సాప్‌లో వచ్చిన ఫొటోలు, సమాచారం ఆధారంగా కిడ్నాపర్‌ను గుర్తించి పోలీసులకు సమాచారమివ్వడంతోనే కిడ్నాప్ ఉదంతం సుఖాంతమైంది.

టీచర్ల బదిలీలను చేపట్టాలి: యూటీఎఫ్

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): న్యాయపరమైన చిక్కులను తొలగించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర విస్తృత స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ నేతలు మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కోర్టు అడ్డంకులను తొలగించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

వివిధ

vividha@andhrajyothy.com సాహిత్య వేదిక

ఒకరుండాలి



ఒకరుండాలి. బ్లేడ్తో పెన్సిల్ చెక్కుతున్నప్పుడు చూపుడు వేలు చివర తెగి రక్తం బొట బొటా కారుతున్నప్పుడు అదాటుగా వేలును నోటిలో పెట్టుకుని చప్పరించే అమ్మాయిలా ఒకరుండాలి.

ఈదురుగాలికి ఒక్కసారిగా దుమ్ములేచి కంట్లో కారంలో పడినప్పుడు చెంపలను అరచేతుల్లోకి తీసుకుని పూల రెక్కల కనురెప్పలను విప్పదీసి ఉఫ్ ఉఫ్ మని కళ్ళల్లోకి ఊదే మిత్రుడులా ఒకరుండాలి.

తుమ్మముళ్ళు అరికాలి మడమలోకి మెత్తని పులిలా కసుక్కున దిగినప్పుడు ప్రేమగా పాదాన్ని మోకాలి మీద పెట్టుకుని ఇంకా ఉమ్ము రాసి పిన్నీసుతో నొప్పి తెలియ కుండా ముల్లుసుతీసి రాయుప్పు పెట్టి అగ్గితో కాకపెట్టిన వదినమ్మ లాంటి ఒకరుండాలి.

అల్లరి చేశాడని పట్టరానికోపంతో పిల్లాడిని అదేపనిగా కొట్టేస్తే ఏడ్చి ఏడ్చి అలసిపోయి వాడు నిద్రపోతే ఆనక ఎత్తుకొని వొళ్ళో పండబెట్టుకుని మండుతున్న పొయ్యి ముందుకూర్చుని ఏడుస్తూ పుల్లలేగదోస్తున్న అమ్మలాంటి ఒకరుండాలి.

తనను ప్రాణప్రదంగా చూసుకునే నాన్న కాలేయం చెడిపోయి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నప్పుడు పక్కటెముకను తీసిఇచ్చినట్లు తన కాలేయన్ని కొంత తీసి ఇచ్చి పునర్జన్మ ప్రసాదించిన తల్లిలాంటి కూతురు ఒకరుండాలి.

వణుకుతున్న చేతులతో కాఫీగ్లాసును చేతికి అందించ లేక సతమతమవుతున్న నరాలు పైకి తేలిన తాతయ్య చేతులమీద తన మృదువైన చేతులు అదిమిపట్టి గ్లాసును నోటికి అందించిన మనవరాలు లాంటి ఒకరుండాలి.

నెలల పసిపాపకు ఒంటినిండా నూనె పట్టించి గోరువెచ్చని నీళ్లతో సున్నిపిండి స్నానం చేయించి చివరన చిన్నారి ముక్కును నోట్లో పెట్టుకుని పీల్చి తుపుక్కున ఉమ్మిన అమ్మమ్మ లాంటి ఒకరుండాలి.

అప్పుడే ఈనిన లేగదూడ ఒళ్లంతా గొప్ప తన్మయత్వంతో నాకుతున్న తల్లిఆవులా అప్పుడే రాసిన తడియారని కవి తను గొప్ప ప్రేమతో వినే మిత్రుడున్నట్టు ఒకరుండాలి.

చివరాఖరుకు ఆ ఒక్కరు నలుగురు అవ్వాలి, ఆ నలుగురు వెనక్కి తిరిగి చూసుకుంటే పెద్ద సమూహం అవ్వాలి.

శిఖామణి
98482 02526

వర్తన రెండవ సమావేశం

వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో రెండవ సమావేశం మార్చి 17 ఉ.10.30గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. 'కవిత్వ వాస్తవికత' అనే అంశంపై కవి సిద్ధార్థ ప్రసంగిస్తారు. అధ్యక్షత రూప్ కుమార్ డబ్బీకార్.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

ఉమ్మడిశెట్టి అవార్డు

36వ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డుకు 2023 సంవత్సరానికి బండి సత్యనారాయణ కవిత్వ సంపుటి 'ఒంటి కాలు పరుగు' ఎంపికైంది.

సుంకర గోపాలయ్య

పెన్నా సాహిత్య పురస్కారం

పెన్నా సాహిత్య పురస్కారం 2023 సంవత్సరానికి వశిష్ఠ సోమేపల్లి కవిత్వ సంపుటి 'ఆకు రాలినచప్పుడు' ఎంపికైంది. త్వరలో జరిగే పెన్నా రచయితల సంఘం వార్షికోత్సవ సభలో పురస్కార ప్రదానం ఉంటుంది.

అవ్వారు శ్రీధర్ బాబు

రచనలకు ఆహ్వానం

మక్కెన రామ సుబ్బయ్య కథా పురస్కారం, నెల్లుట్ల కవితా పురస్కారం, కె.వి. రావు కవితా ప్రక్రియ పురస్కారం (మినీ కవితలు, గజల్స్, నానీలు, హైకూలు, దీర్ఘకవితలు), సాహితీ పురస్కారం (సమీక్ష/ విమర్శ), బాలసాహిత్య పురస్కారం (కథ, కవిత, గేయం), విజ్ఞాన - మనోవైజ్ఞానిక పుస్తక పురస్కారం... ఈ విభాగాల్లో రచయితలు 2023లో ప్రచురించిన పుస్తకాలు మూడేసి ప్రతులను ఏప్రిల్ 8లోగా చిరునామా: మక్కెన శ్రీను, అసోసియేట్ డీన్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, గరివిడి, విజయ నగరం జిల్లా - 535 101, ఏ.పి.కు పంపాలి. పురస్కార గ్రహీతలకు రూ.7000 నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కారం ఉంటుంది.

మక్కెన శ్రీను

మట్టి వెతల కళింగాంధ్ర కవిత

రెండువేల సంవత్సరం నుంచి ఇప్పటివరకు అనగా రెండు దశాబ్దాల పైచిలుకు కాలంలో కళింగాంధ్ర కవిత్వపు వస్తుశిల్పాలు విమర్శకు గురికావాల్సిన ఆవశ్యకత వుంది. ఇరవై ఒకటవ శతాబ్దపు తొలి రెండు దశాబ్దాలు పూర్తయి మూడో దశాబ్దంలోకి అడుగుపెట్టింది కళింగాంధ్ర. ఈ కాలవ్యవధిలో కళింగాంధ్ర నేల మీద జరిగిన రాజకీయ సామాజిక ఘటనలు- ఆ నేపథ్యంలో వచ్చిన కవిత్వం- వాటి వ్యక్తీకరణ తీరుతెన్నులు రాబోయే భవిష్యత్తు సాహిత్య వాతావరణాన్ని కచ్చితంగా ప్రభావితం చేస్తాయి. ఈ రెండు దశాబ్దాల కళింగాంధ్ర కవిత్వం భవిష్యత్తు కళింగాంధ్ర కవిత్వానికి చోదక శక్తిగా వుంటుందా? అనేది తరచి చూసుకోవాల్సిన ఆవశ్యకత వుంది. ఈ క్రమంలో ఏర్పడ్డ ఖాళీలను కచ్చితంగా పూరించుకోవాల్సిన పెద్ద బాధ్యతే ఉంది. ఖాళీలను పూరించడం చారిత్రక అవసరం అని కళింగాంధ్ర నేలను భుజానికెత్తుకునే సృజనకారులుగా గుర్తెరగాలి. ఈ నేల మీద అపారమైన వనరులున్నట్టే- అపారమైన సాహిత్య వస్తువుంది. ఇప్పటివరకు కళింగాంధ్ర వస్తువు సాహిత్యంలోకి ఎంతగా వచ్చిందో గమనించుకోవాలి.

ఇరవై ఒకటవ శతాబ్దపు కళింగాంధ్ర కవిత్వాన్ని దగ్గరగా పరిశీలించినప్పుడు- కచ్చితంగా ఇది 'ప్రజాదారి' అని అర్థమౌతుంది. విప్లవోద్యమం బాటలో నడిచిన పాణిగ్రాహి వారసులం మనం. కళింగాంధ్రలో విప్లవోద్యమ అడుగులే లేకపోతే బహుశా ఇప్పటి కళింగాంధ్ర కవిత్వం ఈ తీరుగా వుండదు. ఇక్కడి కవి వలసదుఃఖాన్ని తలకెత్తుకొన్నాడంటే- కార్మికవర్గ స్పృహని రగిలించుకున్నాడంటే- ఈ నేలమీద జరుగుతున్న అనేక రాజకీయ సామాజిక ఘటనల సంఘర్షణను అర్థం చేసుకుని కవిత్వంగా మొగ్గతొడుగుతున్నాడంటే- ఈ అన్నింటి వెనుక కచ్చితంగా కళింగ నేలమీద జరిగిన విప్లవోద్యమ ప్రకంపనల స్పర్శ లేకుండా లేదు- కాబట్టి ఇప్పటి కళింగాంధ్ర కవిత్వానికి బీజాలు విప్లవోద్యమం ఉత్పత్తే!

2

కొత్త శతాబ్దపు తొలినాళ్ల కళింగాంధ్ర కవిత్వంలో మనం కచ్చితంగా చెప్పుకోవాల్సినవి- 'నాగేటిచాలుకు నమస్కారం' (2002), 'నాగలి' (2006), 'దుఃఖ్ఖేరు' (2005), 'నిప్పులవాగు' (2005), 'మట్టి చెట్టూ పిట్ట భజనిక' (2006)- ఐదూ వ్యవసాయ నేపథ్య దీర్ఘకవితలే. ఈ ఐదు దీర్ఘ కవితలూ- తరువాత రాబోయే కళింగాంధ్ర వ్యవసాయ కేంద్రక కవిత్వానికి తొలి విత్తనాలు వేసాయనే చెప్పి తీరాలి.

3

'నాగేటి చాలుకు నమస్కారం', 'నాగలి' రెండూ గంటేడ గౌరునాయుడు రాసినవి. 'నాగేటిచాలుకు నమస్కారం' కవి దుఃఖాలాపన. ఈ కవితలో రైతు సాదాసీదా జీవితం కవిత్వంలోకి వస్తుంది. సహజాలంకారమైన జీవితం- వానలు కురవడం, విత్తనాలు జల్లడం, ఉడుపులు- ఇలా వ్యవసాయ అనుబంధ అంశాలతో కవిత కళకళలాడుతుంది. రైతు సాంస్కృతిక జీవితం కవితలో పరుచుకుంటుంది: "రానున్న పంటలతో/ నిండాలని తమ గాదులు/ రైతన్నల కన్నుల్లో/ ఉదయించే ఉగాదులు" అని అన్న కవి- "కలలు చెడగొట్టింది కార్తీకం/ కలత నిదర చెదురయ్యింది కార్తీకం/ నల్లమబ్బులు తెచ్చి కార్తీకం/ వాయుగుండాలనే రేపె కార్తీకం" అంటాడు. 'నాగేటి చాలుకు నమస్కారం' 2002లో వస్తే 'నాగలి' 2006లో వచ్చింది. 'నాగేటి చాలుకు నమస్కారం' రాసిన నాలుగేళ్ల తర్వాత కూడా కవిని వ్యవసాయ సంక్షోభం కల్గించిన దుఃఖపీడన వదలలేదు అనడానికి ఈ 'నాగలి' దీర్ఘకవిత ఒక చిహ్నం.

'నాగలి' ప్రచురణకు మునుపే 1990 పూర్వపరాల్లో రాసి- 2005లో ప్రచురణ జరిగిన- 'దుఃఖ్ఖేరు'లో పొలిపొలి, నాగళ్ళు, దుక్కిటేరు అను మూడు కవితలున్నాయి. 'దుఃఖ్ఖేరు'ను శృతి కావ్యం అన్నారు ఛాయరాజ్. ఒకటి- 'పొలి పొలి'లో గ్రామీణ వ్యవసాయ జీవిత సాంస్కృతిక అంశాలను- వాటి మధ్య వున్న విప్లవ చర్యను- అక్షరబద్ధం చేస్తారు. ఈ కవిత 1995, 96లో రాశారు ఛాయరాజ్. రెండు- 'నాగళ్ళు' కవితలో బువ్వ పెట్టే రైతన్నలను అన్యాయం చేస్తున్న 'పెట్టుబడి దుష్టశక్తుల నాశనం' గానం చేస్తారు ఛాయరాజ్. ఇది 1988లో రాశారు. మూడు- 'దుక్కిటేరు'లో సకలం రైతే అని సగౌరవంగా ప్రకటిస్తారు. కళింగాంధ్ర కవిత్వ బాండాగారంలో 'దుఃఖ్ఖేరు' విలక్షణమైన కావ్యంగా మనం చెప్పుకోవచ్చు

మరో కళింగనేల వ్యవసాయ కవి 'అల'. అల రాసిన 'నిప్పుల వాగు' విప్లవ దృక్కోణంలోంచి వెలువడిన వ్యవసాయిక కవిత. ఆరుగాలం చేసిన కష్టం- చివరకు భూస్వామి పాదాక్రాంతం అయినప్పుడు విప్లవమే పరిష్కారంగా చూపుతాడు కవి. విప్లవ అవసరాన్ని కవిత అడుగడుక్కీ ప్రకటిస్తుంది. 'మట్టిచెట్టు పిట్టభజనిక' అను తన రెండో దీర్ఘకవితలో అల ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యవసాయ సంక్షోభాన్ని కవిత్వం చేస్తారు. 'మట్టిచెట్టు పిట్టభజనిక' వ్యవసాయ రాజకీయ కవిత. గాఢమైన శిల్ప చేవ వున్న కవిత.

రెడ్డి రామకృష్ణ 'గొడిముక్క' దీర్ఘకవితను 2001లో వెలువరించారు. 'గొడిముక్క' అంటే దగ్గర గజం పొడవు గల వెదురుముక్క- గొడ్లను అదిలించడానికి ఉపయోగించే గొడ్లకాపరి చేతిలోని కర్ర. ఏళ్లకేళ్లు 'బుగత' బారిన పడిన ఒకానొక 'పాలేరు'లో చైతన్యం పూసిన కళింగాంధ్ర కొత్త సందర్భం ఈ కవిత. 'చుండూరు'- ప్రేరణలోంచి ఎదిగొచ్చిన కవిత ఇది. కవిత ముగింపులోనూ 'చుండూరు' కనిపించడం- ఒక కోణంలో కవిత సాధించిన విజయమే. లక్షింపేట వాస్తవికత 'గొడిముక్క'. రామకృష్ణ గారు గొడిముక్కలో రాసింది- లక్షింపేటలో నిజమైంది. కారా మాస్టారి 'యజ్ఞం' కథ నేపథ్యం ఇదే కదా! తిమోతి జ్ఞానానంద కవి తదుపరి దళిత వస్తువును ఇంత బలంగా కళింగనేల మీద చెప్పిన కవి బహుశా రామకృష్ణ గారే అవ్వొచ్చు!

4

ఈ ఆరు దీర్ఘకవితలూ ఇరవై ఒకటవ శతాబ్దపు కళింగాంధ్ర కవిత్వాన్ని దిశానిర్దేశం చేసాయని నేను భావిస్తున్నాను. వీటి తదుపరి వచ్చిన కవిత్వం- ఈ ఆరు దీర్ఘకవితలు వేసిన బాటని మరింత విశాలం చేశాయని చెప్పొచ్చు.

గంటేడ 'నదిని దానం చేశాకలో' (2006)- నాగావళి నది వొడ్డు నిర్వాసిత గ్రామాల దుఃఖాన్ని గానం చేస్తారు. పి.ఎస్. నాగరాజు 'ప్రవహించే ప్రజలు' (2005) పోరాట చైతన్యాన్ని ప్రకటిస్తుంది. అరుణ బవేరాది (ఒక కన్నీటిచుక్క కోసం-2002) ఒక దారి- సున్నిత ప్రకటన అతనిది. దేశరాజు 'ఒకేఒక్క సామూహిక స్వప్నావిష్కారణ' వచ్చిందీ ఈ కాలంలోనే (2000). చింతా అప్పలనాయుడు, సిరికి స్వామినాయుడు కలిసి 2003లో 'రెక్క తలుపుల గోస'గా వచ్చారు- ఇది ప్రధానంగా వ్యవసాయ సంబంధ కవిత్వం- ఈ కవితల్లో శిల్పం కన్నా వస్తువు ముఖ్యం- కెక్యూబ్ వర్మ 'వెన్నెల దారి' (2006)తో కళింగనేల మీద విప్లవకవిత్వ నడకని రూపుకట్టాడు. మోహన్ 'ఉద్దానం పువ్వు' 2002లోనే వచ్చింది. మానేపల్లి 'కలలు నేల మీదికి' (2004), పి. అనంతరావు 'మూడు చిరునామాలు' (2006), రెడ్డి రామకృష్ణ 'పినలగఱ్ఱ' (2008)- ఈ కాలంలోనే వచ్చాయి.

కళింగాంధ్ర కవిత్వం గురించి మాట్లాడుకునేటప్పుడు- 'దుక్కి' సంపుటి గురించి తప్పక చెప్పుకోవాలి. ఇది 2008లో వచ్చింది. కవి- చింతా అప్పలనాయుడు.



> 2000 నుంచి 2010 వరకు కళింగ నేల మీద పురుడు పోసుకున్న కవిత్వంలో వస్తువు- ప్రధానంగా వ్యవసాయంది. శిల్పం- వ్యవసాయంది. అందుకే కళింగాంధ్ర వ్యవసాయ కవిత్వానికి అమిరిన శిల్పాన్ని 'వ్యవసాయ శిల్పం' అని నేను నామకరణం చేయదలిచాను. కళింగ నేల మీద ప్రధానంగా- రైతు- వ్యవసాయం నుంచి పరాయీకరణకు గురికాబడినప్పుడు- వస్తుశిల్పాలు రెండూ వ్యవసాయానికి చెందినవి అవడంలో ఆశ్చర్యం లేదు.

'దుక్కి' సంపుటిలో కళింగాంధ్ర వ్యవసాయిక జీవద్భాష తొణికిసలాడుతుంది.

2000 నుంచి 2010 వరకు కళింగ నేల మీద పురుడుపోసుకున్న కవిత్వంలో వస్తువు- ప్రధానంగా వ్యవసాయంది. శిల్పం- వ్యవసాయంది. అందుకే కళింగాంధ్ర వ్యవసాయ కవిత్వానికి అమిరిన శిల్పాన్ని 'వ్యవసాయ శిల్పం' అని నేను నామకరణం చేయదలిచాను. రెండువేలు తర్వాత కళింగ నేల మీద ప్రధానంగా- రైతు- వ్యవసాయం నుంచి పరాయీకరణకు గురికాబడినప్పుడు- వస్తుశిల్పాలు రెండూ వ్యవసాయానికి చెందినవి అవడంలో ఆశ్చర్యం లేదు.

2010 తర్వాత మాత్రం కొత్త వస్తువు కళింగాంధ్ర కవి ముందుకు వచ్చి నిల్చుంది. వస్తువుననుసరించే శిల్పమూ మారింది. దీనికి ప్రధాన కారణం సామాజిక ఘర్షణలోని ప్రత్యేకతే. కళింగాంధ్రలో సోంపేట, కాకరాపల్లి, కొవ్వాడ లాంటి ఘటనలు జరగటం- ఆయా ఘటనల పూర్వపరాలను కళింగాంధ్ర కవి తన లోపలికి ఇంకించుకోవటం- కొత్త కళింగాంధ్ర కవికి- అవి చోదకశక్తిగా పనిచేయటం వలన శిల్పం మారింది.

బొమ్మలు: అక్బర్

కళింగాంధ్ర కవి వేళ్లు కళింగమట్టిలోనే పాదుకున్నాయనేదానికి ఉదాహరణగా సిరికి స్వామినాయుడు రాసిన కవితలు కొన్ని నిలుస్తాయి. స్వామినాయుడు- వస్తుశిల్పాలలో వైవిధ్యం ఇంకా సాధించాల్సి వుంది. స్వామినాయుడు 'పొద్దు' కవిత చూడండి- 'తూరుపుదిక్కును జూపి అమ్మనడిగాను/ 'పొద్దేమిటి ఎరుపుగా ఉంద'ని!/ 'మీ అయ్యారబోసిన మిరపకళ్లమ'ని చెప్పింది/ బంతిపూలై విరిసిన కళ్లతో...!// పడమటి దిక్కును జూపి మళ్లీ అదే అడిగాను/ 'మార్కెట్ మంటల్లో తగలబడుతున్న/ మన బతుకుల'ని చెప్పింది/ఎత్తిన కారం పిడికిళ్ళతో... !'/

కళింగాంధ్ర కవుల్లో మరో కవి- పాయల మురళీకృష్ణ. మురళీకృష్ణది ఒక ప్రత్యేకమైన శిల్పం. పొరలుపొరలుగా కవితను విప్పదీస్తాడు. మరో కళింగాంధ్ర కవి- మొయిద శ్రీనివాస్- కార్మికవర్గ స్పృహ తన ఆలోచనకూ, కవిత్వానికి మూల ఇరుసు. కొత్త పదబంధాలు సృష్టించిన చేవ వుంది ఈ కవికి. ఆశ్చర్యం గొలిపే వూహ చేయగలడు. ఈ దశాబ్దంలోనే కెక్యూబ్ వర్మ 'రెప్పలవంతెన' (2013), 'కాగుతున్న రుతువు' (2017) సంపుటాలను తీసుకొచ్చారు. విప్లవ చైతన్యం పూసిన కవిత్వం ఇతనిది. బాలసుధాకర్ 'ఎగరాల్సిన సమయం' (2014), 'ఆకు కదలని చోట' (2016), 'నీళ్లలోని చేప' (2018), 'భూమి పెదాలపై' (2019) సంపుటాలూ ఈ కాలంలోనే వచ్చాయి. మరో కళింగాంధ్ర కవి 'పక్కి రవీంద్రనాథ్'- 'పక్షి తనాన్ని కలగంటూ..' (2019) అంటూ బయలుదేరుతాడు. గంటేడ 'ఎగిరిపోతున్న పిట్టల కోసం' (2014), రెడ్డి రామకృష్ణ 'బీల-భూమి-సముద్రం' (2012)- కళింగ అస్తిత్వాన్ని ప్రకటించే కవిత్వాలే. గవిడి శ్రీనివాస్, చింతాడ తిరుమల రావు, బుడితి రామినాయుడు, సన్ని, ఇళ్ల ప్రసన్న లక్ష్మి, చెళ్లపిళ్ల శ్యామల, పద్మావతి రాంభక్త, పి. అనంతరావు, ఎల్. ఎన్. కొల్లి మున్నగు కవులు తమ తమ సంపుటాలతో ఈ కాలాన్ని పరిపుష్టం చేశారు.

5

2020 తర్వాత మనం గుర్తుంచుకోదగిన కళింగాంధ్ర కవులు ముగ్గురున్నారు. లండ సాంబమూర్తి, కంచరాన భుజంగరావు, కలమట దాసుబాబు.

సాంబమూర్తి- ఉద్దానం కిడ్నీ బాధితుల ఘోషను కవిత్వం చేసిన కవిగా మనకు గుర్తుంటాడు. కంచరాన, దాసుబాబు- ఇరవై ఒకటో శతాబ్దపు మూడో దశాబ్దంలోనూ కళింగాంధ్ర వ్యవసాయ సంక్షోభాన్ని, వలస దుఃఖాన్ని గానం చేసిన కవులుగా గుర్తుంటారు. భుజంగరావు 'నవ్వు మరిచిన నేల', 'నీటిగింజల పంట'- ఈ రెండు గుర్తించుకోదగిన కవితలు. కలమట దాసుబాబు రాసిన 'కళింగోర' కవిత ఈ నేల నుంచి వచ్చిన ఒక విశిష్టమైన కవితగా మనం గుర్తుంచుకోవాలి. అద్భుతమైన కళింగ మాండలికంతో కవిత నడుస్తుంది. ఈ కవిత నేపథ్యం వలసే- ఈ కవిత ముగింపులో 'కళింగోర కవి దాసుబాబు' అంటాడిలా- 'దోపిడీ తీరు మారలేదు.. పోరూ పాతబడలేదు.../గుండారు బిగించి కన్నెర్రగించవే/ కళావతక్కా.. తల్లీ.. మా కళింగోర..'

రెండు వేల ఇరవై తర్వాత- మళ్లీ గంటేడ ఢిల్లీలో రైతు ఉద్యమానికి సంఘీభావంగా-'రైతు ఉద్యమ సంఘీభావ కవిత్వం' (2021) పేరుతో ఒక కళింగనేల కవిగా కవిత్వం వెలువరించారు. కెక్యూబ్ విప్లవ వాస్తవికతతో 'భూమిరంగు మనుషులు' (2021)తో వచ్చారు. రెడ్డి శంకరరావు 'కాలం ఒడిలో' (2022), లండ సాంబమూర్తి 'గాజురెక్కల తూనీగ' (2020), 'నాలుగురెక్కల పిట్ట' (2022), భుజంగరావు 'నీటిగింజల పంట' (2023), బాలసుధాకర్ 'దుఃఖపు వొరుపు (2021), నిర్వేదస్థలం(2022), అస్తిత్వవాచకం(2023)' సంపుటాలతో బయలుదేరారు. 2020 తర్వాత వచ్చిన కవిత్వ సంపుటాల్లో విశిష్టమైనది- 'దుర్ల' (2021). కవి- మల్లిపురం జగదీశ్. ఇరవై ఒకటో శతాబ్దపు మూడో దశాబ్దంప్రారంభంలో ఆదివాసీ కవితా సంపుటిగా 'దుర్ల' రావడం కళింగాంధ్ర కవిత్వానికి మేలు చేర్పు.

6

ఏ ప్రాంతపు నేలకైనా దానిదైనా సొంత రూపం, వ్యక్తిత్వం వుంటాయి. దానినే అస్తిత్వం అంటున్నాం. కళింగ నేల అస్తిత్వం కళింగనేలకే ప్రత్యేకమైనది.

బాలసుధాకర్ మౌళి
96764 93680

చీకటిలో వికసించిన జ్ఞానపద్మం!

ఈ సంవత్సరం జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన జగద్గురు రామభద్రాచార్య రెండు నెలల వయస్సులోనే ట్రకోమా వ్యాధితో కంటిచూపు కోల్పోయారు. అయినా ఇరవై రెండు భాషలు నేర్చుకొని సుమారు రెండు వందల పుస్తకాలను రచించడమే కాకుండా ప్రపంచంలోనే తొలిసారిగా దివ్యాంగుల కోసమే ఉచిత చదువు, వసతీ సౌకర్యాలతో ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేసే స్థాయికి చేరుకున్నారు.

14 జనవరి 1950లో ఉత్తర ప్రదేశ్‌లోని జౌన్‌పూర్ జిల్లాలో శాండీకుర్ద్ గ్రామంలో జన్మించిన రామభద్రాచార్య అసలు పేరు గిరిధర్ లాల్ మిశ్రా. 1953 జూన్ నెలలో గ్రామంలో గారడీవాడి కోతి నృత్యం చేస్తున్న ప్రదర్శనలో కోతి వీక్షకులను తాకే సమయంలో గిరిధర్ లాల్ పిల్లలతో సహా పారిపోబోతూ ప్రమాదవశాత్తూ ఒక పాడుబడిన నూతిలో పడిపోయారు. ఒక యువతి రక్షించేవరకు అక్కడే చిక్కుకున్నాడు. తులసీదాస్ రామచరిత మానస్‌లోని 'యహ చరిత్ జే గావహి హరిపద్ పావైతే న పరహి బవకృప' అన్న శ్లోకంలోని పంక్తిని నేర్చుకున్నందున అతని జీవితం రక్షింపబడిందని అతని తాత చెప్పే వారు (దీనిని పాడేవారు హరి పాదాలకు చేరుకుంటారు. జనన మరణాల ఊబిలో పడరు).



గిరిధర్‌లాల్‌కు ప్రారంభ విద్య అతని తాతగారి నుంచి లభించింది. రామాయణ, మహాభారతంలోని కథలను విశ్రామ్ సాగర్, సుఖ్‌సాగర్, ప్రేమ్ సాగర్, బ్రజ్విలాస్ లాంటి భక్తి రచనలను తాతయ్య అతనికి చెప్పేవారు. అయిదేళ్ల వయసులోనే గిరిధర్ తన మొదటి కవితా భాగాన్ని అవధి (హిందీ మాండలికం)లో కూర్చు చేశాడు. ఊరిలో అయిదవ తరగతి వరకు చదువుకున్నారు. ఆ తర్వాత సంస్కృత వ్యాకరణం, హిందీ, ఇంగ్లీష్, భూగోళ శాస్త్రం, గణితం, చరిత్ర అధ్యయనం చేశారు. సంస్కృత విద్యలో ప్రథమ, పూర్వ మాధ్యమ, ఉత్తర మాధ్యమ, శాస్త్రి, ఆచార్య పరీక్షలలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. "మీ ఉపాధ్యాయులు ఎవరెవరో మీకు తెలుసా?' అని చిత్రకూట్‌లో నేను ఐజీపీగా ఉన్నప్పుడు మా ఇంటికి విచ్చేసిన రామభద్రాచార్య గారిని అడిగినప్పుడు ఆయన ఇలా చెప్పారు: "నా ధ్యానం అంతా ఉపాధ్యాయుడు చెప్పే పాఠం మీదే ఉండేది. నేను విని అర్థం చేసుకునేవాడిని. ఇంటికి వచ్చి మా తమ్ముడికి చెప్పేవాడిని. వాడు ఒక పుస్తకం మీద రాసేవాడు. తిరిగి చదివి వినిపించేవాడు. అలా నాలో జ్ఞాపక శక్తి, సృజనాత్మకత పెరిగింది."

ఈశ్వరదాస్ (మంత్రం), రామప్రసాద్ త్రిపాఠి (సంస్కృతం), రామచరణదాస్ (సంప్రదాయం)లను తన గురువులుగా చెప్పే రామభద్రాచార్య - బెనారస్‌లోని సంపూర్ణానంద సంస్కృత విద్యాలయంలో టాపర్‌గా నిలిచి స్వర్ణపతకం పొందారు. 1976లో నవ్య వ్యాకరణాచార్య పరీక్షలో విశ్వవిద్యాలయంలో ప్రథమ స్థానం పొందారు. 1981లో 'అధ్యాత్మ రామాయనే అపాణినీయ ప్రయోగాణా విమర్శ' విషయం మీద పీహెచ్డీ పొందారు. 1996లో 'అష్టాధ్యాయః ప్రతిసూత్రం శాబ్దబోధ్ సమీక్షణం' విషయం మీద డీలిట్ పొందారు. ఈ పరిశోధన సంస్కృతంలో 1975 పేజీల్లో రాశారు. దీనిని ప్రపంచంలోనే అతి విస్తృత సంస్కృత పరిశోధనగా చెబుతారు. పాణిని వ్యాకరణం మీద పదివేల పేజీల వ్యాఖ్యానం రాశారు. సంస్కృత వ్యాకరణంలో అసాధారణ పాండిత్యం సంపాదించారు. 'వేదాంత, న్యాయ'లలో ప్రావీణ్యం పొందారు. వీరిది విశిష్టాద్వైత వేదాంతం, రామాయణ, భాగవత కథకులుగా ఉత్తర భారతంలో చాలా ఖ్యాతి గడించారు.

వీరు వ్యాకరణం, సాంఖ్య, న్యాయ, వేదాంత, సంస్కృత అంతక్షరి విభాగాలలో బంగారు పతకాలను సాధించారు. అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ ఐదు బంగారు పతకాలతోపాటు, ఉత్తరప్రదేశ్ తరపున చల్యాయిజయంతి ట్రోఫీని గిరిధర్‌కు అందజేశారు. అతని ప్రతిభకు మెచ్చి ఇందిరాగాంధీ వీరి కళ్ళకు చికిత్స కోసం ప్రభుత్వ ఖర్చుతో అమెరికాకు పంపాలని ప్రతిపాదించారు. కాని గిరిధర్ ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. 'దుర్గుణాలతో నిండిన, వివాదాలతో, మోసపూరితమైన దుష్టమానవుల పాపాలతో పరిపాలించబడుతున్న ఈ ప్రపంచంలో నేనేమి చూడాలి? కమలం లాంటి ముఖాన్ని కప్పివేసే వెంట్రుకలు కలిగిన, సంపూర్ణ ఆనందంలో ఉన్న, పిల్లల రూపాన్ని కలిగివున్న రాముడు మాత్రమే విముక్తి ఇచ్చేవాడు' అని ప్రధాన ఇందిరా గాంధీకి జవాబు రాసి పంపారు శ్రీ రామభద్రాచార్య.

వీరు 8 సంస్కృత మహాకావ్యాలు రాశారు. సుమారు 100 సంస్కృత స్తోత్ర కావ్యాలు రాశారు. 11 ఉపనిషత్తుల మీద 11 తాత్విక గ్రంథాలు రాశారు. శ్రీమద్భగవద్గీత, బ్రహ్మసూత్ర, శ్రీరామస్తవరాజ, శ్రీనారదభక్తి సూత్ర గ్రంథాల మీద 'శ్రీ రాఘవకృపా భాష్యం' రాశారు. 16 లఘు కావ్యాలు రాశారు. ప్రవచన గ్రంథాలు, టీకా గ్రంథాలు, సంపాదకీయ గ్రంథాలు రాశారు. వీరి రచనలలో 'ప్రస్థానత్రయి, శ్రీ భార్గవ రాఘవీయం, భృంగదూతం, గీతారామాయణం, శ్రీసీతారామ సుప్రభాతం, శ్రీసీతారామ కేళీ కౌముది, అష్టావక్రుడు, శ్రీ రాఘవకృపా భాష్యం' ప్రముఖమైనవి.

రామభద్రాచార్య తులసీదాసు పేరు మీద చిత్రకూట్‌లో సామాజిక సేవా సంస్థ 'తులసీ పీఠ్'ను స్థాపించారు. తనలాంటి దివ్యాంగుల కోసం చిత్రకూట్‌లో విద్యాలయాలు స్థాపించారు. దివ్యాంగుల కోసం ఆయన విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ఇది నాలుగు రకాల దివ్యాంగులకు గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తుంది. దివ్యాంగుల కోసమే కాకుండా వినికిడి కోల్పోయిన వాళ్ళ కోసం రామభద్రాచార్య 'తులసీ ప్రజ్ఞా చక్షు బధిర ఉచ్చతర మాధ్యమిక విద్యాలయం' స్థాపించారు.

చూపులేనప్పటికీ ఆత్మవిశ్వాసంతో విద్యాభ్యాసాన్ని కొనసాగించడమే కాకుండా అంధులకు, బధిరులకు ఉచిత విద్య అందించే విద్యాలయాల్ని స్థాపించే స్థాయి వరకూ కొనసాగిన రామభద్రాచార్య జీవన ప్రయాణం ఆదర్శనీయం.

కిల్లాడ సత్యనారాయణ
83339 87838

పుస్తకం చదివిన జీవితం



పట్నంలో...
ఇరుకిరుకు అద్దెగదిలో
కొంతకాలంగా ఓ పుస్తకం
జీవితాన్ని చదువుతుంది

గూటికి చేరుకుంటున్న పక్షి
కిటికీలోంచి...
పుస్తకం కంటపడింది
ఇంకేముంది
రాలిన కన్నీటిచుక్క
ఓ అక్షరాన్ని తడిచేసింది

సమాధానాలన్నీ తెలిసిన పుస్తకానికి
మడిసెక్కలో తిరిగాడిన
తండ్రి పాదాలలోని
పగుళ్ళకు కారణం
ఊరిలో అప్పుకై చాచిన
తల్లి చేతులలో శూన్యం
ఎప్పుడూ ప్రశ్నగానే మిగిలిపోతుంది

పరీక్షా కాలంలో...
రూమ్ రెంటివ్వకపోతే
గదిని ఖాళీ చేయమన్న గొంతు
ఫీజు చెల్లించకపోతే
కోచింగు సెంటరులో
కాలు పెట్టొద్దన్న మాట
పుస్తకం బుర్రలో
దీపం చుట్టూ...
పురుగులా తిరుగుతుంది

తనను నమ్ముకున్న వారి కష్టాలు
గట్టెక్కుతాయో లేదన్న నమ్మకం
ఊరి నుంచి తెచ్చుకున్న మూటలోని
కోటా బియ్యంలా తరిగిపోతుంది
పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనసు
గది మూలన గాలికి తిరిగే
ఖాళీ ప్లాస్టిక్ కవరులా వుంది

చివరికి
పుస్తకానికి పాఠం బోధపడింది
తన బతుకు కోసం
తోటి పుస్తకాలపైనే యుద్ధం చేయాలి
లేకుంటే...
పోగుపడిన అనంత పుస్తకాలలో
తానో నిరసన వాక్యమై నిలవాలి

మొయిద శ్రీనివాసరావు
99082 56267



నాకు ఈడు మీద ఈడెక్కినట్టు
ఏరుకు ఏడు మీద ఏడెక్కదు
ఊరుకన్నా తొలుతది
ఊయ్యాల ఊగుతుంది
నీటి మథనంలోనే
అమృతం చిలికినట్టుంది

ఎన్ని తరాల బోయిలో
పరంపర జరిగి పోయింది
పూర్వ కన్యో అపూర్వ కన్యో
ఉదయం సూర్య కాంతిలో
రాత్రి చంద్ర కాంతిలో
తానమాడి తళుక్కుమంటుంది
ఏరు సాగి పోయే అప్సరస

ఏరు ఎంత బోధించినా
ఏటి గెచ్చులకు ఎక్కేది కాదు
ఎగిరెగిరి పడుతుండేది
ఏరు దరి మీద ఉన్న నన్ను
ఇతర పక్షులను
ఏటి గెచ్చులకు బూచిగ చూపేది
చేతుల్ని పంజాలుగా
దరిని పొదలుగా చూసేది
ఏరుకు నా తలలో సారికలు కనిపించేవి
ఒక్కొక్క సారి కొంగ
వినయంగా కనిపించినా
ఏరు నమ్మేది కాదు
ఎడ్డి గెచ్చుల్ని లోనికి గుంజేది

వేటకు ముందు....
బుద్ధుడు నాతో తలపడే వాడు
మెల్లగా మెల్లగా వల కండ్ల తెగి


చిక్కం చినిగి పోయింది
బురదలో ఊత తిరగబడి
పువ్వులా విచ్చుకుంది
చందమామ ఎగిరి
నన్ను ముద్దాడింది
ఏటిలో వెన్నల జన ఇడిచింది

చమట పాణం పోసుకుంది
పాణం పోసింది
ప్రేమ సారంతో కొత్త చిగురు
ఎన దృశ్యం మారింది

ఎత్తి కడితే
ఎటు పోతున్ననో ఏమో కాని
నా ముందు సీతాకోకల గుంపు
ఎనుక చెట్లు నడుస్తున్నయి
చాపను చూస్తూ ఎదురెక్కుతున్న
నా లోకి నేను.

మునాసు వెంకట్
99481 58163

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హైదరాబాద్ నగర వార్తలు
సోమవారం 11 మార్చి 2024



ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.2 కనిష్ఠం 23.5

వింటేజ్ కార్ల సందడి



ఖైరతాబాద్ మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్ బండ్ చుట్టూ ఆదివారం సాగిన వింటేజ్ కార్ల ర్యాలీ ఆకట్టుకుంది. క్లాసిక్ మోటార్ వెహికల్ అసోసియేషన్ వారు 'రైడ్ ఇన్ ది పార్క్' పేరిట నిర్వహించిన ఈ ర్యాలీని సీపీ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. పాతతరం కార్లను చూసేందుకు నగరవాసులు ఆసక్తిని కనబరిచారు.



సచివాలయం రోడ్డులో వెళ్తున్న వింటేజ్ కారు



జెండా ఊపి వింటేజ్ కార్ల ర్యాలీని ప్రారంభిస్తున్న నగర సీపీ కె.శ్రీనివాసరెడ్డి

ఫుడ్ అలర్జీలతో పరేషాన్..



- వామ్మో వంకాయ్, క్యాబేజీ..
- అదే దారిలో ఫిష్, చికెన్ కర్రీలు కూడా..
- అలర్జీలతో వైద్యుల వద్దకు..
- మసాలా దినుసులతో దద్దుర్లు
- ఆస్తమా, అలర్జీ లక్షణాలుంటే ఇబ్బందులే..
- జాగ్రత్త వహించాలంటున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మసాలా వంకాయ్ అంటే ఇష్టం లేనిది ఎవరికి. ముఖ్యంగా ఏ చిన్న దావత్ చేసినా సరే మసాలా వంకాయ కర్రీ ఉంటుంది. ఇక వేడి అన్నంలో గోంగూర పచ్చడి వేసుకుంటే ఆ టేస్టే వేరు. ఫ్రైడ్‌రైస్, మంచూరియా కావాలంటే అందులోకి క్యాబేజీ తప్పనిసరి.. అయితే ఇప్పుడు వీటిని ఆహారంగా తీసుకునేవారు కాస్త జాగ్రత్త వహించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వీటిని తినేవారిలో కొందరికి అలర్జీ వస్తోందని, ఇప్పటికే అలర్జీ లక్షణాలు, ఆస్తమా వంటి జబ్బులున్న వారిలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని వారు స్పష్టం చేస్తున్నారు. ఫిష్, చికెన్‌లాంటివి తిన్నవారిలో కొందరు బ్రాంకోస్పాజ్ బారిన పడి ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నట్లు వైద్యులు వివరిస్తున్నారు.

అలర్జీ వల్ల ఇలా..



ఆస్తమా, అలెర్జీలతో ముక్కు కారడం, చర్మంపై దద్దుర్లు, దురద ఏర్పడుతుంటాయి. సాధారణ దగ్గు నుంచి శ్వాస ఆడకపోవడం, ఉబ్బసం వరకు ఇబ్బందులు ఉంటాయి. కొన్ని సార్లు ఊపిరి తీసుకోవడం కష్టంగా మా రి అపస్మారక స్థితికి సైతం చేరుకునే ముప్పు ఉంటుందని వైద్యులు తెలిపారు. దురద, చర్మం ఎరుపురంగులోకి మారడం, డయేరియా, మూర్ఛ, వాంతులు, తల తిరగడం,

మిగతా 8వ పేజీలో..

పాన్ కూడా..

హైదరాబాద్‌లో పాన్‌ను మహా ఇష్టంగా తింటారు. కడుపు నిండా బిర్యానీ, నాన్‌వెజ్ తింటే చాలా మంది పాన్ వేసుకోకుండా ఉండరు. అలాంటి పాన్ తింటే కూడా కొందరిలో అలర్జీ ఏర్పడుతుంది. జీలకర, గరం మసాలా వంటి మసాల దినుసులు కూడా అలర్జీ కారకాలుగా మారుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే, అందరిలో ఇవి అలర్జీ కారకాలు కావని, కొందరిలో మాత్రమే ఈ ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు వారు పేర్కొంటున్నారు.

ఫిష్, చికెన్‌లతోనూ..

చికెన్, చేపలు తిన్న వారిలో సైతం అలర్జీ కనిపిస్తోంది. దద్దుర్లు, దురద వంటి ఇబ్బందులతో వైద్యుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా ఆస్తమా, శ్వాసకోశ ఇబ్బందులు, అలర్జీ లక్షణాలు ఉన్న వారు చేపలు తింటే వారిలో అలర్జీ రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. చోళే (శనగలు) కర్రీ, వాల్‌నట్, పచ్చి పల్లీలు, ఉడకబెట్టిన పల్లీలు కాస్తా ఎక్కువగా తింటే కూడా అలర్జీకి కారణమవుతున్నాయని పేర్కొంటున్నారు. క్యారెట్, బొప్పాయి ముక్కలు తిన్నా కొంత మందికి అలర్జీలు వచ్చే అవకాశాలున్నాయని అంటున్నారు.

మల్కాజిగిరి నుంచి పోటీకి నై!



యూటర్న్ తీసుకున్న మల్లారెడ్డి కుటుంబం

- బీఆర్‌ఎస్ నుంచి తెరపైకి కొత్త పేర్లు
- ప్రచారంలో మల్క కొమురయ్య..
- శంభీపూర్ రాజుకూ అవకాశం..?
- పునరాలోచనలో మర్రి జనార్దన్‌రెడ్డి
- మొదట్లో ఆసక్తి.. ఇప్పుడు అనాసక్తి
- 'కారు'లో మారుతున్న పరిణామాలు

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతి పెద్ద లోక్‌సభ స్థానం మల్కాజిగిరిలో ఎన్నికల సమరం ఆసక్తికరంగా మారుతోంది. ముఖ్యంగా బీఆర్‌ఎస్ నుంచి ఇక్కడ ఎవరు బరిలో దిగుతారన్నది చర్చనీయాంశంగా మారింది. మొన్నటి వరకు మాజీ మంత్రి మలారెడ్డి కుమారుడు భద్రారెడ్డి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అర్థ బలం, మేడ్చల్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలుగా వారి కుటుంబసభ్యులే ఉండడం.. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విద్యాసంస్థలున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ అగ్రనాయకులూ భద్రారెడ్డి అభ్యర్థిత్వానికి సానుకూలంగా ఉన్నట్లు తెలిసింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా భద్రారెడ్డి పేరిట ఫ్లెక్సీలూ ఏర్పాటు చేశారు.



మల్లారెడ్డి అల్లుడు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన విద్యాసంస్థల భవనాలను అక్రమంగా నిర్మించారంటూ వాటిని కూల్చివేయడం.. ఇతరత్రా పరిణామాల నేపథ్యంలో మల్లారెడ్డి కుటుంబం యూటర్న్ తీసుకుంది. పార్టీ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌లను కలిసి తమ కుటుంబం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోమని స్పష్టం చేశారు. దీంతో మల్కాజిగిరి నుంచి బీఆర్‌ఎస్ తరఫున అభ్యర్థి ఎవరన్నది ఆసక్తి రేపుతోంది. మొన్నటి వరకు ఈ స్థానం కోసం పార్టీలోని పలువురు నేతలు పోటీపడగా.. తాజా పరిణామాల నేపథ్యంలో పరిస్థితి ఒక్కసారిగా మారింది.



తెరపైకి కొత్త పేర్లు..

మల్కాజిగిరి నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పేరు మొదటినుంచి వినిపిస్తున్నా.. బలమైన అభ్యర్థి దొరికితే ఆయనకు నచ్చజెప్పాలని పార్టీ నేతలు భావించారు. పోటీ నుంచి మల్లారెడ్డి కుటుంబం తప్పుకున్న నేపథ్యంలో మరోసారి రాజు పేరు తెరపైకి వస్తోంది. మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగానూ ఆయన కొనసాగుతుండడంతో బరిలో నిలిపే అవకాశం లేకపోలేదని ఆ పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే తెలిపారు. అయితే, రాజు ఎమ్మెల్సీకి రాజీనామా చేయాల్సి వస్తే.. శాసనమండలిలో పార్టీ బలం తగ్గుతుందనే ఆలోచనలోనూ అగ్రనేతలున్నట్లు తెలుస్తోంది. ఇక బీజేపీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ ప్రముఖ విద్యాసంస్థల అధినేత మల్క కొమురయ్య పేరు తాజాగా వినిపిస్తోంది. నియోజకవర్గంనుంచి బీజేపీ ఈటల రాజేందర్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటించడంతో.. ఎలాగైనా పోటీ చేయాలని భావిస్తున్న కొమురయ్య పక్క పార్టీలవైపు చూస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే కేసీఆర్, కేటీఆర్‌లతో ఆయన టచ్‌లోకి వెళ్లారని ప్రచారం జరుగుతోంది. పలు ప్రాంతాల్లో విద్యాసంస్థలు, ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ కూడా ఉన్న కొమురయ్యను బరిలోకి దింపడం బీఆర్‌ఎస్‌కు కలిసి వస్తుందన్న భావన ఉన్నట్లు తెలుస్తోంది. విద్యాసంస్థల అధినేతగా రాజకీయాల్లోనూ మల్లారెడ్డి తనదైన ప్రత్యేకత చాటుకున్నారు. ఈ నేపథ్యంలో కొమురయ్యకూ అవకాశం ఇవ్వాలనే యోచనలో బీఆర్‌ఎస్ ఉన్నట్లు సమాచారం. ఆర్థిక వనరులూ ఉండడంతో ఎన్నికల

మిగతా 8వ పేజీలో..



స్టెరాయిడ్ల వాడకంతో కంటికి ముప్పు 8



వైద్యులతో కలిసి పరుగెడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

పరుగు.. ఆరోగ్యం మెరుగు

- కిడ్నీ ఆరోగ్యంపై అవగాహనకు రన్

గచ్చిబౌలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కిడ్నీ డే సందర్భంగా కిడ్నీల ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గచ్చిబౌలి స్టేడియం వద్ద కిడ్నీరన్ నిర్వహించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. పలువురు కిడ్నీ రోగులు, వైద్యరంగ నిపుణులు, స్థానికులు సుమారు 1500మంది వరకు ఈరన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కిడ్నీ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నెఫ్రాలజిస్టు డాక్టర్ వరుణ్, డాక్టర్లు సి.మల్లికార్జున, పీసీ రెడ్డి, దీపక్‌రాగూరి, క్రాంతి, వరుణ్, తైఫ్, లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రన్ ఫర్ షీ.. 8లో

ఇద్దరి దారుణ హత్య

- ఎల్‌బీనగర్‌లో గొంతు కోసి యాచకురాలిని..
- శాలివాహననగర్ కాలనీలో పారతో బాది భార్యను..



రక్తపు మడుగులో యాచకురాలు



కొత్తపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): అల్కాపురి చౌరస్తా సమీపంలో ఓ యాచకురాలిని గుర్తుతెలియని వ్యక్తులు గొంతుకోసి దారుణంగా హత్యచేశారు. ఎల్‌బీనగర్ ఎస్‌హెచ్‌ఓ రామాంజనేయులు కథనం ప్రకారం అల్కాపురి చౌరస్తా సమీపంలోని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పీఎస్ సమీపంలోని క్యాబ్ రిజిస్ట్రేషన్ బూత్ పాత క్యాబిన్ వద్ద ఆదివారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని యాచకురాలు (35)ని ఓ వ్యక్తి కత్తితో గొంతు కోసి కిరాతకంగా హత్యచేశాడు. ఉదయం 6 గంటల ప్రాంతంలో ఓ మహిళ రక్తపు మడుగులో పడి ఉందని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ సాతు శ్రీరాములుకు ఓ వాకర్ సమాచారం ఇచ్చాడు. వెంటనే అతను ఎల్‌బీనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్‌హెచ్‌ఓ రామాంజనేయులు, ఎస్‌ఐ లింగారెడ్డి సిబ్బందితో హత్యా స్థలానికి చేరుకుని హత్యకు వాడిన కత్తి ఇతర ఆధారాలు సేకరించారు. నిందితుడి రక్తపు మరకల పాదముద్రలను పోలీసులు పరిశీలించారు. అతడు దగ్గరలో గల హోటల్‌లో టీ తాగి పరారయ్యాడని సమాచారం. హత్యకు గురైన యాచకురాలు బసంత్ అనే యాచకుడితో కలిసి తిరిగేదని, అతడే హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ కేసు దర్యాప్తు చేస్తున్నారు. హంతకుడి ఆచూకీ కోసం ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఎస్‌ఐలతో కూడిన ఆరు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశామని ఎల్‌బీనగర్ ఏసీపీ కష్టయ్య తెలిపారు.



కృష్ణవేణి(ఫైల్)

పారతో భార్య తలపైకొట్టి..

చాదర్‌ఘాట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యాభర్తలు గొడవ పడ్డారు. ఉద్రేకానికి లోనైన భర్త పారతో భార్య తలపై కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన మలక్‌పేటలో ఆదివారం జరిగింది. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా మాచన్నపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్, కృష్ణవేణి(35) దంపతులు ముసారాంబాగ్ శాలివాహననగర్ కాలనీలోని నారాయణి గోశాలలో నివాసముంటున్నారు. వెంకటేశ్ కూలి పనిచేస్తుండగా.. కృష్ణవేణి గోశాలలో పనిచేస్తున్నది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. శనివారం రాత్రి మద్యం తాగి వచ్చిన వెంకటేశ్ భార్య కృష్ణవేణితో గొడవ పడ్డాడు. ఆ తర్వాత కృష్ణవేణి నిద్రించగా వెంకటేశ్ పారతో ఆమె తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందడంతో వెంకటేశ్ పరారయ్యాడు. ఆదివారం విషయం తెలుసుకున్న మలక్‌పేట పోలీసులు కృష్ణవేణి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో టెన్త్ విద్యార్థి దుర్మరణం 8

వాహనాల తనిఖీలు

- ఎన్నికల నేపథ్యంలో పోలీసుల ముందస్తు చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ ఉపేందరరావు, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది

నిజాంపేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో పార్లమెంట్ ఎన్నికల వేడి మొదలైంది. ఆదివారం శివారు ప్రాంతాల్లో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. నిజాంపేట్, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధుల్లోని ప్రగతినగర్ కమాన్ వద్ద ప్రత్యేక సీఐఎస్‌ఎఫ్ సాయుధ దళాల సాయంతో బాచుపల్లి పోలీసులు వాహనాల తనిఖీని చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో రానుండటం, బెంగళూర్ బాంబు పేలుళ్ల నేపథ్యంలో భాగంగా బాచుపల్లి సీఐ ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. హవాలా మార్గంలో డబ్బు తరలించడాన్ని అడ్డుకునేందుకు ముందస్తుగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.



'కామన్ మొబిలిటీ కార్డు' ఎప్పుడు..?

- మెట్రో, ఆర్టీసీ ఉమ్మడి కార్డు కోసం నగరవాసుల ఎదురుచూపులు
- రెండింటికీ ఒకే కార్డు ఉంటే టికెట్ రహిత ప్రయాణం
- నెలవారీగా రీచార్జీతో సులువుగా రాకపోకలు
- ప్రస్తుతం అమలులో 'ఎంఎంటీఎస్- బస్‌పాస్'


హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'కామన్ మొబిలిటీ కార్డు' కోసం నగరవాసులు ఎదురుచూస్తున్నారు. వివిధ రవాణా వ్యవస్థల ద్వారా ప్రయాణిస్తున్న సమయంలో వేర్వేరుగా టికెట్లు తీసుకుంటూ ఇబ్బందులు పడుతున్న తమకు ఒకేకార్డుతో మెట్రో, ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే సౌకర్యాన్ని కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. తద్వారా సమయం ఆదాతోపాటు ప్రయాణం సులువుగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

నగరంలో ప్రధాన రవాణా వ్యవస్థలైన మెట్రో, ఆర్టీసీని ఒకే గొడుకు కిందకు తెచ్చి టికెట్ రహిత ప్రయాణాన్ని అందించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. 2023 ఆగస్టులోపు ఈ విధానాన్ని

మిగతా 8వ పేజీలో..

నగరం నుంచి విశాఖకు మరో 'వందేభారత్'

- రేపు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని



సికింద్రాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్- విశాఖపట్నం మధ్య మరో 'వందేభారత్ ఎక్స్‌ప్రెస్' రైలును ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 12న వర్చువల్‌గా (వీడియో కాన్ఫరెన్స్) ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆదివారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది జనవరిలో విశాఖపట్నం- సికింద్రాబాద్ మధ్య ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రయాణికుల నుంచి విశేషమైన ఆదరణ లభించింది. దీంతో రెండో రైలును ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య గురువారం మినహా మిగిలిన అన్ని రోజులు ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ఈ రైలు(20707) సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఉదయం 05.05కి బయలుదేరి మధ్యాహ్నం 13.50కి విశాఖపట్నం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో రైలు (20708) మధ్యాహ్నం 14.35కు బయలుదేరి రాత్రి 23.20కి సికింద్రాబాద్‌కు చేరుకుంటుందని అధికారులు తెలిపారు. ఈ రైలు వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. 530 మంది ప్రయాణికుల సామర్థ్యంతో వందేభారత్ నడుస్తుందని అధికారులు తెలిపారు.

ఎన్టీఆర్ స్టేడియంలో చెత్తకు నిప్పు

● ఎగిసిపడిన మంటలు

కవాడిగూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్టేడియంలో పేరుకు పోయిన చెత్తకు నిప్పంటుకొని.. స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. దాంతో మంటలు ఎగిసిపడ్డాయి. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల సందర్భంగా ప్రచార రథాలకు వినియోగించిన చెత్త, చెక్కపొట్టు ఎన్టీఆర్ స్టేడియంలో పేరుకుపోయింది. చెత్తపై ఎవరో ఆకతాయిలు సిగరెట్ కాల్చి వేయడం వల్ల నిప్పంటుకొని మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పేశారని ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.


ఎగిసిపడుతున్న మంటలు

బాలికను తీసుకెళ్లిన ఉపాధ్యాయుడిపై కేసు

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అదృశ్యమైన బాలిక కేసులో స్కూల్ ఉపాధ్యాయుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బోరబండకు చెందిన బాలిక (13) ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతుంది. ఈనెల 7న ఇంటి నుంచి వెళ్లిపోయింది. తనకోసం వెతకొద్దని.. ఓ వ్యక్తితో కలిసి కాకినాడకు వెళ్తున్నానని.. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ లేఖ రాసింది. దాని ఆధారంగా బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్ నెంబర్, ఇతర సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాలిక తన స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుడుతో కలిసి వెళ్లినట్లు గుర్తించారు. ఇద్దరినీ నగర శివారులో అదుపులోకి తీసుకున్నారు. బాలిక వాంగ్మూలం నమోదు చేసుకొని భరోసా సెంటర్‌కు తరలించారు. ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేశారు.

అర్హత లేకపోయినా మెడికల్ షాపు నిర్వహణ

● అధిక ధరలకు దగ్గుమందు సిరప్‌లు, మత్తు మాత్రలు ● ముగ్గురిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్, డీసీఏ అధికారులు

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అర్హత లేకున్నా మందుల దుకాణం నిర్వహిస్తూ, నిషేధిత సిరప్‌లు, మాత్రలు అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యక్తిని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) అధికారులు కలిసి పట్టుకున్నారు. అతడి నుంచి రూ. 46 వేల విలువైన దగ్గు మందు సిరప్‌లు, మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. మారేడుపల్లికి చెందిన ముత్తా కిషోర్‌కుమార్(58) 20 ఏళ్లుగా ఫార్మసీ రంగంలో పనిచేశాడు. ఇతడికి మందుల దుకాణం నిర్వహించే విద్యార్హత లేదు. బోలిశెట్టి అవినాష్ అనే వ్యక్తికి చెందిన లైసెన్స్‌తో బేగంపేటలో మహవీర్ మెడికల్ స్టోర్స్ నిర్వహిస్తున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు బేగంపేటకు చెందిన ముసలం రాజు సహకారంతో మత్తును కలిగించే దగ్గుమందులు, మాత్రలను అధిక ధరలకు విక్రయించడం ప్రారంభించాడు. మత్తును కలిగించే దగ్గుమందు సిరప్‌ను బోయినపల్లికి చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్ ఐరేని రమేష్‌గౌడ్ వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నాడు. రమేష్‌గౌడ్ దగ్గు సిరప్‌ను నకిలీ బిల్లులతో కొనుగోలు చేసి, కిషోర్ కుమార్‌కు విక్రయిస్తున్నాడు. దగ్గును నియంత్రించేందుకు వినియోగించే ఇంజక్షన్‌ల వంటి మందులను డాక్టర్ సూచనలు లేకుండా విక్రయించే వీలు లేదు. బోలిశెట్టి అవినాష్ అలవాటున్న వారికి అధిక ధరలకు, మత్తును కలిగించే దగ్గు మందు సిరప్‌లు, మత్తు మాత్రలు విక్రయిస్తున్నాడు. ఇతడి దందాపై పక్కా సమాచారమందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, డీసీఏ అధికారులతో కలిసి బేగంపేటలోని మహవీర్ మెడికల్ షాపుపై దాడి చేశారు. ఇతడి నుంచి సిరప్‌లు, ఇంజక్షన్‌లు, ట్యాబెట్లను స్వాధీనం చేసుకున్నారు. కిషోర్ కుమార్, ముసలం రాజు, రమేష్‌గౌడ్‌లను అరెస్ట్ చేశారు. మెడికల్ దుకాణం లైసెన్స్‌ను అందించిన బోలిశెట్టి అవినాష్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న సిరప్‌లు, మాత్రలతో నిందితులు


విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మైనారిటీ కాలేజీలను డిగ్రీ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేయాలి

పహాడిషరీఫ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. ఆదివారం జల్‌పల్లి మున్సిపాలిటీ ఖుబా కాలనీలోని ఫైన్ మోడల్ హైస్కూల్ ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను చూసి, వారిని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విజ్ఞాన ప్రదర్శనల ఏర్పాటుతో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చన్నారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ మైనార్టీల కోసం గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కళాశాలలను ప్రస్తుత ప్రభుత్వం డిగ్రీ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లాసాధి, యూసుఫ్ పటేల్, ఉమర్‌బామ్, ఎక్బాల్ ఖలీఫా, సయ్యద్ ఫెరోజ్, పాఠశాల చైర్మన్ సయ్యద్ నూరుద్దీన్ అలీ అబేద్, ప్రిన్సిపాల్ మునీరుద్దీన్ అలీ, డైరెక్టర్ వలీయుద్దీన్, హెచ్‌ఎండీ సాదియాబేగం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు సర్దార్ మంజిత్‌సింగ్

డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

అఫ్జల్‌గంజ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘం అధ్యక్షుడు సర్దార్ మంజిత్‌సింగ్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో ప్రభుత్వ డ్రైవర్ల సహ అధ్యక్షుడు పంతులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఏ. శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈరవేణి పద్మారావు తదితరులతో కలిసి మంజిత్‌సింగ్ మాట్లాడారు. జీఎం నెంబర్ 5ని వెంటనే రద్దుచేయాలి, నూతన వాహనాలను కొనుగోలుచేయాన్నారు. ఖాళీగా ఉన్న డ్రైవర్ల పోస్టుల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అగ్నిమాపక శాఖలో పనిచేస్తున్న డ్రైవర్లకు ఎమెర్జెన్సీ అలవెన్సులు ఇవ్వాలన్నారు. డ్రైవర్లకు పదోన్నతులు కల్పించి, ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఏసీ రూంలో కూర్చొని హాయిగా పనిచేస్తున్నారంటూ సిద్దిపేట్ ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు ఖండించారు.


గ్లకోమా వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ప్రభాకర్

సరోజినీదేవి ఆస్పత్రిలో ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు

కార్వాన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నం సరోజినీదేవి ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో ఆదివారం ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ప్రభాకర్ గ్లకోమా వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. సరోజినీదేవి ఆస్పత్రిలో ప్రతీ సంవత్సరం గ్లకోమా వారోత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. నీటి కాసుల వ్యాధిపై అందరికీ అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజలింగం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

● రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

రాజేంద్రనగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రంజాన్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ సూచించారు. ఆదివారం పీడీపీ చౌరస్తాలోని ఐబీ ప్యాలెస్‌లో, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన వేర్వేరుగా ముస్లింలతో సమావేశం అయ్యారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనది. ఎక్కడా ఎలాంటి గొడవలు జరుగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవుపల్లి, అత్తాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. బస్తీలలలో ఎవరైనా గొడవలకు పాల్పడితే 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. ఆయా కార్యక్రమాలలో రాజేంద్రనగర్ ఏసీపీ టి.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు బి.నాగేంద్రబాబు పి.మధు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుంటున్నానంటూ డయల్ 100కు ఫోన్

● సీపీఆర్ చేసి కాపాడిన పోలీసులు


సీపీఆర్ చేస్తున్న పోలీసులు

సరూర్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకోవడానికి అంతా సిద్ధం చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ డయల్ 100కు ఫోన్ చేశాడు. స్పందించిన పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని కొనఊపిరితో ఉన్న సదరు వ్యక్తికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. ఈ సంఘటన రాచకొండ కమిషనరేట్‌లోని మీర్‌పేట్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం, బడంగ్‌పేట్‌కు చెందిన జగన్ కుటుంబ కలహాల నేపథ్యం లో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. శనివారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు లుంగీ కట్టి ఉరేసుకోవడానికి సిద్ధపడి డయల్ 100కు ఫోన్ చేశాడు. అక్కడి సిబ్బంది మీర్‌పేట్ పోలీసులకు సమాచారంతో పాటు లోకేషన్‌ను పంపించడంతో కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, రమావత్ రవి, నాగరాజు, హోంగార్డు నర్సింహ సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే జగన్ ఉరేసుకోగా, కిందకు దింపి సీపీఆర్ చేసి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అతడికి ప్రాణాపాయం లేదని, కోలుకుంటున్నాడని ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ చెప్పారు. జగన్‌ను కాపాడిన పోలీసులకు అతడి కుటుంబసభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. రాచకొండ కమిషనర్, ఇతర పోలీసు అధికారులు వారిని అభినందించారు.

ప్రజల ఆశీర్వాదంతోనే ఉన్నతస్థాయికి: ఈటల

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి తనకు మల్కాజిగిరితో సంబంధమేంటని అంటున్నారని.. తాను ఒక కులానికో, ప్రాంతానికో, మతానికో సంబంధించిన వాడిని కాదని, తెలంగాణ మట్టిబిడ్డగా, ప్రజల ఆశీర్వాదంతో ఉన్నత స్థాయికి వచ్చినవాడినని బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం కార్ఖానాలో ఆదివారం మేధావులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సీఎం మాటలపై ఆయన స్పందించారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడే వారికి ముందుంది ముసళ్ళ పండగ అని సుతిమెత్తగా హెచ్చరించారు. నా రాజకీయ జీవితంలో ఏ నాయకుడిపై, ఏ పార్టీపై వ్యక్తిగత దూషణలు చేయలేదని, సంస్కారం ఉన్న వాడినని అన్నారు. రాజకీయ నాయకులు ఉన్నతంగా ఉండాలని, సంకుచితంగా ఉండే వాళ్లు నాయకులు కాదన్నారు. చిన్న, కురస నాయకుల గురించి మాట్లాడనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలై ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు. మల్కాజిగిరిలో సమస్యల పరిష్కారం కోసం వచ్చానని పేర్కొన్నారు. నగరంలో ఫ్లైఓవర్లన్నీ కేంద్ర నిధులతో నిర్మిస్తున్నవేనని అన్నారు.

సంఘసంస్కర్తగా, ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా..

సావిత్రీబాయి పూలే సేవలు ఎనలేనివి

రాజేంద్రనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్తగా, ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా దేశానికి సావిత్రీబాయి పూలే చేసిన సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు. మహిళల విద్యా ప్రధాత సావిత్రీబాయి పూలే అని వారన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో, సీఐటీయూ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ కాటేదాన్‌లో సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించి, ఆమె చిత్ర పటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కమిటీ వ్యవస్థపక అధ్యక్షుడు కె. కృష్ణమాచారి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందే తాడిత పీడిత, అణగారిన వర్గాల కోసం పోరాటం చేసిన జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో సావిత్రీబాయి పూలే నడిచారని అన్నారు.మహిళలు విద్య ద్వారానే సమాజంలో రాణిస్తారని ఆశించిన సావిత్రీబాయి పూలే, మహిళలకు తొలి గురువు అని గుర్తుచేశారు. సావిత్రీబాయి పూలేకు చదువుల తల్లి పేరున్నదని అన్నారు. సావిత్రీ బాయి పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాల్సిన అవసరం ఉన్నదని కృష్ణమాచారి పిలుపునిచ్చారు. మహిళలు, రాజకీ, ఆర్థిక, సామాజిక రంగాల్లో రాణించేనప్పుడు సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అడికె అర్జున్, ఎం.మల్లికార్జున్‌గౌడ్, కె.రఘుగౌడ్, డి.సత్యనారాయణ ముదిరాజ్, బంగి శ్రీనివాస్, పెంద్యాల సాయిమల్లిక్, కరణం రఘుముదిరాజ్, ఎం.బాలసుబ్రమణ్యం, యూ.శ్రీకాంత్, కోరని బాల్‌రాజ్, కరణం నారాయణ ముదిరాజ్, కరణం యాదయ్య ముదిరాజ్, కె.ఎస్ దయానంద్, ఆదిరాల రవికుమార్, పీర్లగూడెం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాటేదాన్‌లో..

రాజేంద్రనగర్ సర్కిల్ కాటేదాన్‌లో క్లస్టర్ సీఐటీయూ కోశాధికారి బాస్కర్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జె రుద్రకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సావిత్రీబాయి పూలే మహారాష్ట్రలో జన్మించారని, 1884లో మొట్టమొదటి పాఠశాల ప్రారంభించి మహిళలకు విద్యాబుద్ధులు నేర్పించిన గొప్ప విద్యావేత్త అని కొనియాడారు. మహిళకు విద్యాబుద్ధులు చెబుతున్న సావిత్రీబాయి పూలేను అప్పట్లోనే కొంతమంది వేధించినా, ఆమె వెనకడుగు వేయలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, సచిన్, టి.వెంకటేశ్‌గౌడ్, దత్తు, శశికాంత్, జహంగీర్, నరేందర్, రాజేశ్, వెంకట్రావు, ఎండీ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.


సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పూలే జయంతి ఉత్సవాల కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాచారి తదితరులు


కాటేదాన్‌లో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



రాజేంద్రనగర్‌లో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాయిమల్లిక్,రఘు, బాలరాజ్, యాదయ్య, నారాయణ తదితరులు

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రాజేంద్రనగర్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ ప్రతినిధులు ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన నివాసం కలిశారు. ఈ సందర్భంగా వ్యవసాయ వర్సిటీలోని సమస్యలతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యను మంత్రికి వివరించారు. అందుకు స్పందించిన మంత్రి తుమ్మల మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 2024 క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. మంత్రిని కలిసిన వారిలో వ్యవసాయ వర్సిటీ ఎస్సీ ఎస్టీ టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.బాలాజీనాయక్, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు జి.పరమేశం, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.జయరాం, కార్యనిర్వాహక కార్యదర్శి సి.అరుణ్‌కుమార్, కోశాధికారి ఎస్.నర్సింగ్‌రావు, డాక్టర్ ఎం.గోవర్ధన్, డాక్టర్ బీవీ వరప్రసాద్, డాక్టర్ ఎం.రమేశ్, డాక్టర్ జి.సత్యనారాయణ, కె.బాలనర్సిమ్మ, డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ కేబీ ఈశ్వరీ పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్ కళాశాలల సాంస్కృతిక, సాహిత్య పోటీలు

ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ అంతర్ కళాశాలల సాంస్కృతిక, సాహిత్య పోటీలను రాజేంద్రనగర్‌లో నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి 205 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు

మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి: హైకోర్టు జడ్జి


డాక్టర్ ఉమర్ అలీషాను సన్మానిస్తున్న అతిథులు

మంగళ్‌హాట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అన్నిరంగాల్లోనూ సమాన అవకాశాలు కల్పించాలని, అప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని హైకోర్టు జడ్జి జి.రాధా రాణి పేర్కొన్నారు. మహిళల పట్ల లింగ వివక్షత చూపొద్దని అన్నారు. ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు, జీవనది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బొగ్గులకుంటలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో జడ్జి పాల్గొని మాట్లాడారు. సృష్టికి అధిపతి స్త్రీ అని, మహిళలకు స్వేచ్ఛ సమానత్వాన్ని కల్పించాలని అన్నారు. మనుషులంతా ఆధ్యాత్మిక శాంతి, సామరస్యంతో జీవించాలని సూచించారు. ఈ సందర్భంగా విశేష సేవలు అందించిన మహిళలను గౌరవ అతిథులుగా హాజరై రాజేశ్వరి ఐపీఎస్, దాసరి ప్రసన్న ఏపీ, వేమురి లక్ష్మీకాంత్ సన్మానించి అభినందించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పలువురు వ్యక్తులు వివరించారు. కార్యక్రమంలో సన్మానితులు సీత మహాలక్ష్మీ, దుర్గ, కె.లక్ష్మీ, మాధవి పాల్గొన్నారు.

‘వెనుకబడిన కులాలకు ఆసరాగా విశ్వకర్మ పథకం’

పహాడిషరీఫ్ మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కులాలకు ప్రధాని మోదీ ప్రారంభించిన విశ్వకర్మ పథకం ఆసరాగా ఉంటుందని రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప చెప్పారు. ఆదివారం మామిడిపల్లి రంగనాయకుల కాలనీలో ఈ. వేణుకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వకర్మ కులాలు ఆర్థికంగా ఎదగడానికి విశ్వకర్మ పథకం దోహదం చేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి సారకుమార్, ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మోంద్ర నర్సింహను సన్మానిస్తున్న సభ్యులు

సమాజహితం కోరే సాహిత్యం రావాలి

● ‘మార్మిక నది’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సమాజహితం కోరే సాహిత్యం రావాల్సిన అవసరముందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీభం సాయి సేవా ట్రస్టు, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి కళారత్న బిక్కి కృష్ణ రచించిన మార్మిక కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా మహిళాదినోత్సవం పురస్కరించుకొని వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలకు ఉమెన్ లెజెండరీ అవఆర్డులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ టి.డి.జనార్దన్ పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. ఆయా రంగాల్లో రాణిస్తున్న మహిళలు మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు అవార్డులు పనిచేస్తాయని అన్నారు. శ్రీభం సాయి సేవాట్రస్టు ఆధ్వర్యంలో విభిన్నమైన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. బిక్కి కృష్ణ రచించిన మార్మిక నది పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరముందని అన్నారు. కార్యక్రమంలో నరసింహప్ప, దైవజ్ఞశర్మ, డా.ప్రభాకర్ జైనీ, కవిశంకర్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

చిన్న అనంతగిరిలో ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

రాజేంద్రనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో మూడు రోజుల పాటుజరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం చిన్న అనంతగిరి శివాలయంలో సమావేశమైన ప్రణవ భక్త సమాజం కమిటీ సభ్యులు, అధ్యక్షుడు మోంద్ర నర్సింహను సన్మానించారు. శివరాత్రి ఉత్సవాలకు సహకరించిన ప్రతీ ఒక్కరికి మోంద్ర నర్సింహ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, ఉపాధక్షులు బర్ల మల్లారెడ్డి, సనివెళ్లి కృష్ణ, సంయుక్త కార్యదర్శులు కొండమీది హరినాథ్, గండయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మోహనంగా కూచిపూడి నాట్య ప్రదర్శన

రవీంద్రభారతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నాట్యాంశాలకు వైవిధ్యభరితంగా నర్తించి నర్తకులు ప్రేక్షకుల్ని సమ్మోహనపరిచారు. ఆదివారం రవీంద్రభారతిలో శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డాన్స్ 35వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య గురువు పి.రమాదేవి శిష్యులైన 40 మంది విద్యార్థులో కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించారు. చక్కటి హావభావాలతో కళాకారులు ఆకట్టుకున్నారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మశ్రీ ఉమామహేశ్వరి కళాకారులను సత్కరించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాట్యం చేసిన ప్రతి చిన్నారిలో సరస్వతీదేవి కనిపించిందని అన్నారు. విద్యార్థులు విద్యతోపాటు శాస్త్రీయ నాట్యంలో ప్రావీణం పొందాలని ఆకాంక్షించారు. నాట్య గురువు రమాదేవి మాట్లాడుతూ కళాకారులందరూ కుటుంబంతో సమానమని అన్నారు. అనంతరం విశిష్ట పురస్కారాలు ప్రదానం చేశారు. గురు సుధీర్‌రావు, మ్యూజిక్ శ్వేతాప్రసాద్, మృదంగం రేణుకాప్రసాద్, వాయిలిన్ సాయికుమార్, ఫ్లూట్ ఉమావెంకటేశ్వర్లు, తబలా శ్రీధరాచార్యకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డా.కళాకృష్ణ, భాగవతుల సేతూరాం, డా.వనజా ఉదయ్, డా.సజని పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

7,150 మంది పిల్లలకు గుండె సర్జరీలు


సర్జరీ చేయించుకున్న చిన్నారులతో జయేష్ రంజన్ తదితరులు

హైదరాబాద్ సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలకు గుండె సర్జరీలో చేయూత అందిస్తున్న హృదయ ఫౌండేషన్‌ను కార్పొరేట్లు, ఐటీ కార్పొరేట్ రంగాలు ప్రోత్సహించాలని ఐటీ అండ్ ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ పిలుపునిచ్చారు. టీ హబ్ వద్ద శనివారం రాత్రి హృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 7,150 సర్జరీలను పూర్తి చేసిన సందర్భంగా అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జయేష్‌రంజన్ మాట్లాడుతూ పెరుగుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి వ్యవస్థీకృత మద్దతు అందిచాలన్నారు. 2005లో ‘హృదయ క్యూర్ ఏ లిటిల్ హార్ట్’ను డాక్టర్ గోపీచంద్ మన్నంతో పాటు ఇతర భావాలు గల వ్యక్తులు స్థాపించి సేవలు అందిస్తున్నారని తెలిపారు. జైరాజ్‌కుమార్, డాక్టర్ నాగార్జున పొనుగోటి నేతృత్వంలో పుట్టుకతో వచ్చే గుండె జబ్బులతో బాధపడే వారందరికీ సహకరిస్తున్నారన్నారు. హృదయ ఫౌండేషన్, స్టార్, ఇన్నోవా ఆస్పత్రుల్లో 7,150 మందికి పైగా పిల్లలకు వైద్య చికిత్సలు పొందేందుకు సహాయం చేసిందన్నారు.


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకుడు అంజన్‌కుమార్ గౌడ్

మోదీ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

● చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

నార్సింగ్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ మెజారిటీ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ఆయన అన్నారు. ఆదివారం అరెమైసమ్మ ఆలయంలో బీజేపీ ప్రచార రథానికి పూజలు నిర్వంచగా, ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ సీనియర్ నాయకుడు టి. అంజన్‌కుమార్ గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎన్. మల్లారెడ్డి, శ్రీధర్, నందకిశోర్, మహేశ్‌యాదవ్, పీఎస్ మల్లారెడ్డి, నగేశ్‌యాదవ్, భీమ్, అర్జున్, నరేశ్ యాదవ్, గోపాలకృష్ణగౌడ్, భువనేశ్వరి, గౌతమీ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.


పతకాలు సాధించిన రెజ్లర్లు

గురుకులాల రెజ్లర్లకు 14 పతకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు పది స్వర్ణాలు, 4 రజతాలు సహా మొత్తం 14 పతకాలు కొల్లగొట్టారు. రెండ్రోజులుగా యాకత్‌పురాలో జరుగుతున్న ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. సచిన్, ప్రకాష్, ధర్మతేజ, విక్రమ్, నదిత్‌రాజ్, ఉపేందర్, వికాస్ లావణ్య, శిరీష, రిషిత, ప్రణీత స్వర్ణాలు, అక్షయ్, అర్చన, సృజన, సంతోషి రజత పతకాలు సాధించారు. వీరిని గురుకులాల క్రీడాధికారి రామ్‌లక్ష్మణ్ అభినందించారు.


పోటీల్లోని దృశ్యం

ఆఖరి మ్యాచ్‌లో హైదరాబాద్ ఓటమి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ సీజన్-3ను హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు ఓటమితో ముగించింది. ఈ సీజన్ ఆఖరి మ్యాచ్‌లో హైదరాబాద్ 0-3తో కొచ్చి బ్లూ స్పైకర్స్ చేతిలో ఓడి, పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. హైదరాబాద్ 12-15, 12-15, 11-15తో వరుస సెట్లలో పరాజయం పాలైంది. ఈ సీజన్‌లో హైదరాబాద్ ఆడిన ఎనిమిదింట్లో ఒక్క మ్యాచ్‌లోనే గెలవడం గమనార్హం.

13న దివ్యాంగులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

రవీంద్రభారతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయి చంద్ర ఎడ్యుకేషనల్, కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో దివ్యాంగులకు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు మాదారి తిరుపతి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి దివ్యాంగులు కార్యక్రమంలో హాజరై స్కాలర్‌షిప్ అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని అన్నారు. సభకు ముందు ప్రముఖ గాయని ఆమని నేతృత్వంలో సంగీత విభావరి నిర్వహించనన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో మాదారి తిరుపతి, ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకులు లయన్ కుసుబ భోగరాజు, మాదారి ప్రదీప్, నాని పాల్గొన్నారు.

‘విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి’

చాంద్రాయణగుట్ట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని శివాజీనగర్ శాంతినికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ శాలిని అన్నారు. ఆదివారం ఉప్పుగూడ శివాజీనగర్‌లోని శాంతినికేతన్ పాఠశాలలో విద్యార్థులతో వైద్య శిబిరం, బిజినెస్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు బీపీ, ఆక్సిజన్ స్థాయిలు, బీఎంఐ, శరీర ఉష్ణోగ్రతల పరీక్షలు చేసి రిపోర్టు అందజేశారు. బిజినెస్ ఫెయిర్‌లో భాగంగా విద్యార్థులు ఫుడ్‌స్టాల్ ఏర్పాటు చేసి వంటకాలను ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన అలంకరణ వస్తువులు, పెన్నులు, స్టాండ్‌లు, వాల్ హ్యాంగింగ్, హోల్డర్లు సందర్శకులకు విక్రయించారు. సైన్స్ ఫెయిర్‌లో భాగంగా విద్యార్థుల శాటిలైట్ కమ్యూనికేషన్, ఇంటిగ్రేటెడ్ ఫామింగ్, చంద్రయాన్-3, గుండెపోటుకు కారణాలు, డయాలసిస్ ప్రక్రియ, అయోధ్య రామమందిర నిర్మాణం, వ్యర్థ పదార్థాలను కాల్చడం వంటి పరికరాలు తయారు చేసి అందరినీ ఆకట్టుకున్నారు.

సన్మానం


షెడ్యూల్డ్ కులాల పరిరక్షణ సంఘాల ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం మహిళా దినోత్సవం, సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన మహిళలను మాజీ మంత్రి పుష్పలీల, షెడ్యూల్డ్ కులాల పరిరక్షణ సంఘాల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌బాబు, మహిళా కమిటీ అధ్యక్షురాలు స్టైలిన్ కృష్ణవేణి తదితరులు సన్మానించారు.
- యాకుత్‌పురా, (ఆంధ్రజ్యోతి)

మల్కాజిగిరి నుంచి పోటీకి నై!

(5వ పేజీ తరువాయి)

ఖర్చు ఆయనే భరించే అవకాశముంది. గతంలో మల్కాజిగిరి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రస్తుతం పునరాలోచనలో ఉన్నట్టు సమాచారం. అనూహ్యంగా కొత్త అభ్యర్థిని బీఆర్‌ఎస్ బరిలో దించే అవకాశం లేకపోలేదని పార్టీ సీనియర్ నాయకులు చెబుతున్నారు.

పార్టీకి ఏడుగురు ఎమ్మెల్యేలున్నా..

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలున్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో టికెట్ కోసం తీవ్ర పోటీ ఉండాలి. మొదట్లో ఆ పరిస్థితి కనిపించినా.. ఇప్పుడు పరిణామాలు మారాయి. ఒక్కొక్కరుగా నేతలు పోటీ చేసేందుకు నిరాసక్తత చూపుతున్నట్టు తెలుస్తోంది. గతంలో మల్కాజిగిరి, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో ఏదో ఒకచోట అవకాశమివ్వాలని కోరిన ఓ నాయకుడు, బీఆర్‌ఎస్ అగ్రనేతలు స్పందించకపోవడంతో ఇటీవలే కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు.

'కామన్ మొబిలిటీ కార్డు' ఎప్పుడు..?

(5వ పేజీ తరువాయి)

తీసుకురావాలని ఆదేశించినప్పటికీ ఆచరణలో అధికారులు విఫలమయ్యారు. నగరంలో మెట్రో రైళ్లలో రోజుకు సగటున 4.90 లక్షల నుంచి 5.10 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అలాగే 2,638 ఆర్టీసీ బస్సుల్లో దాదాపు 21లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో 2లక్షల మంది విద్యార్థులు, 2 లక్షల మంది ఉద్యోగులు, ఇతరులు బస్‌పాస్‌లను వినియోగిస్తూ రాకపోకలు సాగిస్తున్నారు.

నగరంలో ప్రజా రవాణా

సంస్థ	సర్వీసులు	రోజువారీ ప్రయాణికులు
మెట్రో	1028	5.10 లక్షలు
ఆర్టీసీ	2630	21 లక్షలు
ఎంఎంటీఎస్	76	45 వేలు

ఇప్పటికే అమలులో ఎంఎంటీఎస్-బస్‌పాస్

నగరంలోని సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి, ఫలక్‌నుమా కారిడార్లలో ప్రస్తుతం రోజుకు 76 ఎంఎంటీఎస్ రైళ్లు నడుస్తుండగా గరిష్ఠంగా వాటిలో 45 వేలమంది రాకపోకలు సాగిస్తున్నట్లు రైల్వేవర్గాలు చెబుతున్నాయి. ఎంఎంటీఎస్ రైళ్లు దిగిన తర్వాత ఉదయం, సాయంత్రం వేళల్లో కార్యాలయాలు, ఇళ్లకు వెళ్లేందుకు అనుకూలంగా ఉండే ఆర్టీసీ బస్సులకు అనుసంధానంగా ఎంఎంటీఎస్ బస్‌పాస్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. రూ.1,350 పెట్టి బస్‌పాస్ తీసుకుంటే అటు ఎంఎంటీఎస్‌లో, ఇటు ఆర్టీసీ బస్సుల్లో టికెట్ రహిత ప్రయాణాన్ని సాగించే అవకాశాన్ని కల్పించారు. ఫలితంగా గ్రేటర్ వ్యాప్తంగా రోజుకు దాదాపు 8వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు.

బహుళ ప్రయోజనాలు..

మెట్రో, ఆర్టీసీకి కలిపి కామన్ మొబిలిటీ కార్డును అందుబాటులోకి తెస్తే బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఈ కార్డు తొలిదశలో విజయవంతమైతే.. తర్వాత దశలో ఎంఎంటీఎస్ రైళ్లు, క్యాబ్‌లు, ఆటోల్లో కూడా ఉపయోగించుకునే విధంగా విస్తరించవచ్చని ఓ మెట్రో అధికారి తెలిపారు. కామన్ మొబిలిటీ కార్డును మన రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా వినియోగించుకునేలా ఆయా ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకుంటే బహుళ సౌకర్యాలుంటాయన్నారు. ఉదాహరణకు ఈ కార్డు కలిగిన వారు ఢిల్లీ, ముంబై, చెన్నయ్, కోల్‌కతా లాంటి నగరాలకు వెళ్లిన సమయంలో అక్కడి ఆర్టీసీ బస్సులు, మెట్రో రైళ్లు, ఇతర ప్రజారవాణా వ్యవస్థలన్నింటిలో టికెట్లు తీసుకోకుండానే వాడుకోవచ్చని చెప్పారు. కాగా, గత ప్రభుత్వం అమల్లోకి తీసుకురాలేకపోయిన కామన్ మొబిలిటీ కార్డు విధానంపై కాంగ్రెస్ సర్కారు దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

పుడ్ అలర్జీలతో పరేషాన్..



(5వ పేజీ తరువాయి)

ముక్కు నుంచి స్రావాలు రావడం, ముక్కు మూసుకుపోవడం, తలనొప్పి, మైకం వంటి ఇబ్బందులు ఉండే అవకాశం ఉంటుందని అంటున్నారు. సాధారణంగా 40 నుంచి 50 ఏళ్ల వయస్సు వారిలో అలర్జీ సమస్యలు కనిపిస్తాయి. కానీ.. ఇప్పుడు 20 ఏళ్లపైబడిన వారిలో కూడా కనిపిస్తున్నాయని చెబుతున్నారు. శరీర తత్వాన్ని బట్టి కొందరిలో తరుచూ అలర్జీ ఇబ్బందులు రావచ్చని పేర్కొంటున్నారు.

అలర్జీ ట్రిగ్గర్స్‌కు మరింత ముప్పు



క్యాబేజీ, కాలీఫ్లవర్, వంకాయ, చోళ ఆహారంగా తీసుకున్న వారిలో అలర్జీ కేసులు ఎక్కువగా చూస్తున్నాం. ఇటీవల యువతలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆస్తమా ఉన్న వారు, బ్రాంకైటిస్, అలర్జీ ట్రిగ్గర్స్ ఉండే వారిలో ఈ సమస్యలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. కొందరిలో చేపలు, చికెన్, రొయ్యలతో అలర్జీ ఎక్కువగా వస్తుంది. చేపలు తిన్న వారిలో బ్రాంకోస్పాజా సమస్య తీవ్రంగా ఉంటుంది. ఈ సమస్య వస్తే ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. మూడేళ్ల క్రితం ఓ వైద్య విద్యార్థి ఇదే సమస్యతో మృత్యువాత పడ్డ సందర్భం ఉంది. అలర్జీ రావడానికి ప్రధాన కారణం ఇమ్యూనిటీ లోపమే. ఇమ్యూనిటీ బాగా ఉంటే అలర్జీని తట్టుకునే శక్తి ఉంటుంది. వ్యాయామం చేయడం, ఇంటి ఆహారం, బాగా ఉడికిన ఆహారమే తీసుకోవడం, పండ్లు, కాయగూరలు తినడం అలవాటుగా చేసుకోవాలి. ఇమ్యూనిటీని పెంచుకోవాలి.

- వెంకట్ నాని, సీనియర్ జనరల్ ఫిజీషియన్, అపోలో ఆస్పత్రి

మసాలా దినుసులు, ఫుడ్ కలర్‌తో ముప్పే



కొన్ని రకాల ఆహారం తీసుకున్నప్పుడు కొందరి శరీరంలో ఇస్టమిన్ అనే కెమికల్ విడుదలై అలర్జీ ఏర్పడుతుంది. కొన్నిసార్లు పరీక్షలు చేసినప్పటికీ పాజిటివ్ వస్తుంది. అయినప్పటికీ వారిలో అలర్జీ లక్షణాలు కనిపిస్తాయి. వంకాయ, టమాటా, గోంగూర వంటివి కొందరిలో అలర్జీ కారకాలుగా తయారయ్యాయి. ఇలాంటి వారిలో శరీరంపై దద్దుర్లు ఏర్పడడం, శరీరం అంతా దురదగా ఉండడం వంటి ఇబ్బందులు ఏర్పడతాయి. నిల్వ చేసిన ఆహార పదార్థాలు తిన్నప్పుడు, ఫుడ్ కలర్‌ల వినియోగం ద్వారా కొందరిలో అలర్జీ వస్తుంది. ఫుడ్ అలర్జీ కేసులు వారానికి 10 నుంచి 20 వరకు చేస్తున్నాం. కొన్ని రకాల చర్మసంబంధిత ఇబ్బందులున్న వారు వారానికి అయిదారుగురు అలర్జీతో వస్తున్నారు

- డాక్టర్ సింధూర కంభపాటి, సీనియర్ డర్మాటాలజిస్టు

ఉద్యమ ఆకాంక్షలు ఫలించేదాకా పోరాటం

ప్రొఫెసర్ కోదండరాం



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రొ.కోదండరాం, అంబటి నాగయ్య, జేఏసీ నేతలు, ఉద్యమకారులు

కవాడిగూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ఆకాంక్షలు ఫలించేదాకా పోరాటం చేస్తామని జేఏసీ నేతలు, ఉద్యమకారులు పేర్కొన్నారు. 'మిలియన్ మార్చ్' నిర్వహించి 14 ఏళ్లు నిండిన సందర్భంగా ఆదివారం తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య ఆధ్వర్యంలో పోతన విగ్రహం వద్ద వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జనసమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో 'మిలియన్ మార్చ్' ప్రధాన భూమిక పోషించిందని గుర్తు చేశారు. మిలియన్ మార్చ్ ఉత్సవాలను నిర్వహించాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరితే పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, అంబటి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బైరి రమేష్, ధర్మార్జున్, నిజ్జన రమేష్, వినయ్, నగర అధ్యక్షుడు నర్సయ్యగౌడ్, యువత అధ్యక్షులు సలీంపాషా, అరుణ్, రవికాంత్, సురేష్, రాంచందర్, లక్ష్మణ్, యశ్వంత్, రామగిరి ప్రకాష్, వినయ్, విద్యాసాగర్, తుల్జారెడ్డి, మోహన్‌రెడ్డి, వినోద్‌కుమార్, రాజు, రవీందర్, జావెద్, రాజేష్, కొత్త రవి, రంగారెడ్డి, ఉద్యమకారులు పాల్గొన్నారు.

స్టెరాయిడ్ల వాడకంతో కంటికి ముప్పు

● ఎల్వీపీఈఐ నేత్ర వైద్యులు



గ్లకోమా అవేరెనెస్ వాక్‌లో సినీనటి నిహారిక కొణిదెల, ఎల్వీపీఈఐ వైద్యులు

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కంటి చుక్కలు, ఆయింట్‌మెంట్లు, ఇన్‌హేలర్లు, మాత్రలు, ఇంజెక్షన్లతో సహా ఏ మందుల్లో అయినా స్టెరాయిడ్లు ఉండొచ్చని, వీటిని వాడితే కంటికి ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఎల్వీప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్(ఎల్వీపీఈఐ) నేత్ర వైద్యులు స్పష్టం చేశారు. కంటి దృష్టిపై స్టెరాయిడ్ ప్రేరిత గ్లకోమా ప్రభావాన్ని వివరించేందుకు తలపెట్టిన గ్లకోమా అవేరెనెస్ వాక్‌ను ఆదివారం ఉదయం బంజారాహిల్స్‌లోని ఎల్వీపీఈఐ వద్ద సినీనటి నిహారిక కొణిదెల జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్లకోమాపై ఎల్వీప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వైద్యులు, నిపుణులు చేస్తున్న కృషిని అభినందించారు. కంటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎల్వీపీఈఐ నేత్ర వైద్యుడు సిద్ధార్థ దీక్షిత్ మాట్లాడుతూ పిల్లల్లో ఎక్కువమంది ఎలాంటి మందుల చీటీలు లేకుండా స్టెరాయిడ్లు వినియోగిస్తున్నారని, ఇది కంటి లోపాలకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎల్వీపీఈఐ నిర్వహించిన ఒక అధ్యయనంలో కంటి అలెర్జీ ఉన్న 4,062 మంది పిల్లల్లో 2.2 శాతం మందికి స్టెరాయిడ్ ప్రేరిత గ్లకోమా ఉందని తేలినట్టు తెలిపారు. కంటి దృష్టిపై స్టెరాయిడ్ ప్రభావం చూపుతుందన్నారు. దీనివల్ల ఆప్టిక్ నరాలు దెబ్బతిని అంధత్వానికి దారి తీస్తుందన్నారు. 2040 నాటికి గ్లకోమాతో బాధపడుతున్న రోగుల సంఖ్య 76 మిలియన్ల నుంచి 111.8 మిలియన్లకు పెరుగుతుందని అంచనాలు ఉన్నాయన్నారు. స్టెరాయిడ్లను ఎక్కువకాలం, అధిక మోతాదులో ఉపయోగించినప్పుడు ఈ సమస్య ఉంటుందన్నారు. స్టెరాయిడ్లు కంటి శుక్లాలకు కారణమవుతాయని తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే మందులు వాడాలన్నారు. కంటి చుక్కలు, ఇన్‌హేలర్లు, ఆయింట్‌మెంట్లు, మాత్రలు వాడే వ్యక్తులు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

వారం రోజుల్లో పరీక్షలు.. రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



సాయిలోకేష్

బంజారాహిల్స్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మరో వారం రోజుల్లో 10వ తరగతి పరీక్షలు.. ఒత్తిడి తగ్గించుకునేందుకు సరదాగా ద్విచక్రవాహనం తీసుకొని స్నేహితులతో కలిసి బయటకు వచ్చిన విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన సాయిలోకేష్(15) స్థానిక పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. వారం రోజుల్లో పరీక్షలు ఉండడంతో ఒత్తిడి తగ్గించుకునేందుకు ఆదివారం ఉదయం సరదాగా స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై బంజారాహిల్స్‌కు వచ్చాడు. రోడ్ నెంబర్-3కి రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న సాయిలోకేష్ బైక్‌పై నుంచి ఎగిరి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. దాంతో తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా భారత్ జోడో న్యాయ్ యాత్ర మారథాన్

కృష్ణకాంత్ పార్కు నుంచి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం వరకు..



మారథాన్‌లో బి.వి.శ్రీనివాస్, అజారుద్దీన్, నవీన్‌యాదవ్, శివసేనారెడ్డి, తదితరులు



పాటకు అనుగుణంగా స్టెప్పులు వేస్తున్న చిన్నారులు

పంజాగుట్ట/యూసుఫ్‌గూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ప్రధాని నరేంద్ర మోదీ నిరుద్యోగులకు మోసం చేశారని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి ప్రభుత్వ ఆస్తులను గుజరాతి కంపెనీలకు అమ్మేస్తున్నారని యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బి.వి.శ్రీనివాస్ ఆరోపించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రకు మద్దతుగా యూత్ కాంగ్రెస్ స్పోర్ట్స్ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కృష్ణకాంత్ పార్కు నుంచి కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం వరకు మారథాన్ ర్యాలీ నిర్వహించారు. క్రీడాకారులు, విద్యార్థులు, యువతి, యువకులు పెద్ద సంఖ్యలో ఈ మారథాన్‌లో పాల్గొన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారికి, విజేతలకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా బి.వి.శ్రీనివాస్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ యువకులు, నిరుద్యోగుల కోసం ప్రకటించిన ఐదు గ్యారెంటీలను యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు గడపగడపకూ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ నియోజకవర్గంలో మారథాన్ చేపట్టాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్ అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, స్పోర్ట్స్ సెల్ చైర్మన్ మహ్మద్ అసదుద్దీన్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్, కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, భవానిశంకర్, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

'రన్ ఫర్ షీ' మారథాన్



మారథాన్‌లో భాగంగా జుంబాలో పాల్గొన్న హైదరాబాద్, ఉప్పల్ రన్నర్స్, ఐటీ ఉద్యోగులు



5కే రన్‌లో ఉప్పల్ రన్నర్స్

ఉప్పల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఉప్పల్‌లో పెద్ద ఎత్తున మారథాన్ నిర్వహించారు. ఆదివారం హైదరాబాద్ రన్నర్స్, ఉప్పల్ రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉప్పల్ ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, ఉప్పల్‌లోని డీఎస్‌ఎల్ విర్చ్యూమాల్, ఉప్పల్ గేమ్ పాయింట్ సంస్థలతో కలిసి 'రన్ ఫర్ షీ' పేరుతో మారథాన్ చేపట్టారు. ఉదయం 7 గంటలకు ఉప్పల్ డీఎస్‌ఎల్ మాల్ నుంచి మొదలైన రన్ క్రికెట్ స్టేడియం, జెన్‌పాక్ మీదుగా తిరిగి మాల్‌కు చేరుకుంది. రన్‌లో పాల్గొన్న వారికి మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధి రవిశ్రీనివాస్, డీఎస్‌ఎల్ ప్రతినిధి మహమూద మాట్లాడుతూ మహిళల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ రన్ నిర్వహించినట్లు తెలిపారు. రన్‌లో వివిధ ఐటీ కంపెనీల ఉద్యోగులు పాల్గొన్నారు. అంతకుముందు రన్నర్స్ మాల్ ఆవరణలో జుంబా నిర్వహించారు.

మహిళలకు ఇన్‌స్పైరింగ్ ఉమెన్-2024 పురస్కారాలు



పురస్కారాలు పొందిన మహిళలతో వి ఫర్ ఉమెన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రవీంద్రభారతిలో వి ఫర్ ఉమెన్ స్వచ్ఛంద సంస్థ పలు రంగాల్లో స్ఫూర్తిదాయక మహిళలకు ఇన్‌స్పైరింగ్ ఉమెన్-2024 పురస్కారాలను ప్రదానం చేసింది. రాజకీయ, సామాజిక, పత్రిక, బ్యూరోక్రసీతోపాటు పలు రంగాల్లో స్ఫూర్తిగా నిలిచిన 10 మంది మహిళలను సత్కరించారు. వీరి జీవన ప్రయాణాన్ని సంస్థ ప్రతినిధులు తెలియజేసి మరెందరికో ప్రేరణను కలిగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మంజుల అనగాని హాజరుకాగా, సైకాలజిస్ట్ శారద లింగరాజు, గాయని విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీతల్లో ఒకరైన పారిశ్రామికవేత్త వాసంతి గోగినేని మాట్లాడుతూ తాను పడిన కష్టం వల్ల ఇప్పుడు యాభై మందికి పైగా ఉపాధి కలిగించగలిగానన్నారు. ట్రాన్స్ ఉమెన్‌గా పురస్కారం అందుకున్న సుబ్బలక్ష్మీరెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచి తాను అనేక రకాలుగా వివక్షను ఎదుర్కొన్నానన్నారు. తనకు సంఘంలో గౌరవం లభించాలంటే ఏదైనా సాధించి చూపించాలనే పట్టుదలతో కృషి చేయడం వల్ల 50 మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరానన్నారు. ఆటో డ్రైవర్‌గా పురస్కారమందుకున్న అరిగె అరుణ మాట్లాడుతూ భర్త అనారోగ్య సమస్యల వల్ల మరణించడంతో కుటుంబ పోషణ కోసం ఆటోడ్రైవర్‌గా మారానన్నారు. మరణానికి ముందే భర్త తనకు ఆటో నడిపించడం నేర్పించారని, అదే ఇప్పుడు తనకు జీవనోపాధిగా మారి, తన పిల్లలకు గౌరవ ప్రదమైన జీవితాన్ని అందించేందుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. పురస్కారాలను అందుకున్న మహిళల్లో గోషామహల్ కార్పొరేటర్ పరమేశ్వరీసింగ్, ఉపాధ్యాయులు జయంతి, జర్నలిస్ట్ రాధిక, లైఫ్ కోచ్ మల్లిక, ఓ స్కూల్ ఆయా పార్వతి, సామాజిక కార్యకర్త సీతామహాలక్ష్మి, తదితరులు ఉన్నారు. నాలుగేళ్ల నుంచి ప్రతీ సంవత్సరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వీ ఫర్ ఉమెన్ తరఫున ఇన్‌స్పైరింగ్ ఉమెన్ పురస్కారాలను అందజేస్తున్నామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. ప్రతిభాలక్ష్మి తెలిపారు.



బాలిక తయారు చేసిన ప్లకార్డును ఆవిష్కరిస్తున్న డా.ఉషారాణి, తదితరులు

స్వశక్తితో అన్నిరంగాల్లో రాణింపు : డాక్టర్ ఉషారాణి

అడ్డగుట్ట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్వశక్తి ఉంటే మహిళలు అన్నిరంగాల్లో రాణించగలరని సన్నిహిత హోం డైరెక్టర్ డాక్టర్ ఉషారాణి అన్నారు. ఆదివారం తుకారాంగేట్‌లోని సన్నిహిత హోంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆశ్రమ పిల్లలు పాడిన పాటలు, మహిళలపైన జరుగుతున్న అకృత్యాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో మార్పు రావాలంటే చదువు ముఖ్యమన్నారు. చిన్నప్పటి నుంచే తమ ఆశ్రమంలో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసించి ఎంతోమంది ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సుధ గోపరాజు, సన్నిహిత సంస్థ సభ్యులు వైఎస్.శ్రీదేవి, ఉపాధ్యక్షులు కిరణ్మయి, చైల్డ్ కౌన్సిలర్ రోహిణి నాయుడు, లయన్స్ క్లబ్ సభ్యులు విజయ, పార్వతి, రచయిత విజయ బండారు, లక్ష్మి, సౌజన్య, బబిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎల్లలు దాటిన పాట



'రామ్ ఆయేంగే'... అయోధ్య రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ సమయంలో సామాజిక మాధ్యమాల్లో బాగా వినిపించిన పాట ఇది. అద్భుతమైన పాటలు ఎన్నో ఉన్నా... ఈ పాటే ఎందుకంత ప్రాచుర్యం పొందింది? ఎందుకంటే ఇది పాడింది ఒక జర్మనీ గాయని. పేరు... కసండ్రా మే స్పిట్‌మన్. 22 ఏళ్ల కసండ్రా బహుముఖ ప్రజ్ఞాశాలి. పాటలు కూడా రాస్తుంది. ఆ పాటతోనే ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' అయింది.

ఆ మధ్య ఓ కార్యక్రమంలో భాగంగా తమిళనాడు వెళ్లినప్పుడు... ఆమెకు ప్రధాని ప్రత్యేక ఆహ్వానం పంపించి మరీ కలిశారు. తల్లితో కలిసి తమిళనాడులోని పల్లడం వచ్చిన ఆమె... మోదీ ముందు 'అచ్యుతమ్ కేసవమ్' పాడి వినిపించింది. తరువాత మరో తమిళ పాట కూడా ఆలపించింది. ఆమె గాన మాధుర్యానికి మోదీ పరవశించిపోయారు. పాడుతున్నప్పుడు తాళం వేస్తూ... ఆస్వాదించారు.

'ఎంత అద్భుతమైన గొంతు! భగవంతుడిపై ఆమెకు ఉన్న ప్రేమ ఆ గొంతులో ప్రతిధ్వనిస్తోంది. ఆ స్వరమాధుర్యం ఒక జర్మనీ బిడ్డదని తెలిస్తే మీరు మరింత సంభ్రమాశ్చర్యాలకు లోనవుతారు. ఆమె పేరు కసండ్రా మే స్పిట్‌మన్' అంటూ మోదీ 'ఎక్స్'లో కొనియాడారు.



తన ముందు పాడిన పాటను షేర్ చేశారు. లక్షల మంది కసండ్రా గానామృతానికి ఫిదా అయ్యారు.

భారతీయ భాషల్లో...

జర్మనీకి చెందిన కసండ్రా పేరు భారత్‌లో గత ఏడాది బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. తమిళంతో పాటు పలు భారతీయ భాషల్లో ఆమె ఆలపించిన భక్తి గీతాలు నెటిజనులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకుని... కసండ్రా 'రామ్ ఆయేంగే' అంటూ హిందీ గీతాన్ని ఆలపించింది. దాన్ని తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే... గంటల్లో వ్యూస్ లక్షలు దాటాయి. హిందీతో పాటు సంస్కృతం, హిందీ, మళయాళం, తమిళం, ఉర్దూ, అస్సామీ, బెంగాలీ భాషల్లో కూడా ఆమె భక్తి పాటలు అద్భుతంగా పాడుతుంది. ఆమె గానం లయబద్ధంగా సాగుతుంది. పదాలు స్పష్టంగా పలుకుతుంది. భారతీయ సంగీతంపై ఆమెకు ఎనలేని మక్కువ.

ఎన్నో ఘనతలు...

కాస్‌మేగా తన అభిమానులకు బాగా పరిచయమైన కసండ్రా మే స్పిట్‌మన్ చిన్నప్పుడు డ్రమ్స్ వాయించేది. తరువాత పియానోలో పట్టు సాధించింది. ఆమెపై ప్రముఖ సంగీతకారుడు, పియానిస్ట్ చోపిన్ ప్రభావం ఎక్కువ. తొలుత రేడియోలో తన ప్రతిభను ప్రదర్శించిన కసండ్రా... తరువాత 'డీన్ సాంగ్' టీవీ షోతో బాగా పేరు తెచ్చుకుంది. బోస్టన్‌లోని 'బర్క్‌లీ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్' నుంచి స్కాలర్‌షిప్ అందుకోవడం ఆమె కెరీర్‌లో పెద్ద మలుపు. వివిధ వేదికలపై నుంచి తన గాత్రాన్ని వినిపించి. పియానోతో అలరించింది. ఎందరో హృదయాలు గెలుచుకుంది. కసండ్రా పాడిన 'ది వే ఐయామ్' గీతం ప్రతిష్ఠాత్మక బర్క్‌లీ కాలేజీ నుంచి అవార్డు గెలుచుకుంది. 2015లో నిర్వహించిన సాంగ్ రైటింగ్ పోటీల్లో జాతీయ అవార్డు దక్కించుకుంది. అలాగే 2021లో జరిగిన 'యూకే సాంగ్ రైటింగ్ పోటీ'లో 'బుల్లీస్' పాటకు గానూ ప్రథమ బహుమతి అందుకుంది.

భారతీయ సంగీతం, వాయిద్యాల మీద ఎంతో ఆసక్తి కనబరిచే కసండ్రా... అందులో కూడా ప్రావీణ్యం పొందేందుకు ప్రయత్నిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో లక్షలమందిని అలరిస్తూ... వారి ఆదరాభిమానాలు చూరగొన్న ఆమెకు దృష్టి లోపం. కానీ కసండ్రాలోని అసమాన కళాకారిణికి, కళ కోసం సరిహద్దులు దాటి ఆమె పడుతున్న తపనకు ఆ లోపం అడ్డు కాలేదు. అచంచలమైన ఆత్మవిశ్వాసంతో... మన కళలు, సంస్కృతిపై ప్రేమతో కసండ్రా పంచుతున్న గానామృతానికి వెల కట్టలేం.



ఆమె జీవితం పాఠమైంది...

ఏడేళ్ళకే చూపును కోల్పోయినా... మొక్కవోని ఆత్మవిశ్వాసంతో విజేతగా నిలిచారు డాక్టర్ జి.ఎన్.సంగీత. ఆసియా దేశాల అంధుల సదస్సులో తన ప్రసంగంతో ఎందరో ప్రముఖుల్ని మెప్పించారు. ఆమె జీవితంపై ఒక మాజీ మంత్రి పిహెచ్‌డి చేస్తే... సీబీఎస్ఈ విద్యార్థులకు ఆమె కథ పాఠమయింది. కౌన్సెలర్‌గా వేలాది మందికి జీవన మార్గదర్శి అయిన సంగీత 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

"నాది అందమైన బాల్యం. ఆహ్లాదమైన రంగురంగుల ప్రపంచం. ఆనందమంతా నాదే అన్నట్టుగా గడిచిన రోజులవి. మా నాన్న నటరాజ్ పంచాయతీరాజ్ విభాగంలో ఇంజనీర్. అమ్మ లలిత గృహిణి. 1973 ఆగస్ట్ 15న జన్మించిన నేను ఏడేళ్ళ వరకూ ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పెరిగాను. కానీ నేను మూడో తరగతిలో ఉన్నప్పుడు తరచూ జ్వరం వస్తుండడంతో... పరీక్షలు చేయించాం. బ్రెయిన్ ట్యూమర్ అని నిర్ధారణ అయింది. దాని కారణంగా కొద్ది రోజుల్లోనే నా కంటి చూపు పోయింది. ఒక్కసారిగా అంతా తల్లకిందులైపోయింది. జీవితాంతం అంధకారంలో ఉండాల్సిందేననే వాస్తవాన్ని... ధైర్యంగా ఎదుర్కోవడానికి సిద్ధమయ్యాను. ఆ సమయంలో నా కుటుంబం నాకు ఎంతో ఆత్మస్థైర్యాన్ని అందించింది. చదువంటే నాకు ఎంతో ఇష్టం. కళ్ళు లేవని కలత చెందకుండా... చదువు కొనసాగించాల్సిందేనని నిశ్చయించుకున్నాను. కొన్ని నెలల తరువాత బెంగళూరులోని నేషనల్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్‌లో చేరాను. బ్రెయిలీ లిపి నేర్చుకున్నాను. నాకు చదువు నేర్పడానికి అనుకూలంగా ఉంటుందని మా అమ్మ కూడా ఆ లిపిలో ప్రావీణ్యం పొందింది. ఏడో తరగతిలో తిరిగి మామూలు బడిలో చేరాను. నేను చెబుతూ ఉంటే పరీక్ష రాయడానికి ఎంతో మంది ముందుకువచ్చి సహకరించేవారు. బెంగళూరులోని ఎన్ఎంకెఆర్‌వి కాలేజీలో చరిత్ర, అర్థశాస్త్రం తదితర సబ్జెక్ట్స్‌తో పీయూసీ, చరిత్ర, అర్థశాస్త్రం, సోషియాలజీతో బీఏ, అనంతరం ఎంఏ పూర్తి చేశాను. అదే సమయంలో కన్నడంతోపాటు ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ భాషల మీద పట్టు సాధించాను.

> గొప్ప విజయాలు సాధించి, స్ఫూర్తిదాయకులుగా నిలిచిన మహిళలను ఇంటర్వ్యూ చేసే డాక్యుమెంటరిస్ట్ ఉద్యోగం అది. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి, ప్రముఖ నటి భానుమతి, సుప్రసిద్ధ గాయని గంగూబాయ్ హానగల్ లాంటి ఎందరినో ఇంటర్వ్యూ చేసే అవకాశం నాకు కలిగింది. ఇప్పటివరకూ సుమారు 2,500 మందిని ఇంటర్వ్యూ చేశాను.

ఎలిజబెత్ రాణితో విందు...

నాకు ప్రయాణాలంటే ఇష్టం. 1990లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు యుకెకి చెందిన 'సైట్ సేవర్స్' అనే సంస్థ ఆరుగురిని ఎంపిక చేసి, బ్రిటన్ రాణి ఎలిజబెత్‌తో విందులో పాల్గొనే అవకాశం కల్పించింది. వారిలో నేనూ ఒకర్ని. నా సమాచారం బీబీసీలో ప్రసారమయింది. హంపీ యూనివర్సిటీలో మహిళా సంబంధిత అంశాలపై పిహెచ్‌డి చేయడానికి కర్ణాటకలోని ముప్ఫై జిల్లాలు పర్యటించాను. అప్పటి గవర్నర్ చతుర్వేది చేతుల మీదుగా పిహెచ్‌డి పట్టా అందుకున్నాను. ఆ రాష్ట్రంలో పిహెచ్‌డి చేసిన తొలి అంధ మహిళగా నిలిచాను. 2003లో ఆసియా దేశాల అంధుల సదస్సులో... 42 దేశాల ప్రతినిధులను ఉద్దేశించి నేను చేసిన ప్రసంగం ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. ఆ పర్యటనకు నా వెంట రావాల్సిన సహాయకులు ఏదో ఆటంకం ఎదురై ఆగిపోయారు. దాంతో నేను ఒంటరిగానే పాక్ వెళ్ళాను. అది మరచిపోలేని అనుభవం. 2005లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌ను కలుసుకున్నాను. మహిళా సాధికారతపై పరిశోధనలు చేయాలని ఆయన నాకు సూచించారు. దేశమంతా తిరగాలనేది నా ప్రగాఢ వాంఛ. దాన్ని నెరవేర్చుకోవడానికి కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ పర్యటించాను. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ నాకెంతో నచ్చింది.

ప్రముఖులతో ఇంటర్వ్యూలు...

ఉన్నత విద్యలో నేను రాణించడంతో... నేను ఎంఏ పూర్తి చేశాక... మా కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు నాకు అరుదైన అవకాశం కల్పించారు. గొప్ప విజయాలు సాధించి, స్ఫూర్తిదాయకులుగా నిలిచిన మహిళలను ఇంటర్వ్యూ చేసే డాక్యుమెంటరిస్ట్ ఉద్యోగం అది. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి, ప్రముఖ నటి భానుమతి, సుప్రసిద్ధ గాయని గంగూబాయ్ హానగల్ లాంటి ఎందరినో ఇంటర్వ్యూ చేసే అవకాశం నాకు కలిగింది. ఇప్పటివరకూ సుమారు 2,500 మందిని ఇంటర్వ్యూ చేశాను. వారిలో అయిదు నుంచి తొంభై అయిదేళ్ళ వయసు వాళ్ళ వరకూ ఉన్నారు. ఈ ఇంటర్వ్యూలను భద్రపరచిన మ్యూజియం బాధ్యతలు కూడా నేనే చూసుకుంటున్నాను. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వావలంబన కార్డు'పై అవగాహన కల్పించడం కోసం నేను చేసిన ప్రచారానికి ఎన్నో అభినందనలు వచ్చాయి. ఎల్ఐసిలో దివ్యాంగుల కోసం పాలసీలు కావాలని పోరాడి విజయం సాధించాను. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం నాకిష్టం. పరీక్షలంటే భయపడే విద్యార్థులకు, ఆర్థిక, కుటుంబ సమస్యల కారణంగా తనువు చాలించాలనే నిర్ణయానికి వచ్చినవారికి కౌన్సెలింగ్ చేస్తూ ఉంటాను. ఇప్పటివరకూ కనీసం పాతికవేలమందికి ఫోన్ల ద్వారా సలహాలు, సూచనలు ఇచ్చాను.



ఎన్నెన్నో పురస్కారాలు...

ఎందరో మహనీయులను కలుసుకోవడంతో పాటు అనేక పురస్కారాలను సైతం నేను అందుకున్నాను వాటిలో 2005లో గవర్నర్ అవార్డ్, 2008 ఉపరాష్ట్రపతి చేతులమీదుగా జాతీయ అవార్డు. 2009లో బెస్ట్ ఫిజికల్లీ ఛాలెంజ్డ్ ఉమెన్‌గా, 2011లో పిహెచ్‌డి సాధించినందుకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ సత్కారాలు, 2012లో బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ) నుంచి కెంపెగౌడ అవార్డు. అలాగే మదర్ థెరీసా దేశీ అవార్డు, నీలమ్ కే గంగా అవార్డు, రోటరీ క్లబ్ నుంచి ఆర్నవ్ ఉమెన్ అఛీవర్స్ అవార్డు, విశ్వచైతన్య అవార్డు. కలశ అవార్డు, డెఫ్ అండ్ డంబ్ కల్చరల్ అకాడమీ నుంచి ఉమెన్ అఛీవర్ అవార్డు, ఉగాది పురస్కారం, సంకల్ప రత్న, చంద్రమ్మ స్త్రీరత్న, బసవ ప్రశస్తి, వీరశైవరత్న, వ్యాస ప్రశస్తి, బెస్ట్ సోషల్ వర్క్ అవార్డులు, పలు సంఘాల నుంచి రోల్ మోడల్ ఉమెన్, ఉమెన్ అఛీవర్ పురస్కారాలు, ఐఎస్‌బీఆర్ బిజినెస్ స్కూల్ నుంచి శ్రమశక్తి షైనింగ్ స్టార్ అవార్డు. పబ్లిక్ రిలేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బెంగళూరు విభాగం నుంచి కల్పనా చావ్లా జయంతి సందర్భంగా 2016లో 'బెస్ట్ డాటర్స్' అవార్డు, 2017లో ఈస్ట్రన్ భూమిక అవార్డు. బెంగళూరు బీజెపి మహిళా విభాగం నుంచి ఉమెన్ అఛీవర్ అవార్డు, 2022లో ఉమెన్ ఐకాన్ ఆఫ్ ఇన్‌స్పిరేషన్ ఆఫ్ ది ఇయర్, ఇస్రో బెంగళూర్ సెంటర్ నుంచి ఉమెన్ అఛీవర్ అవార్డు, 2023లో బృందావన్ ట్రస్ట్ నుంచి ఉమెన్ అఛీవర్ అవార్డు... ఇలా అనేకం ఉన్నాయి. కర్ణాటక మాజీ మంత్రి గీతా మహదేవప్రసాద్ నా జీవితంపై అయిదేళ్ళ క్రితం పిహెచ్‌డి చేశారు. నా జీవన ప్రస్థానం, విజయాలు... సీబీఎస్ఈ నాలుగోతరగతి ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ సబ్జెక్ట్‌లో 'స్పెషల్ పీపుల్' శీర్షిక తొలి పాఠంగా చోటు చేసుకోవడం ఎంతో గర్వంగా ఉంది. కలలు కనాలి. వాటిని నిజం చేసుకోవడానికి శ్రమించాలి. వైకల్యాలున్నా, అవరోధాలు ఎదురైనా... సంకల్ప బలం ఉంటే గెలుపు మనదే. ఇదే నా జీవితం చెప్పే పాఠం."

● హిందూపురం రవి, బెంగళూరు

నవ్య | చిత్రజ్యోతి

రెండున్నర గంటల ఎంటర్టైనర్



నవీన్‌రెడ్డి

"ప్రేక్షకులను రెండున్నర గంటలు ఎంటర్టైన్ చేసే చిత్రం 'వెయ్ దరువెయ్'. నిజ జీవిత సంఘటనల ఆధారంగా పూర్తి స్థాయి వినోదాత్మకంగా తెరకెక్కించాను" అని దర్శకుడు నవీన్ రెడ్డి చెప్పారు. సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన చిత్రమిది. ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి సినిమా విశేషాలను మీడియాకు వివరించారు.

● మా స్వస్థలం కృష్ణా జిల్లా పుట్రేల. సినిమాలపై ఆసక్తితో పుణే ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో దర్శకత్వ శాఖలో కోర్స్ చేసి, కొన్ని సినిమాలకు సహాయ దర్శకుడిగా పనిచేశాను.

● కామారెడ్డికి చెందిన ఓ యువకుడికి ఎదురైన సమస్య ఏమిటి?, దాని పరిష్కారం కోసం అతను ఏం చేశాడు? అనేది మా సినిమా కథ. ప్రతి ఒక్కరూ అనుభూతి చెందే నిజ జీవిత సంఘటనల ఆధారంగా పూర్తి స్థాయి వినోదాత్మకంగా తెరకెక్కించాను. సీరియస్ పాయింట్‌ను ఎంటర్టైన్ చేసేలా చెప్పాం. నా సినిమాలో హీరో పాత్రకు సాయిరామ్ శంకర్ సూటవుతారనిపించి ఆయన్ను తీసుకున్నాం. హెబ్బా పటేల్ పాత్ర సినిమాలో కీలకంగా ఉంటుంది.



నాన్న డైరెక్షన్‌లో సినిమా అప్పుడే

ఆకాశ్ పూరి

హీరోగా నా ప్రతిభను నిరూపించుకున్నాకే నాన్న (పూరి జగన్నాథ్) దర్శకత్వంలో సినిమా చేస్తాను అని హీరో యశ్ పూరి అన్నారు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన తన సినీ కెరీర్ గురించి మీడియాతో ముచ్చటించారు. 'నా గత చిత్రం 'చోర్‌బజార్' అంతగా ఆదరణ పొందలేదు. అందుకే ఈ సారి చేయబోయే సినిమా విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాను. కుటుంబ ప్రేక్షకులను మెప్పించే చిత్రాలు చేయాలనుకుంటున్నాను. కొన్ని కథలు విన్నాను. లవ్‌స్టోరీ, యాక్షన్ జానర్‌లో సినిమాలు ఇష్టం. నాకు అమ్మా, నాన్న ఇద్దరి సపోర్ట్ ఉంది. నాన్న నా స్క్రిప్ట్ చదివి సలహాలిస్తారు. 'డబుల్ ఇస్మార్ట్' టీజర్ రఫ్ కట్ చూశాను. రామ్ గారి నటన చాలా బాగుంది' అని ఆకాశ్ చెప్పారు.

రాణి రుక్మిణీ దేవి



శ్రీవిష్ణు, రీతూవర్మ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'శ్వాగ్'. 'రాజ రాజ చోర' ఫేమ్ హసిత్ గోలి దర్శకత్వంలో ఇది తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టి.జి విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. రీతూ వర్మ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆదివారం ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. వింజమర వంశంలోని మహారాణి రుక్మిణి దేవిగా రీతూ వర్మను పరిచయం చేశారు. ఈ క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియోలో రీతూ వర్మ శ్రీవిష్ణు మాటలను పరిహాసం చేస్తూ కనిపించారు. మగవారి కంటే స్త్రీలు గొప్పవారు, శక్తివంతులు అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: వేదరామన్ శంకరన్, సంగీతం: వివేక్ సాగర్

'తెలిసి తెలిసి'



సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు త్రినాధరావు నక్కిన క్రైమ్ కామెడీ డ్రామా 'చౌర్య పాఠం'తో నిర్మాతగా మారారు. నక్కిన నెరేటివ్స్ బ్యానర్‌పై నిఖిల్ గొల్లమారి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంద్ర రామ్, పాయల్ రాధాకృష్ణ హీరో, హీరోయిన్లు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టీజర్‌కి మంచి స్పందన వచ్చింది. తాజాగా 'చౌర్య పాఠం' నుంచి ఫస్ట్ సింగిల్ 'తెలిసి తెలిసి' పాటని విడుదల చేశారు మేకర్స్. డేవ్ జాండ్ ఈ పాటని కంపోజ్ చేశారు. కళ్యాణచక్రవర్తి త్రిపురనేని లిరిక్స్ అందించారు. శ్వేతా మోహన్, హరిచరణ్ ఈ పాటను ఆలపించారు.

ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది



వి.రఘుశాస్త్రి దర్శకత్వంలో త్రిగుణ్ హీరోగా నటించిన చిత్రం 'లైన్ మ్యాన్'. ఈ నెల 15న తెలుగు, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. త్రిగుణ్‌కు జోడీగా కాజల్ కుందెర్ నటించారు. శనివారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు శివ కందుకూరి ముఖ్య అతిథిగా విచ్చేసి "ట్రైలర్ చాలా బాగుంది. మన మూలాల్లోకి వెళ్లి రాసుకునే కథలు, తీసే సినిమాలు ఆడియెన్స్‌కు ఎక్కువగా కనెక్ట్ అవుతాయి" అని అన్నారు. త్రిగుణ్ మాట్లాడుతూ "మనం ఇప్పుడు ఫోన్, టీవీ వంటి వాటికి బానిసల్లా మారాం. ఓ గంట కరెంట్ లేకపోతే ఉండలేని పరిస్థితికి వచ్చాం. ఓ ఊర్లో పది రోజులు కరెంట్ లేకపోతే ఎలా ఉంటుంది? అనేది ఈ సినిమా కథ" అని చెప్పారు. నందినీ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రస్తుతం సినిమా కంటెంట్ మారుతోంది. కథే హీరోగా మారింది. ఈ చిత్రం కూడా రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా తీశారు" అని అన్నారు. వి రఘు శెట్టి మాట్లాడుతూ.. 'మనుషుల్లో మానవత్వం ఇంకా ఉందని చూపించే చిత్రమిది. ఇది ఒక ఊరు కథ" అని అన్నారు.

రెండింతల వినోదంతో



ప్రియదర్శి, అభినవ్ గోమటం, శ్రీకాంత్ అయ్యంగార్, హర్షవర్ధన్ ప్రధాన తారాగణంగా రూపొందిన వెబ్‌సిరీస్ 'సేవ్ ద టైగర్స్'. ఈ సిరీస్ సీజన్ 2 ఈ నెల 15 నుంచి ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది. అరుణ్ కొత్తపల్లి దర్శకత్వంలో మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం నిర్మించారు. ఇటీవలే యూనిట్ ప్రివ్యూ ఈవెంట్‌ను నిర్వహించింది. మహీ వి. రాఘవ్ మాట్లాడుతూ 'మన జీవితాల్లోని సరదా సందర్భాలతో, పాత్రోచితంగా ఓ మంచి కామెడీ షో చేయాలనే ఆలోచన నుంచి 'సేవ్ ద టైగర్స్' సిరీస్ రూపొందింది. రెండో సీజన్ కూడా ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. ఒక గొప్ప సిరీస్‌ను మహీ క్రియేట్ చేశారు, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా మా టీం జాగ్రత్తలు తీసుకొంది అని ప్రియదర్శి తెలిపారు. రెండో సీజన్ పైన ప్రేక్షకులకు ఏర్పడ్డ అంచనాలను అందుకునేలా ఈ సిరీస్ ఉంటుందని దర్శకుడు తెలిపారు. సీజన్ 2లో రెండింతల వినోదం ఖాయమని అభినవ్ గోమటం చెప్పారు.



నేడే ఆస్కార్ వేడుక

ప్రపంచ వ్యాప్తంగా సినీ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారాల వేడుకకు సర్వం సిద్ధమైంది. భారత కాలమానం ప్రకారం నేటి ఉదయం 4 గంటలకు 96వ ఆస్కార్ చిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో డాల్బీ థియేటర్‌ను ఘనంగా ముస్తాబు చేశారు. హాలీవుడ్ సహా వివిధ దేశాలకు చెందిన పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.

మెలోడీ మహాలక్ష్మి

'కేరింత' ఫేమ్ పార్వతీశం హీరోగా, ప్రణీకాన్విక కథానాయికగా నటిస్తున్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. వీఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేశ్ కలారు నిర్మిస్తున్నారు. హర్షవర్ధన్, ముక్కు అవినాష్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కూ, కూరగాయల దుకాణం నడిపే యువతికి మధ్య జరిగే ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతోంది. 'మార్కెట్ మహాలక్ష్మి' నుంచి 'సాఫ్ట్‌వేర్ పోరగా' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. వీఎస్ ముఖేశ్ సాహిత్యానికి జోఎన్ మవ్ గ్రూవీ స్వరాలు సమకూర్చారు. లోకేశ్వర్ ఆలపించారు.



ఓ నాన్న కథ



కవిన్, అపర్ణ దాస్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'పా...పా...'. మోనిక చిన్నకోట్ల, ఐశ్వర్య, భాగ్యరాజ్, వీటీవీ గణేశ్ ముఖ్య పాత్రలు పోషించారు.. గణేశ్ కె బాబు దర్శకత్వంలో ఎమ్మెస్ రెడ్డి నిర్మించారు. గతేడాది తమిళంలో విడుదలై బ్లాక్‌బస్టర్ గా నిలిచిన 'దాదా' మూవీని తెలుగులో 'పా...పా...'గా డబ్బింగ్ చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను ఇటీవల డైరెక్టర్ త్రినాధ రావు విడుదల చేశారు. నిర్మాత ఎమ్మెస్ రెడ్డి మాట్లాడుతూ 'దాదా' సినిమాని 50 రోజుల తర్వాత థియేటర్లో చూశాను, అప్పటికీ 70 శాతం ఆక్యుపెన్సీతో ఆడుతోంది. వెంటనే నచ్చి యుఎస్ లో ఉన్న నా ఫ్రెండ్స్‌కి కాల్ చేసి, చాలా రోజుల తర్వాత ఒక మంచి సినిమా చూశాను అని చెప్పా. దీంతో వాళ్లు ఈ సినిమాని తెలుగులో తీసుకొద్దామన్నారు. అతి త్వరలో ఈ సినిమాని మీ ముందుకు తీసుకువస్తున్నాము" అని అన్నారు.

డ్రైవ్ మోడ్‌కు బదులు రివర్స్ మోడ్

» కాలువలోకి దూసుకెళ్లిన టెస్లా కారు

» అమెరికాలో ఓ కంపెనీ సీఈవో మృతి



ఏంజెలా చావో

టెక్సాస్, మార్చి 10: కారు మోడ్‌ను పొరపాటున మార్చడంతో అమెరికాలో ఓ సంపన్న కుటుంబానికి చెందిన మహిళ, ప్రముఖ కంపెనీ సీఈవో మృతి చెందారు. గత నెలలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ షిప్పింగ్ కంపెనీకి సీఈవోగా ఉన్న ఏంజెలా చావో (50) చైనా కొత్త ఏడాది వేడుకలు జరుపుకునేందుకే స్నేహితులతో కలిసి ఫిబ్రవరి 10న టెక్సాస్ ఆస్టిన్ సమీపంలోని తన ప్రైవేటు అతిథి గృహానికి వెళ్లారు. వేడుకల అనంతరం తిరిగి వస్తూ రోడ్డుపై త్రిపాయింట్ టర్న్ తీసుకుంటున్న సమయంలో ఆమె తన టెస్లా కారును డ్రైవ్ మోడ్‌లో వేయబోయి పొరపాటున రివర్స్ మోడ్‌లో వేశారు. దాంతో కారు ఒక్కసారిగా వెనక్కు వెళ్లి అక్కడున్న కొలనులో పడిపోయింది. ఏంజెలాతో పాటు వచ్చిన స్నేహితులు ఆమెను రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్య పడకపోవడంతో వారు వెంటనే సహాయక బృందానికి ఫోన్ చేశారు. కాసేపటి తర్వాత అక్కడకు చేరుకున్న సహాయక బృంద సభ్యులు నీటిలో దిగి కారు అద్దాలను పగులగొట్టి ఆమెను కాపాడేందుకు ప్రయత్నించారు. అవి ధృడంగా ఉండడంతో సాధ్య పడలేదు. కాసేపటికి ట్రాలీ సహాయంతో కారును బయటకు తీసి డోర్లను బలవంతంగా పగులగొట్టి చూడగా అప్పటికే ఏంజెలా చనిపోయారు. అమెరికాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, బిలియనీర్ జిమ్ బ్రెయార్‌కు ఏంజెలా చావో భార్య.

17 మంది ఏజెంట్లపై సీబీఐ కేసు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఉద్యోగాల పేరు చెప్పి భారతీయ యువకులను రష్యా సైన్యంలో చేర్పించిన ఉదంతంపై సీబీఐ దర్యాప్తును వేగవంతం చేసింది. సామాజిక మాధ్యమాల ద్వారా యువతను ఆకర్షించి రష్యాకు పంపిన దుబాయ్‌లోని భారత దళారీ, యూట్యూబర్ ఫైసల్ ఖాన్‌తో పాటు 17 మంది ఏజెంట్లపై కేసు నమోదు చేసింది. భారతీయులు, దుబాయ్‌లో పనిచేస్తున్న హిందుస్థానీలను ఏజెంట్లు రష్యాకు తీసుకెళ్లిన విధానంపై విచారణ చేపట్టింది. విద్యార్థి వీసాల మీద తరలించిన వీరిని.. నేరుగా రష్యాకు తీసుకెళ్లారా..? లేదా ఇతర దేశాలకు తీసుకెళ్లి.. అక్కడి నుంచి రష్యాకు పంపించారా..? అన్న కోణంలో సీబీఐ దర్యాప్తు చేస్తోంది. భారతీయ దళారులు, వారికి సహకరించిన వారిని యూఏఈ, రష్యా నుంచి విచారణ నిమిత్తం తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. మరోవైపు, యుద్ధంలో చనిపోయిన హైదరాబాద్‌లోని నాంపల్లికి చెందిన మొహమ్మద్ అఫ్సాన్ మృతదేహాన్ని అప్పగించాలని భారత దౌత్య వర్గాలు రష్యాను డిమాండ్ చేస్తున్నాయి. ఇక, నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన సూఫియాన్‌తో పాటు దుబాయ్‌లో అతడితో పని చేసి రష్యాకు వెళ్లిన నలుగురి ఆచూకీ తెలియకపోవడంతో వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

రంజాన్ కానుకగా దుబాయిలో ఖైదీల విడుదల

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

రంజాన్ పవిత్ర మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని దుబాయి జైలులో శిక్షలు అనుభవిస్తున్న ఖైదీల్లో ఎంపిక చేసిన వారికి దుబాయి రాజు మొహమ్మద్ అల్ మొఖ్తుం క్షమాభిక్ష ప్రసాదించారు. వారిని జైలు నుంచి విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దుబాయితో పాటు అబుధాబి, షార్జా, రాస్ అల్ ఖైమా, ఫుజిరా, అజ్మాన్ ఎమిరేట్లలో ఇప్పటి వరకు మొత్తం 2,592 మంది వివిధ దేశాలకు చెందిన ఖైదీలను రంజాన్ సందర్భంగా విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి రంజాన్ సందర్భంగా గల్ఫ్ దేశాల్లోని జైళ్లలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను ఆయా దేశాల రాజులు విడుదల చేయడం ఆనవాయితీగా వస్తోంది. హత్య, దొంగతనం, మహిళలపై అత్యాచారం, డ్రగ్స్ కేసుల్లో దోషులు క్షమాభిక్షకు అనర్హులు.

నేటి నుంచి ఢిల్లీలో భారీ సాహిత్యోత్సవం

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి శనివారం వరకు ఆరు రోజుల పాటు ప్రపంచంలో అతి పెద్ద సాహిత్యోత్సవం జరుగుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. 100 భారతీయ భాషలకు చెందిన 700 మందికి పైగా రచయితలు, కవులు, పండితులు ఈ సదస్సులో పాల్గొంటారని చెప్పారు. 150 సాహితీ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. సాహిత్యోత్సవాల్లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలూ అందజేయనున్నారు. తెలుగు నుంచి తల్లావజ్ఝల పతంజలి శాస్త్రికి ఈ ఏడాది పురస్కారం లభించిన విషయం తెలిసిందే. కాగా తెలుగు నుంచి కె.శివారెడ్డి, ఇనాక్, మృణాళిని, ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి ఎ.కృష్ణారావు తదితరులు ఈ సాహిత్యోత్సవాల్లో పాల్గొంటున్నారు.

లోక్‌పాల్‌గా జస్టిస్ ఖాన్విల్కర్ ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ, మార్చి 10: లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ మాణిక్‌రావు ఖాన్విల్కర్ (66) ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. 2016 మే 13 నుంచి 2022 జులై 29 వరకు ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. ఆయనను లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ గత నెలలో ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది.

2025 చివరికల్లా సముద్రయాన్: రిజిజు

న్యూఢిల్లీ, మార్చి 10: సముద్ర గర్భంలో అధ్యయనం కోసం భారత్ తొలిసారిగా సిద్ధం చేస్తున్న 'సముద్రయాన్' మిషన్‌ను వచ్చే ఏడాది చివరినాటికల్లా చేపడతామని కేంద్ర భూ విజ్ఞానశాస్త్ర శాఖ మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. దీని కోసం 'మత్స్య' అనే జలాంతర్గామిని సిద్ధం చేస్తున్నామని, పరిశోధనల్లో భాగంగా ఇది ముగ్గురు శాస్త్రవేత్తలను సముద్ర మట్టం నుంచి 6 కిలోమీటర్ల లోతు వరకు తీసుకెళ్లగలదని ఆయన తెలిపారు.

నీట్ యూజీ దరఖాస్తు గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: నీట్ యూజీ 2024 దరఖాస్తు తేదీని వారం రోజులు పొడిగించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) వెల్లడించింది. మార్చి 16 రాత్రి 10.50గంటల వరకు అభ్యర్థులు తమ దరఖాస్తులను నమోదు చేసుకోవచ్చని తెలిపింది. మే 5న నీట్ యూజీ పరీక్ష నిర్వహించనున్నారు. ఇప్పటికే 25 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు.

సీఈసీతో విభేదాలతోనే!

(మొదటి పేజీ తరువాయి)



పొసగకనే గోయల్ రాజీనామా చేసినట్లు వెల్లడిస్తున్నాయి. ఈ వర్గాలు చెబుతున్నదాని ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇటీవల రాజీవ్‌కుమార్, గోయల్ ఆ రాష్ట్రంలో పర్యటించారు. ఆ సమయంలోనే వారి మధ్య తీవ్రమైన విభేదాలు పొడసూపాయి. గోయల్ బెంగాల్ పర్యటనను అర్ధంతరంగా ముగించుకొని ఢిల్లీకి తిరిగి వచ్చారు. దీంతో ఈ నెల 5వ తేదీన సీఈసీ రాజీవ్ కుమార్ ఒక్కరే బెంగాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. అనారోగ్య కారణాల రీత్యానే గోయల్ ఢిల్లీకి వెళ్లిపోయారని విలేకర్లకు రాజీవ్ కుమార్ చెప్పారు. 7వ తేదీన ఈసీ ప్రధాన కార్యాలయంలో సీఈసీతో కలిసి గోయల్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. అయితే, దీనికి కొనసాగింపుగా మరుసటి రోజు కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లాతో ఈసీ అధికారులు నిర్వహించిన సమావేశానికి మాత్రం గోయల్ హాజరు కాలేదు. 8వ తేదీన ఉదయం సీఈసీకి కనీస సమాచారం కూడా ఇవ్వకుండానే గోయల్ తన రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపించారు. విషయం తెలిసిన కేంద్ర ప్రభుత్వం.. సీఈసీతో విబేధాలను పరిష్కరించుకోవాలని, రాజీనామాను ఉపసంహరించుకోవాలని గోయల్‌ను కోరిందని, అయితే, ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోలేదని ఉన్నతస్థాయి ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

బాస్‌ల ఒత్తిడికి తలవంచలేదు: మమత

బెంగాల్‌లో ఎన్నికల నిర్వహణ, భద్రతా బలగాల మోహరింపునకు సంబంధించి ఢిల్లీ (బీజేపీ) నేతల నుంచి, తన బాస్‌ల నుంచి వచ్చిన ఒత్తిడికి తలవంచకుండా రాజీనామా చేసిన అరుణ్ గోయల్‌కు సెల్యూట్ చేస్తున్నానని పశ్చిమ బెంగాల్ సీఎం మమత పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లను దొంగిలించి, ఫలితాల్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలని కేంద్రంలోని బీజేపీ కుట్ర చేస్తుందని తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేశ్ ఆదివారం ఎక్స్‌లో స్పందిస్తూ.. 'గోయల్ రాజీనామా మూడు ప్రశ్నలను రేకెత్తిస్తోంది. సీఈసీతో విభేదాలా? లేక, రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థలను చెప్పుచేతుల్లోకి తీసుకుంటున్న మోదీ ప్రభుత్వంతో సమస్యలా? లేక కోల్‌కతా హైకోర్టు మాజీ న్యాయమూర్తిలాగా పదవికి రాజీనామా చేసి బీజేపీ టికెట్ మీద లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశమా?' అని ప్రశ్నించారు. కోల్‌కతా హైకోర్టు మాజీ జడ్జి లాగే గోయల్ కూడా బీజేపీలో చేరతారా అన్నది వేచి చూడాల్సి ఉందని ఖర్గే వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం ఎటువంటి వారిని ఉన్నత స్థానాల్లో నియమిస్తుందో ఈ వ్యక్తుల ద్వారా తెలుస్తోందన్నారు. ఎస్పీ అధినేత అఖిలేష్ స్పందిస్తూ.. ఈసీపై ఎవరి ఒత్తిడి పని చేస్తోందని నిలదీశారు. గత పదేళ్లలో ఈసీ ప్రైవేటు కంపెనీలా, బీజేపీ శాఖలాగా మారిపోయిందని ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు.

బ్యాచ్‌మేట్ల దిగ్భ్రాంతి!

ఐఏఎస్‌లో అరుణ్ గోయల్ బ్యాచ్‌మేట్ (1985) అయిన సంజీవ్‌గుప్తా ఆదివారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ వర్గాల్లో అరుణ్ గోయల్‌కు నిబంధనల ప్రకారం వెళ్లే ముక్కుసూటి మనిషి అనే పేరుంది. ఆయన నియామకంలాగే రాజీనామా కూడా వేగంగా జరిగిపోయింది. ఇది ఎన్నికల సంఘం స్వతంత్రతపై సీరియస్ ప్రశ్నలను రేకెత్తిస్తోంది. మా బ్యాచ్‌మేట్లం అందరమూ దిగ్భ్రాంతికి గురయ్యాం. గోయల్ నుంచి స్పందన లేదు' అని వివరించారు.

రాజీనామా దిగ్భ్రాంతికరం: అసదుద్దీన్

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్న తరుణంలో ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా దిగ్భ్రాంతిని కలిగించిందని మజ్లిస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. అరుణ్ గోయల్ ఎందుకు రాజీనామా చేశారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. అరుణ్ గోయల్ ఆకస్మిక రాజీనామా.. లోక్‌సభ ఎన్నికల నిష్పాక్షిక నిర్వహణపై నెలకొన్న సందేహాలకు బలం చేకూరుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న సమయంలో అరుణ్ గోయల్ రాజీనామా చేయడం బాధ్యతా రాహిత్యమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ పేర్కొన్నారు.

15వ తేదీలోపు కమిషనర్ల నియామకం

ఈ నెల 15వ తేదీలోపు ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకం జరిగే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు ఆదివారం వెల్లడించాయి. అరుణ్ గోయల్ తాజాగా రాజీనామా చేయగా, మరో కమిషనర్ అనూప్‌చంద్ర పాండే గత నెల 14వ తేదీన రిటైరయ్యారు. దీంతో ప్రస్తుతం ఈసీలో సీఈసీ ఒక్కరే మిగిలారు. రెండు కమిషనర్ స్థానాలు ఖాళీగానే ఉన్నాయి. వీటి భర్తీ కోసం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ నేతృత్వంలోని కమిటీ ఒక్కో పోస్టుకు ఐదేసి చొప్పున మొత్తం పది పేర్లతో కూడిన జాబితాను సిద్ధం చేస్తుంది. తర్వాత ప్రధాని మోదీ సారథ్యంలో ఒక కేంద్రమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధీర్ రంజన్ చౌదరిలతో కూడిన కమిటీ రెండు పేర్లను ఎంపిక చేసి, ఆమోదం కోసం రాష్ట్రపతికి పంపిస్తుంది. రాష్ట్రపతి ఆమోదంతో ఇద్దరు కమిషనర్లు నియమితులవుతారు.

బీజేపీకి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తాం

» పీఠిక నుంచి 'లౌకిక వాదం' అన్న మాటను తొలగిస్తాం

» కర్ణాటక సీనియర్ నేత, ఎంపీ అనంత హెగ్డే వ్యాఖ్య



కార్వార్ (కర్ణాటక)/న్యూఢిల్లీ, మార్చి 10: రానున్న ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణమైన ఆధిక్యత ఇస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తామని, పీఠిక నుంచి 'లౌకిక వాదం' అన్న మాటను తొలగిస్తామని కర్ణాటకకు చెందిన ఆ పార్టీ సీనియర్ సీనియర్ ఎంపీ అనంతకుమార్ హెగ్డే అన్నారు. పార్లమెంటులో బీజేపీకి మూడింట రెండొంతుల మెజార్టీ లభిస్తే హిందూ సమాజాన్ని అణచివేసేలా రాజ్యాంగంలో కాంగ్రెస్ చేసిన అనవసర చేర్పులను తొలగిస్తామని చెప్పారు. ఆరుసార్లు బీజేపీ ఎంపీగా, ఒకసారి కేంద్రమంత్రిగా పనిచేసిన ఆయన ఆదివారం కార్వార్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ 'అబ్ కా బార్ 400 పార్' (ఈ సారి 400 సీట్లకు మించి..) అంటూ ప్రధాని మోదీ ఇచ్చిన నినాదంపై తన అభిప్రాయాలు తెలిపారు. లోక్‌సభ, రాజ్యసభల్లో మూడింట రెండొంతుల మెజార్టీ సంపాదించడంతో పాటు, 20కిపైగా రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించాల్సి ఉందని అన్నారు. బీజేపీకి రాజ్యసభలో 2/3 వంతుల మెజార్టీ లేనందునే పౌరసత్వ సవరణ చట్టా(సీఏఏ)న్ని ఆమోదం పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని చెప్పారు. ఆరేళ్ల క్రితం కూడా ఆయన ఇలాంటి వివాదాస్పద ప్రకటన చేశారు. అనంత్ హెగ్డే ప్రకటనను కాంగ్రెస్ తీవ్రంగా తప్పుపట్టింది. ఆరెస్సెస్-బీజేపీల రహస్య, వంచక అజెండాకు ఇది నిదర్శనమని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. దేశంలో నియంతృత్వాన్ని, మనువాద విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

కాంగ్రెస్ రెండో జాబితా రేపు

» నేడు పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

» తెలంగాణలో పలు స్థానాలపై రానున్న స్పష్టత

న్యూఢిల్లీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల రెండో జాబితాను మంగళవారం ప్రకటించేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ.. ఢిల్లీలోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో సోమవారం భేటీకానుంది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధిర్ రంజన్ చౌదరి, అంబికా సోని, ముకుల్ వాస్నిక్, టీఎస్ సింగ్ దేవ్ తదితర సీఈసీ సభ్యులు పాల్గొంటారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా గుజరాత్‌లో ఉన్న రాహుల్‌గాంధీ ఈ సమావేశానికి వర్చువల్‌గా హాజరవుతారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్ సహా ఏడు రాష్ట్రాల్లోని స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై ఈ భేటీలో చర్చిస్తారు. అనంతరం అభ్యర్థుల జాబితాను మంగళవారం విడుదల చేస్తారు. కాగా, ఈ జాబితాలో తెలంగాణకు సంబంధించి పలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాల్లో 9 సీట్లకు ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసినా తొలి జాబితాలో నల్లగొండ, జహీరాబాద్, మహబూబ్‌నగర్, మహబూబాబాద్ స్థానాల అభ్యర్థులనే ప్రకటించారు. ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి టికెట్లు ఖరారు చేసినా వివిధ సమీకరణాల దృష్ట్యా తొలి జాబితాలో వారి పేర్లు ప్రకటించలేదు. ఇప్పుడు రెండో జాబితాలో నిజామాబాద్, చేవెళ్ల, సికింద్రాబాద్, మెదక్, పెద్దపల్లి మొదలగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. చేవెళ్ల నుంచి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్ నుంచి బొంతు రామ్మోహన్, మెదక్ నుంచి నీలం మధు, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీకృష్ణ కాంగ్రెస్ తరఫున పోటీకి సిద్ధంగా ఉన్నారు. వీరు ఈమధ్యే కాంగ్రెస్‌లో చేరారు.

రోబో మగ బుద్ధి!



రియాద్: ఈ చిత్రంలో అరబ్బీ షేక్ వేషంలో కనిపిస్తున్నది ఓ రోబో! సౌదీ అరేబియాలో తయారైన మొట్టమొదటి హ్యూమనాయిడ్ 'మగ రోబో'! పేరు ముహమ్మద్. రియాద్‌లో జరిగిన టెక్నాలజీ ఫెస్టివల్ 'డీప్ ఫెస్ట్'లో దీన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. అయితే.. రాయా కాసీమ్ అనే మహిళా రిపోర్టర్ 'ముహమ్మద్'ను ప్రేక్షకులకు పరిచయం చేసే క్రమంలో ఆ రోబో తన 'మగ బుద్ధి'ని బయటపెట్టుకుంది. ఆ రిపోర్టర్ పిరుదులపై చెయ్యి వేసింది. ఈ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. రోబోల ప్రవర్తన, వాటి వల్ల కలిగే ప్రమాదాల గురించి విస్తృతంగా చర్చ జరుగుతోంది. ముహమ్మద్‌ను తయారు చేసిన 'క్యూఎస్ఎస్ సిస్టమ్స్' సంస్థ ఈ వీడియోపై స్పందించింది. భవిష్యత్తులో ఇలాంటి సందర్భాల్లో ఆ రోబో ఎవరికీ మరీ సమీపానికి వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

పోర్న్‌స్టార్ సోఫియా ఆకస్మిక మృతి



న్యూఢిల్లీ, మార్చి 10: ప్రముఖ పోర్న్ స్టార్, మోడల్.. సోఫియా లియోన్(26) ఆకస్మికంగా మరణించారు. సోఫియా తన అపార్ట్‌మెంట్‌లో అచేతన స్థితిలో ఉండగా కుటుంబసభ్యులు మార్చి 1న గుర్తించారు. సోఫియా ఎలా మరణించారనే దానిపై పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది. సోఫియా మరణించిన విషయం ఆమె సవతి తండ్రి మైక్ రొమెరో శనివారం చేసిన ప్రకటనతో ఆలస్యంగా వెలుగు చూసింది. అమెరికాలోని మియామి ప్రాంతానికి చెందిన సోఫియా లియోన్ తన 18వ ఏట పోర్న్ ఫిల్మ్ రంగంలో ప్రవేశించారు. కాగా, పోర్న్ ఫిల్మ్ రంగంలో ఇటీవల చోటు చేసుకున్న నాలుగో అకాల మరణం ఇది. సోఫియా కంటే ముందు థైనా ఫీల్డ్స్, కాగ్నేలిన్ కార్టర్, జెస్సీ జానే ఇటీవలికాలంలో ఆకస్మికంగా మరణించారు.

బెంగళూరు పేలుళ్లకు జగిత్యాలకు లింకు?

(మొదటి పేజీ తరువాయి)

సలీంను ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అతణ్ని ఎన్ఐఏ వర్గాలు బెంగళూరు పేలుళ్ల కోణంలో విచారిస్తున్నట్లు తెలిసింది. ఎన్ఐఏ గతంలో విడుదల చేసిన మోస్ట్‌వాంటెడ్ జాబితాలోనూ సలీం పేరు ఉంది. ఈయనతో పాటు.. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎండీ అబ్దుల్ అహ్మద్ అలియాస్ ఎంఏ అహ్మద్, ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన షేక్ ఇలాయాస్ అహ్మద్ మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నారు. పరారీలో ఉన్న వీరి కోసం ఎన్ఐఏ కొంత కాలంగా గాలిస్తోంది. గత ఏడాది ఎన్ఐఏ తెలంగాణ, ఏపీల్లోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, పీఎఫ్ఐ శిక్షణ పొందుతున్న వారిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సలీం అప్పటి నుంచి పరారీలో ఉండగా.. ఇటీవల కడప జిల్లా మైదుకూరులో పట్టుబడ్డాడు.

ఇండియాకు మమత షాక్

బెంగాల్‌లో అన్ని లోక్‌సభ స్థానాలకు తృణమూల్ అభ్యర్థుల ప్రకటన.. జాబితా విడుదల

» మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్, సినీ నటి రచనా బెనర్జీలకు చోటు

» ఏడుగురు సిటింగ్‌లకు మొండిచేయి



కోల్‌కతాలో జనగర్జన సభలో మమత, ఆమె వెంట నడుస్తున్న టీఎంసీ ఎంపీ అభ్యర్థులు

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 42 లోక్‌సభ స్థానాలకు అధికార పక్షం తృణమూల్ కాంగ్రెస్ ఆదివారం అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు జాబితాను విడుదల చేసింది. తద్వారా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పొత్తు ఉండబోదని తేల్చి చెప్పింది. అభ్యర్థులుగా మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్, సినీ హీరోయిన్ రచనా బెనర్జీ వంటి కొత్త ముఖాలకు తృణమూల్ అవకాశం కల్పించింది. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి ప్రాతినిధ్యం వహిస్తున్న బర్హంపూర్ నుంచి యూసుఫ్ పఠాన్‌ను బరిలో దింపటం గమనార్హం. ప్రశ్నలకు డబ్బులు ఆరోపణలపై లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురైన మహువా మొయిత్రాకు ఆమె సిటింగ్ స్థానమైన కృష్ణనగర్ నుంచే మరోసారి అవకాశం కల్పించారు. తాజాగా వివాదాస్పదమైన సందేశ్‌ఖాలీ ప్రాంతం ఉన్న బసీరత్ స్థానం నుంచి సిటింగ్ ఎంపీ, నటి నుస్రత్ జహాన్ బదులు మాజీ ఎంపీ హాజీ నూరుల్ ఇస్లాంకు అవకాశం ఇచ్చారు. కాగా తృణమూల్‌కున్న 23 మంది ఎంపీల్లో 16 మందికి తిరిగి అవకాశం ఇచ్చి ఏడుగురిని పక్కన పెట్టారు. ఇద్దరు క్యాబినెట్ మంత్రులతోపాటు 9 మంది సిటింగ్ ఎమ్మెల్యేలను ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల బరిలో దింపారు. మొత్తం 42 మంది అభ్యర్థుల్లో 12 మంది మహిళలున్నారు. కాగా, ఆదివారం కోల్‌కతాలో మమత జనగర్జన పేరుతో భారీ బహిరంగసభలో నిర్వహించారు. బెంగాల్‌లో బీజేపీతోపాటు కాంగ్రెస్, సీపీఎంలను ఎదుర్కొంటామన్నారు.

పొత్తుకు ఇంకా అవకాశం ఉంది: ఖర్గే

బెంగాల్‌లో అన్ని స్థానాలకు అభ్యర్థులను తృణమూల్ ప్రకటించటంపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే స్పందిస్తూ.. 'మా తలుపులు ఎప్పటికీ తెరిచే ఉంటాయి. నామినేషన్ల ఉపసంహరణ వరకూ పొత్తుకు అవకాశం ఉంది' అని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి భయపడే కాంగ్రెస్‌తో పొత్తుకు తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు మమతా బెనర్జీ ముందుకు రాలేదని, బీజేపీ వ్యతిరేక పోరాటంలో తాను లేననే సంకేతాన్ని ఆమె ఇచ్చారని అధిర్ రంజన్ చౌదరి విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేష్ మాట్లాడుతూ.. గౌరవప్రదమైన స్థాయిలో సీట్ల సర్దుబాటు కుదుర్చుకోవాలని తాము భావించామని, కానీ, తృణమూల్‌పై ఎటువంటి ఒత్తిడి ఉందో తమకు తెలియదన్నారు. కాగా, సీట్ల పంపకాలపై కాంగ్రెస్, తృణమూల్ మధ్య మూడు నెలల పాటు చర్చలు జరిగాయి. కాంగ్రెస్ 7 సీట్లు కావాలని డిమాండ్ చేయగా రెండు కంటే ఎక్కువ ఇవ్వబోమని మమత తేల్చిచెప్పారు. తాజాగా అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు.

హిమాచల్‌లో ముదురుతున్న రాజకీయ సంక్షోభం

» స్వతంత్ర ఎమ్మెల్యే, కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యే తండ్రి, మరికొందరిపై పోలీసు కేసులు

సిమ్లా, మార్చి 10: హిమాచల్‌ప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభం తీవ్రమవుతోంది. ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డారంటూ ఒక స్వతంత్ర ఎమ్మెల్యే, కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యే తండ్రి, మరికొందరిపై పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. గతనెల 27న జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్రులు బీజేపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించారు. ఆ ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయగా, వారంతా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సంజయ్ అవస్థీ, భువనేశ్వర్ గౌర్‌ల ఫిర్యాదు ఆధారంగా స్వతంత్ర ఎమ్మెల్యే ఆశిష్ శర్మ, ప్రస్తుతం అనర్హత వేటు పడిన కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యే చైతన్య శర్మ తండ్రి, మరికొందరిపై నేర కుట్ర, అవినీతి, ఎన్నికల్లో అనవసర జోక్యానికి పాల్పడ్డారంటూ పోలీసులు కేసులు నమోదు చేశారు. చైతన్య శర్మ తండ్రి ఏం నేరానికి పాల్పడ్డారనేది తెలియరాలేదు. కాగా, పోలీసు కేసులపై రెబెల్ ఎమ్మెల్యేలు స్పందించారు. భవిష్యత్తు పరిణామాలు ఎదుర్కొనేందుకు సీఎం సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యే రాజిందర్‌రాణా హెచ్చరించారు.

నేను భిన్నమైన మనిషిని!

» ప్రాజెక్టులు ప్రకటించడమే కాదు అమలు చేసి చూపుతున్నాం: మోదీ



లఖ్‌నవూ/రాయ్‌పూర్, మార్చి 10: తాను విభిన్నమైన మనిషినని.. ప్రాజెక్టులను ప్రకటించడమే కాదు.. అమలు చేసి చూపుతున్నామని ప్రధాని మోదీ అన్నారు. శరవేగంతో విమానాశ్రయాలు, హైవేలు, రైలు మార్గాల నిర్మాణాలు, ప్రారంభోత్సవాలను వచ్చే ఎన్నికల కోసమన్న కోణంలో చూడొద్దని కోరారు. 2047లోగా భారత్‌ను అగ్రరాజ్యం చేయాలన్న లక్ష్యం సాధించే క్రమంలో దీన్ని తన ప్రగతి ప్రయాణంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన ఉత్తరప్రదేశ్‌లోని ఆజంగఢ్‌లో జరిగిన బహిరంగసభలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా రూ.42వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటిలో ఒక్క యూపీ ప్రాజెక్టుల విలువే రూ.37,500కోట్లు. అలాగే వివిధ రాష్ట్రాల్లో రూ.9,800కోట్లతో నిర్మించిన 12ఎయిర్‌పోర్టు టెర్మినళ్లను ఆయన ప్రారంభించారు. అలాగే ఆంధ్రలో కడప, కర్ణాటకలో హుబ్బళి, బెళగావి విమానాశ్రయాల్లో కొత్త టెర్మినల్ భవనాలకు శంకుస్థాపన చేశారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తెచ్చిన 'మహతారీ వందన యోజన'ను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ.. గతంలో ఎన్నికల ముందు ప్రాజెక్టులపై ప్రకటనలు మాత్రమే చేసేవారని.. తర్వాత అటకెక్కించేవారని మోదీ తెలిపారు. తాను చేస్తున్న అభివృద్ధితో బుజ్జగింపు రాజకీయాల విషం నిర్వీర్యమవుతోందన్నారు. కాగా దేశవ్యాప్తంగా 3కోట్ల మంది మహిళలను లక్షాధికారిణులుగా మార్చే లక్ష్యంతో తన ప్రభుత్వం పనిచేస్తోందని మోదీ అన్నారు. 'మహతారీ వందన్ యోజన' కింద ఛత్తీస్‌గఢ్‌లో 70లక్షల మందికి పైగా మహిళలకు ప్రతి నెలా రూ.1,000 చొప్పున అందుతుందని చెప్పారు. 'ఉజ్వల స్కీం కింద చౌక ధరకే వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. 65శాతానికిపైగా ముద్రారుణాలు మహిళలే పొందారు. స్వయం సహాయక సంఘాల ద్వారా 10 కోట్ల మందికిపైగా మహిళల జీవితాలను మా ప్రభుత్వం మార్చేసింది. మా కృషితో కోటి మందికిపైగా 'లఖ్‌పతీ దీదీ'లుగా ఆవిర్భవించారు. 3కోట్ల మందిని లక్షాధికారిణులను చేయాలన్న లక్ష్యాన్ని నెరవేరుస్తాం' అన్నారు.

'ఈఎఫ్‌టీఏ'తో స్వేచ్ఛా వాణిజ్య బంధం

రూ.8.28 లక్షల కోట్ల పెట్టుబడులకు హామీ.. కొత్తగా 10 లక్షల కొలువులు

న్యూఢిల్లీ: ఐస్‌లాండ్, లీచ్‌టెన్‌స్టీన్, నార్వే, స్విట్జర్లాండ్ దేశాలతో కూడిన యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈఎఫ్‌టీఏ)తో భారత్ కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద వచ్చే 15 ఏళ్లలో భారత్‌లో 10,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.8.28 లక్షల కోట్లు) పెట్టుబడులు, 10 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు ఈఎఫ్‌టీఏ దేశాలు హామీ ఇచ్చాయి. మన దేశంతో ఎఫ్‌టీఏలు కుదుర్చుకున్న ఏ దేశం లేదా దేశాలు ఇప్పటి వరకు ఇటువంటి హామీ ఇవ్వలేదు. దాదాపు 16 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత భారత్-ఈఎఫ్‌టీఏ మధ్య ఈ ఒప్పందం కుదిరింది. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ఈ దేశాలకు చెందిన ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

పారిశ్రామిక ఎగుమతులకు ఊతం: ఈఎఫ్‌టీఏతో కుదిరిన ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో భారత్‌లో తయారయ్యే దాదాపు అన్ని రకాల పారిశ్రామిక ఉత్పత్తులను ఎటువంటి సుంకాలు లేకుండా ఈ నాలుగు దేశాలకు ఎగుమతి చేసేందుకు అవకాశం ఏర్పడనుంది. దీనికి తోడు ప్రాసెస్ చేసిన భారత వ్యవసాయ ఉత్పత్తులకు దిగుమతి సుంకాల్లో ప్రత్యేక రాయితీలు ఇచ్చేందుకూ ఈఎఫ్‌టీఏ అంగీకరించింది. దీంతో ఈ నాలుగు దేశాలకు మన పారిశ్రామిక, ప్రాసెస్ చేసిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా పెరిగే అవకాశం ఏర్పడింది. ఈఎఫ్‌టీఏలో అతిపెద్ద దేశమైన స్విట్జర్లాండ్ ఈ ఏడాది జనవరి నుంచే భారత పారిశ్రామిక ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను పూర్తిగా ఎత్తివేసింది.

దిగుమతులకు కళ్లెం: ఎగుమతుల పెంపునకు చర్యలు తీసుకుంటూనే.. ఈ దేశాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు చౌకగా దేశీయ మార్కెట్లోకి ప్రవేశించకుండా భారత్ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఈఎఫ్‌టీఏ దేశాల నుంచి దిగుమతయ్యే పాడి, పాడి ఉత్పత్తులు, సోయా, సోయా ఉత్పత్తులు, బొగ్గు, కొన్ని కీలకమైన వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేందుకు భారత్ పూర్తిగా నిరాకరించింది.

అయితే ఈ దేశాలకు చెందిన అకౌంటింగ్, వ్యాపార సేవలు, కంప్యూటర్ సర్వీసులు, పంపిణీ, ఆరోగ్య సేవల వంటి 105 రకాల సేవలపై ఆంక్షల సడలింపులకు అంగీకరించింది. అందుకు ప్రతిగా భారత ఐటీ, న్యాయ నిపుణులు, ఆడియో-విజువల్, ఆర్ అండ్ డీ, కంప్యూటర్, అకౌంటింగ్, ఆడిటింగ్ నిపుణుల రాకపోకలకు ఈఎఫ్‌టీఏ దేశాలు అంగీకరించాయి.

తగ్గనున్న స్విస్ వాచీలు, చాక్లెట్ల ధర

ప్రపంచ ప్రఖ్యాత స్విస్ వాచీలు, గడియారాలు, బిస్కెట్లు, చాక్లెట్లను కూడా ఈ ఎఫ్‌టీఏలో చేర్చారు. దీంతో రోలెక్స్, ఒమెగా, కార్టియర్ వంటి స్విట్జర్లాండ్‌లో తయారయ్యే వాచీలపై దిగుమతి సుంకాలు తగ్గి, వాటి ధరలూ తగ్గనున్నాయి. అయితే ఇందుకోసం భారత వినియోగదారులు ఈ ఎఫ్‌టీఏ అమల్లోకి వచ్చిన ఏడు నుంచి పదేళ్ల పాటు వేచి చూడాలి. ఇక ఐదు నుంచి 15 డాలర్ల మధ్య ఉండే స్విస్ మద్యంపై దిగుమతి సుంకాన్ని తొలి ఏడాదే 150 శాతం నుంచి 100 శాతానికి తగ్గించేందుకూ మన దేశం అంగీకరించింది. తర్వాత పదేళ్లలో దీన్ని 50 శాతానికి తగ్గిస్తారు.

హైదరాబాద్‌లో బిలిటి ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ ప్లాంట్

రూ.400 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్: కాలిఫోర్నియా కేంద్రంగా పని చేసే బిలిటి ఎలక్ట్రిక్ కంపెనీ హైదరాబాద్‌లో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ సమక్షంలో ఆదివారం ఈ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగింది. రూ.400 కోట్ల పెట్టుబడితో నెలకు 2,000 ఎలక్ట్రిక్ త్రీ వీలర్స్ తయారు చేసేలా ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నారు. బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) సమీపంలోని వెలిమెల గ్రామ సమీపంలో 13 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ ప్లాంట్ ద్వారా 10,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఎలక్ట్రిక్ త్రీ వీలర్స్‌తో పాటు ఈ ప్లాంట్‌లో అధునాతన లిథియం అయాన్ బ్యాటరీలను కంపెనీ తయారు చేయనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ		విజయవాడ	433
హైదరాబాద్	410	విశాఖపట్నం	475
11వ తేదీ		వరంగల్	412
చిత్తూరు	503		
గోదావరి	433	దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	గోదావరి	116
వరంగల్	112	విజయవాడ	116
కరీంనగర్	112	గుంటూరు	116
మహబూబ్‌నగర్	112	ఒంగోలు	116
కర్నూలు	112	చిత్తూరు	120
విశాఖపట్నం	103		

స్మాల్,మిడ్ క్యాప్ ఫండ్స్‌కు కొత్త నిబంధనలు

కోల్‌కతా: స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ ఫండ్స్‌కు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ తీసుకువచ్చిన కొత్త నిబంధనలు ఈ నెల నుంచే అమల్లోకి వచ్చాయి. ఈ నిబంధనల ప్రకారం ఈ ఫండ్స్ మేనేజర్లు ఇప్పటి వరకు వెల్లడిస్తున్న విషయాలకు తోడు, ఆయా ఫండ్స్ నిర్వహణలోని ఆస్తుల విలువ, ఆటుపోట్లు, మదుపరుల కేంద్రీకరణ, స్ట్రెస్ టెస్టుల వివరాలు క్రమం తప్పకుండా వెల్లడించాలి. సెబీ దీనికి సబంధించి మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే యాంఫీ ద్వారా ఆయా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల (ఏఎంసీ)కు ఆదేశాలు జారీ చేసింది. కోల్‌కతాలో జరిగిన ఒక సదస్సులో సెబీ హోల్‌టైమ్ సభ్యుడు అమర్‌జీత్ సింగ్ ఈ విషయం వెల్లడించారు. స్టాక్ మార్కెట్ సూచీలు జీవితకాల గరిష్ఠాలకు చేరడంతో రిటైల్ ఇన్వెస్టర్లు పెద్దఎత్తున స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్స్‌లో మదుపు చేస్తున్నారు. దీంతో ఈ ఫండ్స్‌లో అవకతవకలు జరగకుండా మదుపరులను రక్షించేందుకు సెబీ ఈ చర్య తీసుకుంది.

● జీనోమ్ వ్యాలీలో జీవీ రీసెర్చ్ పరిశోధనా కేంద్రం

న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో 1.3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం గల ఆర్ అండ్ డీ ఫెసిలిటీని జీవీ రీసెర్చ్‌కి 10 సంవత్సరాల కాలానికి లీజుకిచ్చినట్టు లైఫ్ సైన్స్ పార్కుల అభివృద్ధి కంపెనీ ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ ప్రకటించింది. ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్.. హైదరాబాద్, ముంబై, బెంగళూరు నగరాల్లో సైన్స్ పార్క్‌లు అభివృద్ధి చేస్తోంది. జీనోమ్ వ్యాలీలోని నెక్సోపోలిస్ లైఫ్ సైన్స్ పార్క్‌లో 1.3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం గల ప్రదేశాన్ని ఇంటిగ్రేటెడ్ కాంట్రాక్ట్ రీసెర్చ్ సంస్థ జీవీ రీసెర్చ్‌కి 10 ఏళ్ల కాలానికి లీజుకిచ్చామని, దీనిపై తమకు రూ.162 కోట్లు అద్దె ఆదాయం వస్తుందని ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ సీఈఓ మిలింద్ రవి చెప్పారు.

22,750 పైన బుల్లిష్

(మార్చి 11-15 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ గైడ్

నిఫ్టీ గత వారం 22,524-22,224 పాయింట్ల మధ్యన కదలాడి 116 పాయింట్ల లాభంతో 22,494 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,750 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,869, 21,787, 20,502, 20,088 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,900 బ్రేక్‌డౌన్ స్థాయి : 22,100
నిరోధ స్థాయిలు: 22,700, 22,800, 22,900 (22,600 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,300, 22,200, 22,100 (22,400 దిగువన బేరిష్)

ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా షేర్లలో ర్యాలీకి చాన్స్..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్కెట్లో అప్‌ట్రెండ్ ఉండటమే ఇందుకు కారణం. ఫియర్ ఇండెక్స్ ఇండియా విక్స్ కాస్త తగ్గటం కొద్దిగా ఊరట కలిగించే అంశం. ఇన్వెస్టర్లు నాణ్యమైన షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తే కొనుగోలు చేయటం బెటర్. ఈ వారం ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ షేర్లు ర్యాలీని కనబరిచే వీలుంది. నిఫ్టీ మార్చి ఫ్యూచర్స్ మద్దతు స్థాయి 22,400, నిరోధం 22,550 వద్ద ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్: గత వారం నుంచి ఈ కౌంటర్‌లో మంచి మూమెంటమ్ కనిపిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. సుదీర్ఘకాలంగా కన్సాలిడేట్ అవ్వడంతో మంచి బేస్ ఏర్పడింది. గురువారం ఈ షేరు నెల గరిష్ఠ స్థాయి రూ.616 స్థాయిని అధిగమించి రూ.621 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.600 పై స్థాయిలో ప్రవేశించి రూ.660/715 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.585 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కోటక్ మహీంద్రా బ్యాంక్: రెండేళ్లుగా ఈ స్టాక్ సైడ్‌వేస్‌లో కొనసాగుతూ వస్తోంది. మరోసారి సుదీర్ఘకాల మద్దతు స్థాయికి రావటంతో డిమాండ్ పెరుగుతోంది. చివరి ఐదు సెషన్లలో కొంత మూమెంటమ్ కనిపించింది. గత గురువారం ఈ షేరు రూ.1,748 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,740/1,720 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,850/1,970 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,680 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సన్ ఫార్మా: ఈ షేరు గడచిన ఏడాది కాలంగా బలమైన అప్‌ట్రెండ్‌తో దూసుకుపోతోంది. ఫార్మా, నిఫ్టీలను తోసిరాజని మెరుగ్గా రాణిస్తోంది. గత గురువారం ఈ షేరు రూ.1,605 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,550 ఎగువన ఏ స్థాయిలోనైనా ప్రవేశించి రూ.1,720/1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,525 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి. నాణ్యమైన ఈ షేరును ధర తగ్గే కొద్దీ అక్యుములేట్ చేసుకోవచ్చు.

టాటా పవర్: అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ కౌంటర్‌కు చాలా సానుకూలతలు ఉన్నాయి. గత గురువారం ఈ షేరు ఆల్‌టైమ్ హై రూ.412 స్థాయిని అధిగమించి రూ.425 వద్ద ముగిసింది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ విపరీతంగా నమోదైంది. దీంతోపాటు అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను బ్రేక్ చేసింది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.400 శ్రేణిలో ప్రవేశించి రూ.445/525 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.390 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫినోలెక్స్ ఇండియా: నిఫ్టీతో పోల్చితే ఈ కౌంటర్ జోరును ప్రదర్శిస్తోంది. అప్పర్ బొలింజర్ బ్యాండ్, నెల గరిష్ఠ స్థాయిని అధిగమించటమ సానుకూల అంశాలు. పైగా డెలివరీ, ట్రేడింగ్ పరిమాణం పెరుగుతోంది. గత గురువారం ఈ షేరు రూ.231 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.220 శ్రేణిలో ప్రవేశించి రూ.285/300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.210 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

22,550 పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 22,350 వరకు వెళ్లి మైనర్ రియాక్షన్‌లో 22,200 వరకు దిగజారినప్పటికీ ఆ స్థాయిలో బౌన్స్‌బ్యాక్ సాధించి మరోసారి జీవితకాల గరిష్ఠ స్థాయిలు నమోదు చేసింది. వారంలో 115 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయి 22,500 కన్నా పైన క్లోజయింది. గత ఆరు వారాల్లో నిఫ్టీ నిలకడగా, మందకొడిగా అప్‌ట్రెండ్ సాధిస్తూ 1,400 పాయింట్ల వరకు లాభపడింది. ప్రస్తుత ర్యాలీలో పలు రియాక్షన్లు ఎదురైనా మద్దతే స్థాయిల కన్నా పైనే నిలకడగా ఉంది. అయితే గత వారంలో మిడ్‌క్యాప్ 100 సూచీ 190 పాయింట్లు, స్మాల్‌క్యాప్ 100 సూచీ 460 పాయింట్ల నష్టంతో ముగిశాయి. ఈ వారంలో వెలువడనున్న అమెరికా, భారత ద్రవ్యోల్బణ గణాంకాలు మార్కెట్ కదలికలపై ప్రభావం చూపవచ్చు. ప్రపంచ మార్కెట్ల ధోరణులను బట్టి చూసినట్టయితే మార్కెట్ ఈ వారం అప్రమత్తంగా ప్రారంభమయ్యే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ ప్రధాన నిరోధం 22,550 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ తర్వాత తాజా గరిష్ఠ స్థాయిల్లోకి ప్రవేశిస్తుంది. మానసిక అవరోధాలు 22,800, 23,000. ఈ స్థాయిల్లో స్వల్పకాలిక కన్సాలిడేషన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: ప్రధాన మద్దతు స్థాయి 22,400 కన్నా దిగజారితే మరింత బలహీనతను సూచిస్తుంది. దిగువన మరో మద్దతు స్థాయి 22,200. ఇక్కడ కూడా విఫలమైతే ఇంకా బలహీనపడుతుంది. స్వల్పకాలిక మద్దతు స్థాయి 22,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం మరింత అప్‌ట్రెండ్ సాధించి 48,200 వరకు వెళ్లినా మైనర్ రియాక్షన్‌కు గురయింది. చివరికి ముందు వారంతో పోల్చితే 550 పాయింట్ల లాభంతో 47,830 వద్ద ముగిసింది. ప్రస్తుతం జనవరిలో ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరువలో ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 48,200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధం 48,600. ప్రస్తుత మద్దతు స్థాయి 47,500 వద్ద విఫలమైతే అప్రమత్తతను సూచిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 47,000.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశిస్తోంది. గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలి. 22,200 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడవచ్చు.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,550, 22,620
మద్దతు	22,400, 22,340

www.sundartrends.in

స్పోర్ట్స

రాకెట్ వీరులు మళ్లీ కొట్టారు

సాత్విక్ జోడీదే ఫ్రెంచ్ ఓపెన్

రెండోసారి టైటిల్ కైవసం



పారిస్: బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి మరోసారి అత్యద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ ఏడాది జరిగే ఒలింపిక్స్‌కు వేదికైన పారిస్‌లో విజయబావుటా ఎగురవేసి స్వర్ణ పతకంపై అంచనాలను పెంచేసింది. ఈ ప్రపంచ నెంబర్‌వన్ జంట ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్‌లో డబుల్స్ చాంపియన్‌గా నిలిచి ఈ సీజన్‌లో తొలి టైటిల్‌ను దక్కించుకుంది. ఈ ఏడాది మలేసియా, ఇండియా ఓపెన్‌లలో ఫైనల్ చేరినా, రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో సాత్విక్ జోడీ 21-11, 21-17తో చైనీస్ తైపీ ద్వయం లీ జె హుయి-యాంగ్ పో హ్సువాన్‌ను ఓడించింది. సాత్విక్ జోడీకిది రెండో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్. తొలిసారిగా 2019లో ఇక్కడ రన్నరప్‌గా నిలిచిన ఈ ఏస్ జంట.. ఆ తర్వాత 2022లో విజేతగా నిలిచింది. సాత్విక్, చిరాగ్‌లకిది ఓవరాల్‌గా ఏడో వరల్డ్ టూర్ టైటిల్ (సూపర్ 300, ఆపై స్థాయి హోదా) కాగా.. రెండో సూపర్ 750 ట్రోఫీ.

అలవోకగా..: స్థాయికి తగ్గ ఆటతీరుతో చెలరేగిన సాత్విక్ జంట కేవలం 37 నిమిషాల్లోనే ప్రత్యర్థి ఆట కట్టించింది. తొలి గేమ్‌ను 15 నిమిషాల్లోనే ముగించిన భారత ద్వయం.. రెండో గేమ్‌లో కళ్లు చెదిరే స్మాష్‌లు, క్రాస్ కోర్టు షాట్లతో లీ జంటను ముప్పుతిప్పలు పెట్టింది. ఆఖర్లో గేమ్ పాయింట్ సాధించే క్రమంలో చిరాగ్ అదుపు తప్పి కింద పడినా, సాత్విక్ అద్భుతంగా ఆడి లాంచనం పూర్తి చేశాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో చైనా షట్లర్ షి యుకీ 22-20, 21-19తో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ కున్లావుట్ (థాయ్‌లాండ్)కు షాకిచ్చి విజేతగా నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో అన్ సె యంగ్ (దక్షిణ కొరియా) 18-21, 21-13, 21-10తో యమగుచి (జపాన్)పై నెగ్గి ట్రోఫీ అందుకుంది.

సంగీతకు రెండో స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): లఖ్‌నవూలో జరిగిన జాతీయ జూనియర్ ఫెడ్ కప్ అథ్లెటిక్స్‌లో నాగర్‌కర్నూల్‌కు చెందిన సాయి సంగీత 200 మీటర్ల పరుగులో సంగీత స్వర్ణం సాధించింది. ఈ టోర్నీలో సంగీతకిది రెండో స్వర్ణ పతకం.

పవర్‌లిఫ్టర్ తనూష్‌కు 3 స్వర్ణాలు



కిర్గిస్థాన్‌లో జరిగిన ఆసియా పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ యువ లిఫ్టర్ తనూష్ (డెడ్‌లిఫ్ట్, స్క్వాట్, బెంచ్ ప్రెస్ విభాగాల్లో) మూడు స్వర్ణాలు సాధించాడు.

అన్నింటా నెంబర్‌వన్



టీమిండియా ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తోంది. ఇప్పటికే వన్డే, టీ20 ఫార్మాట్లలో నెంబర్‌వన్‌గా కొనసాగుతున్న భారత జట్టు తాజాగా టెస్టుల్లోనూ అగ్రస్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను 4-1తో గెలుచుకోవడంతో భారత్ 122 పాయింట్లతో టాప్‌నకు చేరింది. ఆస్ట్రేలియా (117), ఇంగ్లండ్ (111), న్యూజిలాండ్ (101) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (68.56 శాతం)లోనూ భారత్‌దే ఆధిపత్యం. ఇలా నాలుగు విభాగాల్లోనూ టీమిండియా టాప్‌లో దూసుకెళుతుండడం విశేషం.

ఇలా కదా ఆడాలి!



'జైస్'బాల్‌తో సునామీ

ఇంగ్లండ్ బజ్‌బాల్ చిన్నబోయేలా యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఈ సిరీస్‌లో రాణించిన తీరు అతడి కెరీర్‌లో గుర్తుండిపోతుంది. ఏకంగా ఐదు టెస్టుల్లో 712 పరుగులు సాధించి ఎన్నో రికార్డులను నెలకొల్పాడు. వైజాగ్, రాజ్‌కోట్ టెస్టుల్లో డబుల్ సెంచరీలతో ఔరా.. అనిపించాడు. ముఖ్యంగా వైజాగ్‌లోని రెండో టెస్టులో అతడి 209 పరుగులే సిరీస్‌లో తొలి విజయానికి దోహదపడ్డాయి. ఈ సిరీస్‌లో అతను బాదిన 26 సిక్సర్లు జైస్వాల్ పవర్‌గేమ్‌కు నిదర్శనంగా నిలుస్తాయి. అటు యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ రెండు సెంచరీలతో రాణించి 452 రన్స్‌తో రెండో స్థానంలో నిలిచాడు.

స్టార్ బ్యాటర్ కోహ్లీ, వెటరన్ పేసర్ షమి సిరీస్ మొత్తానికి అందుబాటులో లేరు. మిడిలార్డర్ బ్యాటర్ రాహుల్ ఆడింది ఒక్క మ్యాచే.. ఉప్పల్‌లో తొలి టెస్టు ఓటమి తర్వాత ఆల్‌రౌండర్ జడేజా కూడా తర్వాతి మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఈ దశలో 0-1తో రెండో టెస్టు బరిలోకి దిగిన భారత జట్టు వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో నెగ్గి.. ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌కు తూట్లు పొడుస్తుందని ఎవరైనా ఊహించారా? కానీ అక్షరాలా జరిగింది అదే. ప్రత్యర్థినే ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఏ ఒక్క టెస్టును ఐదు రోజుల వరకు కూడా తీసుకెళ్లకుండా రోహిత్ సేన స్వదేశంలో వరుసగా 17వ సిరీస్‌ను సాధించింది. ఆఖరి టెస్టులో రెండున్నర రోజుల్లోనే ఇన్నింగ్స్ గెలుపు అందుకుంది. ఇందుకు ప్రధాన కారణం జట్టులోని యువ ఆటగాళ్లు. వీరికి సీనియర్లు సహకారం అందించడంతో ఘన విజయం సాధ్యమైంది.

అరంగేట్రం అదిరేలా..

కొందరు సీనియర్లు జట్టుకు దూరమవడంతో ఏకంగా ఐదుగుర ప్లేయర్లు ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అరంగేట్రం చేశారు. ఇందులో రజత్ పటీదార్ మినహా సర్ఫరాజ్, కీపర్ ధ్రువ్ జురెల్, పేసర్ ఆకాశ్ దీప్, దేవ్‌దత్ పడిక్కళ్ తమ ప్రదర్శనతో కెప్టెన్, కోచ్‌ల నమ్మకాన్ని నిలబెట్టారు. అంతేకాదు.. ఎంత పెద్ద బాధ్యత తీసుకోవడానికైనా సిద్ధమని అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పారు. ఒకప్పుడు జట్టులో చోటు దక్కడమే కష్టంగా మారిన సుదీర్ఘ ఫార్మాట్‌లో వచ్చిన చాన్స్‌ను సద్వినియోగం చేసుకుంటూ వహ్వా.. అనేలా ఆడేస్తున్నారు. రాజ్‌కోట్‌లో తొలిసారిగా చోటు దక్కించుకున్న సర్ఫరాజ్, జురెల్ వెంటనే తమ ప్రభావాన్ని చూపారు. జురెల్ తొలి శతకాన్ని తృటిలో కోల్పోయాడు. ఇక, సర్ఫరాజ్ రాజ్‌కోట్‌లో రెండు ఇన్నింగ్స్‌లోనూ అర్ధ సెంచరీలతో సత్తా చాటాడు. స్పిన్నర్లను అతడు ఎదుర్కొన్న తీరు అందరినీ ఆకట్టుకుంది. ఇక ధర్మశాలలో పేస్‌ను సైతం దీటుగా ఎదుర్కోంటానని మార్క్ ఉడ్ ఓవర్‌లో నిరూపించాడు. శరీరాన్ని విల్లులా వంచేస్తూ సర్ఫరాజ్ ఆడిన ర్యాంప్ షాట్ ఆ మ్యాచ్‌కే హైలైట్. పేసర్ ఆకాశ్ దీప్ రాంచీ టెస్టులో బుల్లెట్‌లాంటి బంతులతో ప్రతీ బంతికి వికెట్ తీసేలా కనిపించాడు. అరంగేట్రంలోనే ప్రత్యర్థి టాపార్డర్‌ను కూల్చి మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. ఆఖరి టెస్టులో అనూహ్యంగా చోటు దక్కించుకున్న దేవ్‌దత్ ఎలాంటి బెరుకు లేకుండా 65 పరుగులతో అరంగేట్ర ఫిఫ్టీని అందుకున్నాడు. అందుకే యువ ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం చూస్తుంటే ముచ్చటేస్తుందని కోచ్ ద్రవిడ్ సైతం ప్రశంసించాడు.

స్థాయికి తగ్గ సీనియర్లు

సిరీస్ విజయంలో సీనియర్ల పాత్రను తక్కువ చేయలేం. వైజాగ్ టెస్టులో వెటరన్ పేసర్ బుమ్రా రివర్స్ స్వింగ్ విధ్వంసం చూశాం. 25 ఓవర్ల పాత బంతితో అతను ఈ స్వింగ్‌ను రాబడుతూ ఆరు వికెట్లతో చెలరేగాడు. ఒల్లీ పోప్‌ను రివర్స్ స్వింగ్ యార్కర్ తోనే బౌల్డ్ చేయడం సిరీస్‌కే హైలైట్. స్పిన్నర్లు అశ్విన్, జడేజా, కుల్దీప్ ఇంగ్లండ్‌ను ప్రతీ మ్యాచ్‌లో దెబ్బతీశారు. అశ్విన్ 26, జడ్డూ 19 వికెట్లు తీయగా.. రెండో టెస్టు నుంచి కుల్దీప్ కీలకంగా మారి బౌలింగ్‌లోనే కాకుండా బ్యాటింగ్‌లోనూ ఆకట్టుకున్నాడు. ఇలా యువ ఆటగాళ్లు, సీనియర్ల మేళవింపుతో ఇంగ్లండ్‌పై భారత జట్టు అద్భుత సిరీస్ విజయాన్ని అందుకోగలిగింది.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఢిల్లీ.. భళా

● ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు
● బెంగళూరుపై ఉత్కంఠ గెలుపు



జెమీమా (58)

న్యూఢిల్లీ: డబ్ల్యూపీఎల్‌లో ఆదివారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్క పరుగు తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఓడించింది. 7 మ్యాచ్‌ల నుంచి 10 పాయింట్లతో టాప్‌నకు ఎగబాకిన ఢిల్లీ ప్లేఆఫ్స్ బెర్త్‌ను సొంతం చేసుకొంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జెమీమా రోడ్రిగ్స్ (58), అలిస్ క్యాప్సీ (48) మూడో వికెట్‌కు 62 బంతుల్లోనే 97 పరుగులు జోడించడంతో.. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 181/5 స్కోరు చేసింది. లానింగ్ (29), షఫాలీ (23) రాణించారు. శ్రేయాంక 4 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో బెంగళూరు ఓవర్లన్నీ ఆడి 180/7 స్కోరు మాత్రమే చేసింది. కెప్టెన్ స్మృతి మంధాన (5) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. మోలినెక్స్ (33), పెర్రీ (49) రెండో వికెట్‌కు 80 పరుగులు జోడించారు. పెర్రీ, మోలినెక్స్ తర్వాత డివైన్ (26), రిచా ఘోష్ (51) బ్యాట్‌లు ఝుళిపించడంతో లక్ష్యం వేగంగా కరిగింది. చివరి ఓవర్‌లో బెంగళూరు గెలుపునకు 17 రన్స్ అవసరమవగా, రెండు సిక్స్‌లతో జోరు చూపిన రిచా గెలుపుగీతను మాత్రం దాటలేకపోయింది. చివరి బంతికి రెండు పరుగులు కావాల్సి ఉండగా.. రిచా సింగిల్ కోసం ప్రయత్నించి రనౌటవడంతో బెంగళూరుకు నిరాశ తప్పలేదు.

నేటి మ్యాచ్
గుజరాత్ x యూపీ
రాత్రి 7.30 గం. నుంచి

సంక్షిప్త స్కోర్లు
ఢిల్లీ: 20 ఓవర్లలో 181/5 (జెమీమా 58, క్యాప్సీ 48; పాటిల్ 4/26).
బెంగళూరు: 20 ఓవర్లలో 180/7 (రిచా 51, పెర్రీ 49; క్యాప్సీ 1/5, కాప్ 1/30).

ఆసీస్ లక్ష్యం 279

ప్రస్తుతం 77/4

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మధ్య రెండో టెస్టు ఉత్కంఠగా మారింది. ఆసీస్ విజయానికి 202 పరుగులు కావాల్సి ఉండగా.. కివీస్ గెలుపునకు 6 వికెట్ల దూరంలో ఉంది. 279 పరుగుల ఛేదనలో మూడో రోజైన ఆదివారం ఆట ముగిసేసరికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 77/4 స్కోరు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 134/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 372 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 162, ఆసీస్ 256 రన్స్ చేశాయి.

బజ్‌రంగ్, దహియా ఒలింపిక్స్ ఆశలు ఆవిరి?

సెలెక్షన్ ట్రయల్స్‌లో పరాజయం





సోనెపట్: టోక్యో ఒలింపిక్స్‌లో పతకాలు నెగ్గిన స్టార్ రెజ్లర్లు బజ్‌రంగ్ పూనియా, రవి దహియాకు భారీ షాక్ తగిలింది. జాతీయ జట్టులో చోటు కోసం ఆదివారం నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో వీరిద్దరూ ఓటమిపాలయ్యారు. ఫలితంగా పారిస్ విశ్వక్రీడల అర్హత రేసు నుంచి కూడా అవుటయ్యారు. 65 కిలోల విభాగం సెమీస్‌లో బజ్‌రంగ్ 1-9తో రోహిత్ కుమార్ చేతిలో చిత్తయ్యాడు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిలో పూనియా కీలకంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఇక, ఐఓఏ అడ్‌హక్ ప్యానెల్ నిర్వహిస్తున్న ఈ ట్రయల్స్ కోసం బజ్‌రంగ్ రష్యాలో శిక్షణ కూడా తీసుకొన్నాడు. కానీ, ట్రయల్స్‌లో అనుకున్నస్థాయిలో రాణించలేకపోయాడు. ఓడిన వెంటనే పూనియా సాయ్ స్పోర్ట్స్ సెంటర్ నుంచి అర్ధంతరంగా వెళ్లిపోయాడు. డోపింగ్ కోసం శాంపిల్ కూడా ఇవ్వలేదు. ఇక, 57 కిలోల విభాగం ఆరంభ రౌండ్‌లో అమన్ షెహ్రావత్ చేతిలో ఓడిన దహియా.. ఆ తర్వాతి బౌట్‌లో ఉదిత్ చేతిలో ఎదురైన పరాజయంతో రేసు నుంచి ఎలిమినేట్ అయ్యాడు. ట్రయల్స్ విజేతలకు వచ్చేనెలలో జరిగే ఆసియా క్వాలిఫయర్స్, మేలో జరిగే వరల్డ్ ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో పాల్గొనే చాన్స్ లభిస్తుంది. జైదీప్ (74 కి), దీపక్ పూనియా (86 కి), దీపక్ నెహ్రా (97 కి), సుమీత్ మాలిక్ (125 కి) తమ విభాగాల ట్రయల్స్‌లో విజేతలుగా నిలిచారు.

ముంబై 224 ఆలౌట్

రంజీ ఫైనల్

ఆదుకున్న శార్దూల్ ● విదర్భ 31/3

ముంబై: శార్దూల్ ఠాకూర్ (75, 1/14) ఆల్‌రౌండ్ షోతో.. ముంబై తడబడి నిలిచింది. విదర్భతో ఆదివారం మొదలైన రంజీ ఫైనల్లో తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 224 పరుగులకు ఆలౌటైంది. హర్ష్ దూబే, యష్ ఠాకూర్ చెరో 3.. ఉమేశ్ 2 వికెట్లు తీశారు. ఒకదశలో 81/0తో పటిష్ఠంగా కనిపించిన ముంబై.. 30 పరుగుల తేడాతో 6 కీలక వికెట్లు చేజార్చుకొంది. ఓపెనర్లు పృథ్వీ షా (46), భూపేన్ (37) ఫర్వాలేదనిపించినా.. కెప్టెన్ రహానె (7), శ్రేయాస్ (7) విఫలమయ్యారు. 111/6తో పీకల్లోతు కష్టాల్లో పడిన తరుణంలో.. టెయిలెండర్ల అండతో అర్ధ శతకం సాధించిన శార్దూల్ జట్టుకు గౌరవప్రద స్కోరును అందించాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన విదర్భ తొలి రోజు ఆట ముగిసేసరికి 31/3 స్కోరు చేసింది. శార్దూల్ ఓ వికెట్.. పేసర్ ధవళ్ కులకర్ణి రెండు వికెట్లు తీశారు.

దిక్సూచి

హైదరాబాద్ ● సోమవారం 11 మార్చి 2024
diksuchi@andhrajyothy.com

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) తాజాగా గ్రూప్-1 ప్రిలిమినరీ, మెయిన్స్; గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల తేదీలు ప్రకటించింది. సాధారణంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారందరూ ప్రభుత్వ ఉద్యోగం కోసం ఈ పరీక్షలను కామన్‌గా రాస్తారు. గ్రూప్-2, గ్రూప్-3 సర్వీసులలో మరికొన్ని అదనపు పోస్టుల ప్రకటన వెలువడుతుందని అభ్యర్థులు ఆశించారు. కానీ, టీఎస్‌పీఎస్సీ పరీక్షల కొత్త తేదీలకు మాత్రమే పరిమితమైంది. ఈ నేపథ్యంలో పరీక్షల కోసం సంసిద్ధం అవుతున్న అభ్యర్థులకు ఒక కామన్ దృక్పథం లేదా ఒక దిక్సూచిని పరిచయం చేయడమే ఈ వ్యాసం ఉద్దేశం.



పరీక్షల కొత్త తేదీలు

- గ్రూప్-1 : 563 ఖాళీలు
  పరీక్ష తేదీలు: ప్రిలిమ్స్ 2024 జూన్ 9న, మెయిన్స్ 2024 అక్టోబరు 21 నుంచి ప్రారంభం
- గ్రూప్-2: 783 ఖాళీలు
  పరీక్షల తేదీలు: 2024 ఆగస్టు 7, 8
- గ్రూప్-3: 1388 ఖాళీలు
  పరీక్ష తేదీలు: నవంబరు 18

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

గ్రూప్-1, 2, 3 పరీక్ష ఏదైనా..

ప్రిపరేషన్ ఒక్కటే..!

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష తేదీలను ఒక నిర్మాణాత్మక పద్ధతిలో ప్రకటించింది. ప్రతి పరీక్షకు మధ్య వ్యవధి ఉండటం సీరియస్‌గా ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే అభ్యర్థులు తమ ప్రాధాన్య క్రమంలో ప్రిపరేషన్ ప్లాన్‌ను రూపొందించుకోవాలి. వాస్తవానికి గ్రూప్-1 మెయిన్స్ మినహా మిగతా పరీక్షల్లో కామన్ అంశాలు ఉంటాయి. గ్రూప్-1 ప్రిలిమ్స్, గ్రూప్-2లోని నాలుగు పేపర్లు; గ్రూప్-3 లోని మూడు పేపర్ల సిలబస్ దాదాపు ఒకటే. అయితే ప్రశ్నల సరళి, కాఠిన్యతలో తేడా లుంటాయని అభ్యర్థులు గ్రహించాలి.

గ్రూప్స్ సిలబస్‌లో కామన్ అంశాలు

- **కరెంట్ అఫైర్స్, స్థానిక- జాతీయ- అంతర్జాతీయం:** ఏ పోటీ పరీక్షకైనా సమకాలీన ప్రపంచంలో సంభవిస్తున్న పరిణామాలు అతి కీలకమైనవి. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ఎవరైతే ఈ మూడు పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నారో...వారు కరెంట్ అఫైర్స్‌పై ఫోకస్ పెట్టాలి. దినపత్రికలు క్రమం తప్పకుండా చదవడం, ప్రభుత్వ నివేదికల పరిశీలన, డిబేట్ల ద్వారా సమాచార సేకరణ, పోటీ పరీక్షల పత్రికల పఠనం అవసరం. అయితే, గ్రూప్-1కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు మాత్రం ప్రత్యేకంగా నోట్స్ రాసుకోవాలి. వీటి ద్వారా విషయ విశ్లేషణ సామర్థ్యాలను పెంచుకోవాలి. మెయిన్స్‌లోని జనరల్ ఎస్సేకు ఉపయోగపడేలా ఈ సంసిద్ధత కొనసాగాలి.
- **సైన్స్ అండ్ టెక్నాలజీ:** జనరల్ స్టడీస్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఇటీవలి కాలంలో ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలను నిత్య జీవితంతో అన్వయం చేసి అడుగుతున్నారు. అందువల్ల రెగ్యులర్‌గా పత్రికల పఠనం అవసరం. గ్రూప్-1లో సైన్స్ అండ్ టెక్నాలజీ మెయిన్స్ పేపర్ కూడా! అభ్యర్థులు తమ ప్రాథమిక ప్రిపరేషన్‌లోనే ఈ విభాగంలోని అంశాలను నిత్య జీవన సమస్యలకు, సమాజ వాస్తవ జీవన శైలికి అన్వయం చేస్తూ నేర్చుకోవాలి.
- **పర్యావరణం- ప్రకృతి వైపరీత్యాలు- నివారణ అంశాలు:** ఇటీవలి కాలంలోని పోటీ పరీక్షల ప్రశ్నలలో పర్యావరణ అంశాలపై ప్రశ్నల సంఖ్య పెరిగింది. ప్రధానంగా యూపీఎస్సీ ప్రశ్న పత్రాల్లో ఈ ప్రశ్నల సంఖ్య పెరిగింది. గతంలో నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో కూడా పర్యావరణ సమస్యలు, నిత్య జీవనంపై పడే ప్రభావాలపై ప్రశ్నలు అడిగారు. అదే నేపథ్యంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ లేదా ప్రకృతి వైపరీత్య నిర్వహణ లేదా విపత్తు నిర్వహణ అంశాలకు కూడా ప్రాధాన్యం పెరిగింది. కాబట్టి అభ్యర్థులు ఈ అంశాలపై అప్‌డేట్ సమాచారాన్ని సేకరించుకోవాలి.
- **భారత రాజ్యాంగం, గవర్నెన్స్:** ప్రశ్నల కాఠిన్యతలో ఈ అంశం అధిక ప్రాధాన్యం కలిగి ఉంది. ప్రధానంగా గ్రూప్-1 ప్రిలిమ్స్, గ్రూప్-2, గ్రూప్-3లలో స్కోరింగ్‌కు అత్యంత కఠినమైన సబ్జెక్టు. అయితే గ్రూప్-3కి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు భారత రాజ్యాంగంపై ప్రాథమిక అవగాహన సాధిస్తే సరిపోతుంది. గ్రూప్-1 స్థాయి అభ్యర్థులు మాత్రం కోర్టు తీర్పులు, పార్లమెంట్ చర్చలు, రాజ్యాంగ అన్వయింపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ప్రధానంగా సమకాలీన వివాదాలపై, రాజ్యాంగ పర సమాధానాలపై అవగాహన అవసరం. గ్రూప్-2 స్థాయిలో కూడా లోతైన అవగాహన ఉండాలి.
- **ఆర్థికపరమైన అంశాలు - కరెంట్ ఎకానమీ:** గ్రూప్-1, 2, 3 జనరల్ స్టడీస్‌లో కరెంట్ ఎకానమీ కీలకమైన భూమిక పోషిస్తుంది. వాస్తవానికి గ్రూప్-3లో ఎకానమీ ప్రాధాన్యం ఎక్కువ. ఇటీవలి కాలంలో తెలంగాణ ప్రభుత్వం మారింది. ఈ నేపథ్యంలో విడుదలైన వివిధ ఆర్థిక డాక్యుమెంట్లను అభ్యర్థులు సేకరించి అధ్యయనం చేయాలి. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్, గత ప్రభుత్వ వైఫల్యాలపై శ్వేతపత్రం, నీటిపారుదల శాఖ వివరణ పత్రం తప్పనిసరిగా చదవాలి. గ్రూప్-2, గ్రూప్-1 మెయిన్స్‌లో కూడా ఎకానమీ నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుంది.

పరీక్షల మధ్య స్థాయిపరమైన తేడాలు

సిలబస్‌లో సమరూపత అంశాలు అనేకం ఉన్నప్పటికీ ప్రశ్నల స్థాయిలో, కాఠిన్యత స్థాయిలో తేడాలు ఉంటాయి. వీటిని ఈ కింది అంశాల ఆధారంగా గుర్తించవచ్చు.

- గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలకు జ్ఞాన స్థాయి, అవగాహన స్థాయి సరిపోతుంది. కానీ, గ్రూప్-1 కోసం మాత్రం వినియోగస్థాయి విజ్ఞానం, నైపుణ్యాలు అవసరం.
- గ్రూప్-1లో ప్రధానంగా మెయిన్స్‌లో విషయ విశ్లేషణ సామర్థ్యాలు, రాతపరమైన నైపుణ్యాలు, వివరణ చతురత ఉండాలి. గ్రూప్-2, గ్రూప్-3కి ఇవి పెద్దగా అవసరం లేదు.
- గ్రూప్-1కి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు నోట్స్ తప్పనిసరిగా రాసుకోవాలి. షార్ట్ నోట్స్ నుంచి లాంగ్ అనాలిసిస్ సామర్థ్యాలను పెంపొందించుకోవాలి. జ్ఞాపక శక్తి కన్నా వివరణ సామర్థ్యాలు విస్తృతంగా ఉండాలి. అదే గ్రూప్-2, గ్రూప్-3లో విషయాన్ని గుర్తించగలిగితే సరిపోతుంది.
- గ్రూప్-1కి సుదీర్ఘమైన ప్రిపరేషన్ అంటే.. ప్రతీ అంశాన్ని వివరించగలిగే రీతిలో అధ్యయనం అవసరం. గ్రూప్-2, 3కి తక్కువ సమయంలో ఎక్కువ సమాచార సేకరణ, విషయాన్ని గుర్తించే ప్రాక్టీస్‌కు సంబంధించిన ప్రక్రియ.

- **తెలంగాణ అంశాలు:** సహజంగా ఏ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగికైనా స్వరాష్ట్ర సమాజం, వారసత్వం, చరిత్ర అంశాలపై అవగాహన అవసరం. తెలంగాణ రాష్ట్రం... ఉద్యమ నేపథ్యం నుంచి ఉద్భవించిన రాష్ట్రం. తెలంగాణ ఉద్యమంపై ప్రత్యేక అవగాహన అవసరం. గ్రూప్-2లోని పేపర్ 4, గ్రూప్-1లోని పేపర్ 6 ఉద్యమానికి సంబంధించింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తెలంగాణ అంశాలపై పట్టు సాధించడం అవసరం. గ్రూప్-1లోని 6వ పేపర్‌కు సంబంధించిన అంశాలపై వివరణాత్మక విశ్లేషణ చేసే సామర్థ్యాలను సాధించగలగాలి.
- **మెంటల్ ఎబిలిటీ, డేటా విశ్లేషణ:** గణిత నేపథ్యం ఉన్న అభ్యర్థులకు ఈ అంశాలు సులభం కాగా, గణితేతర విద్యార్థులకు ఇది ఛాలెంజ్ సబ్జెక్టు. గ్రూప్-1 మెయిన్స్‌లో ఒక పేపర్‌లో అర్ధభాగం మెంటల్ ఎబిలిటీ, డేటా విశ్లేషణ అంశాలే ఉంటాయి. అభ్యర్థులు గ్రూప్-2 జనరల్ స్టడీస్‌లో, గ్రూప్-3 జనరల్ స్టడీస్‌లో స్కోరింగ్‌కు ఈ అంశాలు అధిక ప్రాధాన్యం కలిగినవి.
- **జనరల్ ఇంగ్లిష్:** ప్రధానంగా గ్రూప్-2, 3 జనరల్ స్టడీస్‌లో సంపూర్ణమైన వినియోగ సబ్జెక్టు ఇంగ్లిష్. అదే విధంగా గ్రూప్-1 మెయిన్స్‌కు ముందు క్వాలిఫయింగ్ ఎగ్జామ్‌గా ఈ సబ్జెక్టు ఉపయోగపడుతుంది. హైస్కూల్ స్థాయి ఆంగ్ల పరిజ్ఞానం ఈ సబ్జెక్టుపై అవగాహన కోసం సరిపోతుంది.
- అకడమిక్ కెరీర్‌లో ఉన్నత స్థాయి ప్రతిభకు కొలమానాలు గ్రూప్స్ ఉద్యోగాలు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియమించిన ప్రొఫెసర్ల బృందం అన్ని సర్వీసుల ప్రిపరేషన్‌కు అనుగుణంగా సిలబస్‌ను రూపొందించింది. కామన్‌గా కనిపించే ఈ సిలబస్‌లో స్థాయిని అనుసరించి ప్రశ్నల కూర్పు ఉంటుందని అభ్యర్థులు గమనించాలి.
- కామన్ అంశాలను ప్రాథమిక స్థాయి నుంచి ప్రిపేర్ అవుతూ క్రమక్రమంగా విస్తృతిని పెంచుకోగలగాలి. దీని కోసం గత ప్రశ్న పత్రాల పరిశీలన, ఇతర రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ ప్రశ్నపత్రాల విశ్లేషణ చేసుకోవాలి. జనరల్ స్టడీస్ ట్రెండ్ కోసం యూపీఎస్సీ ఇటీవలి కాలంలో నిర్వహించిన ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే మంచిది. అభ్యర్థులు అన్ని సర్వీసులకు అప్లై చేసుకుని తమ సంసిద్ధతను లేదా ప్రిపరేషన్‌ను కొనసాగించాలి.



డాక్టర్ రియాజ్
సీనియర్ ఫ్యాకల్టీ, అకడమిక్ డైరెక్టర్,
5 మంత్ర కెరీర్ పాయింట్, హైదరాబాద్



కరెంట్ అఫైర్స్ జనరల్ ఎస్సే

ఇంటర్నేషనల్

బిగ్ క్యాట్ అలయెన్స్

చిరుతపులి, పులి అంటే ఎవరికైనా భయమే! ఒక్కోసారి ఇటువంటి క్రూరమృగాలు అడవులకు సమీపంలో ఉండే గ్రామాలపై దాడి చేసి జంతువులకు, మనుషులకు హాని కలిగిస్తుంటాయి. అలాంటి క్రూరమృగాలను ప్రత్యేకంగా సంరక్షించడం ఎందుకు? అనే సందేహం చాలామందికి కలగవచ్చు. నిజానికి పులి, చిరుత పులి వంటి ఆహార గొలుసులోని పై స్థాయి జంతువులు- జీవ వైవిధ్యాన్ని, ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడడంలో కీలకంగా వ్యవహరిస్తాయి. ఉదాహరణకు పులి, చిరుతపులి వంటి జీవులు అంతరించిపోతే గడ్డి మేసే జంతు జనాభా విపరీతంగా పెరిగి అటవీ భూముల్లో గడ్డి, చిన్నపాటి మొక్కలు కనుమరుగౌతాయి. దానితో పర్యావరణం, జీవావరణం దెబ్బతిని వర్షాభావ పరిస్థితులు తలెత్తడం, నేలలో తేమ తగ్గడం వంటి విపరిణామాలకు దారితీస్తుంది. అందుకే ప్రకృతి సమతుల్యాన్ని కాపాడాలంటే అంతరించిపోతున్న పులి జాతుల జనాభాను పరిరక్షించాల్సి ఉంది.

- ఇందుకోసం 1973లోనే పులుల సంరక్షణకు భారత ప్రభుత్వం 'ప్రాజెక్ట్ టైగర్'ను చేపట్టింది. పులుల ఆవాసాల సంరక్షణకు వాటి వేట నిరోధానికి స్థానిక గిరిజన జాతుల ప్రజలను, అటవీ పరిసర గ్రామాల ప్రజలను కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వాములను చేస్తూ పులుల సంరక్షణ ఆవశ్యకతపై వారిలో అవగాహన పెంచుతోంది.
- 2006-19 మధ్యకాలంలో ప్రభుత్వం పులుల సంఖ్యను పెంచడంపై ప్రత్యేక శ్రద్ధ వహించింది. టైగర్ ఇనీషియేటివ్ కార్యక్రమం ద్వారా పులుల సంఖ్యను రెండింతలు చేసింది. 2010లో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నిర్వహించిన టైగర్ సమ్మిట్‌లో భారత ప్రధాని మోదీ 2022 నాటికి ప్రపంచంలోని అడవుల్లో గల పులుల జనాభాను రెండింతలు చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. 2022లో భారతదేశం ఆతిథ్యం ఇచ్చిన పులుల సంరక్షణపై ఆసియా దేశాల మంత్రుల రెండో సమావేశం(సెకండ్ ఏషియా మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ ఆన్ టైగర్ కన్జర్వేషన్)'లో బిగ్ క్యాట్స్‌గా పిలిచే పులి, చిరుతపులి వంటి పులి జాతి జంతువుల సంరక్షణకు ఒక అంతర్జాతీయ కూటమిని ఏర్పాటు చేయాలని టైగర్ రేంజ్ కంట్రీస్(పులుల జనాభా గల దేశాలు) ఒక సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి. 2023 ఏప్రిల్‌లో మైసూర్‌లో జరిగిన ప్రాజెక్ట్ టైగర్ 50 వసంతాల కార్యక్రమం సందర్భంగా ప్రధాని మోదీ 'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ ఎలయెన్స్' ఏర్పాటును ప్రకటించారు.
- 2023 మార్చి 1న భారత రాజధాని న్యూఢిల్లీ హెడ్ క్వార్టర్‌గా ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ ఎలయెన్స్(ఐబీసీఏ) ఏర్పాటుకు ఆమోదం లభించగా 2024 ఫిబ్రవరి 29న అధికారికంగా క్యాబినెట్ ప్రకటన వెలువడింది.

ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయెన్స్ అంటే?

- ఆహారపు గొలుసులో పై భాగంలో ఉండే ప్రిడేటర్స్ జాతులకు (బిగ్ క్యాట్‌గా పిలిచేవి) చెందిన ఏడు రకాల జీవులు- సింహం, పులి, చిరుతపులి, స్నోలెపర్డ్, లెపర్డ్, జాగ్వార్, ప్యూమా జాతి వన్యమృగాల సంరక్షణ, పరిరక్షణ కోసం పరస్పర సహకారం అందించుకొనేందుకు ఏర్పాటైన కూటమి 'ఇంటర్నషనల్ బిగ్ క్యాట్ ఎలయెన్స్'.
- ఈ కూటమిలో 97 బిగ్ క్యాట్ రేంజ్ కంట్రీస్(ఈ ఏడు జాతుల వన్యమృగాలు గల దేశాలు)తోపాటు అనేక ఏజెన్సీలు, ఔత్సాహిక దేశాలు కూడా భాగస్వాములుగా ఉంటాయి. అంటే ఇది 'మల్టీ కంట్రీ-మల్టీ ఏజెన్సీ కొయిలేషన్'గా చెప్పవచ్చు. భారతదేశంలో ఈ ఏడు బిగ్ క్యాట్ జాతుల్లో రెండు జాతులు (ప్యూమా, జాగ్వార్) మినహా విగిలినవన్నీ మనుగడ సాగిస్తున్నాయి. భారత్‌తోపాటు ఈ కూటమిలో నేపాల్, బంగ్లాదేశ్, చైనా, భూటాన్ వంటి ఇతర ఆసియా దేశాలతోపాటు కొన్ని మధ్య ప్రాచ్యదేశాలు; ఉత్తర, దక్షిణ అమెరికా ఖండ దేశాలు; కాంబోడియా, మలేషియా, వియత్నాం, థాయ్‌లాండ్, లావో వంటి ఆగ్నేయాసియా దేశాలు; మరినామ్, ఇథియోపియా, కెన్యా, నైజీరియా, అర్మేనియా, టాంజానియా వంటి ఆఫ్రికా ఖండ దేశాలు భాగస్వాములుగా ఉండనున్నాయి. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్(ఐయూసీఎన్), స్నోలెపర్డ్ ట్రస్ట్, అమూర్ టైగర్ సెంటర్ ఈ కూటమిలో చేరేందుకు ఆసక్తి తెలిపాయి.

ఐబీసీఏ నిర్మాణం

- ఐబీసీఏకు భారతదేశం ప్రధాన కేంద్రంగా ఉంటుంది. ఇక్కడ ఒక సెక్రటేరియెట్ కూడా ఏర్పాటవుతుంది.
- ఐబీసీఏలో అసెంబ్లీ మెంబర్స్ స్టాండింగ్ కమిటీ ఏర్పాటును ప్రతిపాదించారు.
- భారత పర్యావరణ మంత్రిత్వ శాఖ ఐబీసీఏ సెక్రటేరియెట్‌కు ఒక తాత్కాలిక డైరెక్టర్ జనరల్‌ను నియమిస్తుంది
- కూటమి సభ్యదేశాలు సమావేశమై రోజువారీ విధి నిర్వహణ కోసం ఒక అధికారిక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసే వరకూ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ ఈ బాధ్యతలు నిర్వహిస్తారు.

ఐబీసీఏ లక్ష్యాలు

- అనుసంధాన వేదికగా ఐబీసీఏ సభ్యదేశాల మధ్య సమాచార, విజ్ఞాన మార్పిడికి సాంకేతిక సహకారానికి తోడ్పాటునందించడం
- సరిహద్దు అడవుల్లో ఇరుగు పొరుగు దేశాలు ఉమ్మడిగా చర్యలు చేపట్టేందుకు, పర్యవేక్షణ ఒప్పందాలకు సహకరించడం
- శాస్త్రీయంగా దత్తాంశాల సేకరణకు కావాల్సిన టెక్నాలజీని సాంకేతిక పరికరాలను సభ్య దేశాల మధ్య బదిలీ చేయడం
- భద్రతా దళాల మధ్య అనుసంధానత పెంచడం ద్వారా వన్య ప్రాణుల అక్రమ రవాణాను ప్రపంచవ్యాప్తంగా అరికట్టడం
- వివిధ దేశాలు, వివిధ ఏజెన్సీలు, వివిధ స్థానిక కమ్యూనిటీలు, అనుభవజ్ఞుల మధ్య అనుసంధానత పెంచడం ద్వారా వారి అనుభవాలు; సాంప్రదాయక, వైవిధ్య వ్యూహాలను పరస్పర పంపిణీకి వీలు కల్పించి అంతరించే దశకు చేరుకుంటున్న బిగ్ క్యాట్ జాతులను పరిరక్షించడం.
- పర్యావరణాన్ని, జీవ వైవిధ్యాన్ని రక్షించి సుస్థిరాభివృద్ధికి బాటలు వేయడం

నిధుల సమీకరణ

- వ్యవస్థాపక దాతగా భారతదేశం రూ.150 కోట్లను వన్ టైం బడ్జెటరీ సపోర్ట్‌గా వెచ్చించనుంది. రాబోయే అయిదేళ్ల కాలంలో (2028 వరకు) ఢిల్లీలో ఐబీసీఏ సెక్రటేరియెట్‌ను ఏర్పాటు చేయడం, ప్రాజెక్ట్ కార్యక్రమాలను నిర్వహించడం కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేయనుంది. ఇతర సభ్యదేశాలు కూడా కాలానుగుణంగా నిధులపరంగా, సాంకేతిక సహాయాల పరంగా సహకరించనున్నాయి.

ఐబీసీఏను భారత్‌లో ఏర్పాటు చేయడానికి కారణాలు

- ప్రపంచవ్యాప్తంగా ఉన్న అడవుల్లో గల పులుల జనాభాలో 50 శాతం వరకు భారతదేశ అడవుల్లోనే ఉన్నాయి. 2006-19 మధ్య కాలంలో పులుల సంఖ్యను రెండింతలు చేసిన ఘనత, అనుభవం భారత్‌కు ఉన్నాయి. ప్రాజెక్ట్ టైగర్‌లో భాగంగా గత 50 ఏళ్లుగా ప్రజల భాగస్వామ్యంతో పులుల వేటను అరికట్టడంలోనూ; గిరిజనుల భద్రత, జీవనోపాధికి భంగం కలుగకుండా అటవీ ఉత్పత్తులను సేకరించడంలోనూ; పులుల ఆవాసాలకు భంగం కలగకుండా మనుషులు మసలుకునే వ్యూహాలను అమలుపరచడంలోనూ; అటవీ సరిహద్దు ప్రాంత ప్రజలను పులుల సంరక్షణ పరంగా జాగృతం చేయడంలోనూ; పులుల వేటను నిరోధించి వాటి శరీర భాగాల వ్యాపారాలను అడ్డుకోవడంలోనూ భారత్‌కు విస్తృతమైన అనుభవం ఉంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

కుషాణుల రాజకీయ, సాంస్కృతిక చరిత్ర

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ

భారతదేశ చరిత్రలో కుషాణుల ప్రాముఖ్యం చాలా ఉంది. శక సంవత్సరాన్ని క్రీ.శ.78 మార్చి 22న కనిష్కుడు ప్రారంభించాడు. దీనినే శక క్యాలెండర్‌గా భావిస్తారు. కుషాణుల వంశంలో కనిష్కుడు గొప్పవాడు. ఇతనికి దేవపుత్ర, సీజర్, రెండో అశోకుడు అనే బిరుదులు ఉన్నాయి.

కుషాణుల చరిత్రకు ఆధారాలు: తొలి, మలి 'హన్‌వంశ' చరిత్రలు, బాక్ట్రియాలోని రాయబారి 'చాంగ్‌కెన్' రచనలు, హిందూ పురాణాలు, కల్హణుడు రాసిన 'రాజతరంగిణి'(కశ్మీర్‌ను పాలించిన రాజుల చరిత్ర), అశ్వఘోషుడు రాసిన 'మాధ్యమిక సూత్రం' మొదలైన గ్రంథాలు.

కుషాణుల రాజకీయ చరిత్ర: వీరు చైనాలోని 'యూచీ' తెగకు చెందిన వారు. వీరి స్వస్థలం చైనాలోని 'హుయాంగ్‌హో' నదీ తీర ప్రాంతం. కుషాణులు చైనాలో 'హియాంక్' తెగ చేతిలో ఓడిపోయి భారత్‌కు వలస వచ్చారు. ఇక్కడి శకరాజులను ఓడించి స్థిరపడ్డారు. వీరు ఆక్రమించిన రాజ్యాన్ని ఐదు భాగాలుగా విభజించారు.

కుజుల కాడ్ఫిసెస్: ఇతడు రాజ్య స్థాపకుడు. ఇతడు నాలుగు యూచీ తెగలను ఓడించి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. శకులను ఓడించి, వారు నివసించిన ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేశాడు. వివాహ సంబంధాల ద్వారా రాజ్యాన్ని విస్తరించాడు. కుషాణులు, శకులు కలిసిపోయారు.

కుజుల కాడ్ఫైజ్: క్రీ.శ.15లో రాజ్యానికి వచ్చాడు. ఇతని తర్వాత విమాకాడ్‌ఫైజ్ పాలనలోకి వచ్చాడు. ఇతను క్రీ.శ.65 నుంచి 75 వరకు పాలించాడు. ఇతని విగ్రహంపై 'కుషాణ పుత్రషాహి విసుతకమ' అని ఉంది. విమాకాడ్‌ఫైజ్ తండ్రి కాలంలోనే గాంధార ప్రాంతంతోపాటు, పంజాబ్, మధుర, వారణాసి వరకు జయించాడు. చివరకు చైనా వాళ్ల చేతిలో ఓడిపోయాడు. రోమన్ చక్రవర్తి ఆస్థానానికి విమాకాడ్‌ఫైజ్ రాయబారిని పంపాడు. వర్తక వాణిజ్యాలు, వర్తక సంబంధాలు ఏర్పరచుకున్నాడు. ఇతని కాలంలోనే వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, వజ్రాలు రోమ్‌కు ఎగుమతి అయ్యేవి. దీనికి బదులుగా భారత్‌కు రోమ్ నుంచి 'బంగారు నాణేలు' దిగుమతి అయ్యాయి అని ప్లీని 'ద ఎల్డర్' అనే పుస్తకంలో పేర్కొన్నాడు. విమాకాడ్‌ఫైజ్ శైవమతాన్ని స్వీకరించినట్లు అతని నాణేలపై కన్పించే త్రిశూల ధారి, శివమూర్తి, నంది వాహనం బట్టి తెలుస్తోంది. ఇతనికి రాజాధిరాజా, మహారాజా అనే బిరుదులు ఉండేవి. ఇతని రాజధాని పురుషపురం లేదా పెషావర్. రెండో రాజధాని మధుర.

కనిష్కుడు : ఈ వంశంలో గొప్పవాడు. క్రీ.శ.78లో పాలనలోకి వచ్చాడు. ఈ సందర్భంగానే ఇండియన్ క్యాలెండర్ క్రీ.శ.78 మార్చి 22న ప్రారంభమైంది. కనిష్కుడు గొప్ప యోధుడు. ఇతడు కశ్మీర్‌ను జయించి తన రాజ్యంలో విలీనం చేశాడని కల్హణుడు తన 'రాజతరంగిణి'లో, ఆల్ బెరూని 'కితాబ్-ఇ-హింద్'లో పేర్కొన్నారు. ఇక్కడి నుంచే కనిష్కుడు అశ్వఘోషుడిని తన ఆస్థానానికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఉజ్జయినిలో ఉన్న పశ్చిమ క్షాత్రపులను ఓడించి 'మాళ్వా' ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

నాలుగో బౌద్ధమత సమావేశం: ఈ సమావేశాన్ని కశ్మీర్‌లోని కుందలవనంలో నిర్వహించాడు. వసుమిత్రుడిని అధ్యక్షుడిగా, అశ్వఘోషుడిని ఉపాధ్యక్షుడిగా నియమించాడు. వసుమిత్రుడు 'మహా విభాష్యం' రచించాడు. అశ్వఘోషుడు 'సౌందర్యనందం', 'సారీపుత్ర ప్రకరణం', 'వజ్రసూచీ' మొదలైన గ్రంథాలు రచించాడు. కనిష్కుని ఆస్థానంలో చరకుడు అనే గొప్ప వైద్యుడు ఉండేవాడు. ఇతను 'చరక సంహిత' అనే వైద్య గ్రంథం రాశాడు. కనిష్కుని కాలంలో బౌద్ధమతం హీనయానం, మహాయానం అని రెండు వర్గాలుగా చీలిపోయింది. చివరి రాజు వాసుదేవుడు.

ప్రాధాన్యం

వీరి కాలంలో సంస్కృతం, సాహిత్యం అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. నాలుగో బౌద్ధమత సమావేశం సంస్కృతంలో జరిగింది. అశ్వఘోషుడిని తొలి సంస్కృత నాటక కర్తగా పరిగణిస్తారు. వీరి కాలంలో మూడు విభిన్న శిల్పకళ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. అవి...

- వాయువ్య భారతదేశంలోని గాంధార శిల్పకళ
- ఆంధ్రలో అమరావతి శిల్పకళ
- గంగా ప్రాంతంలో మధుర శిల్పకళ

సిల్క్‌రూట్: వీరి కాలంలోనే భారతదేశం, చైనా మధ్య వర్తక వాణిజ్యాలు అభివృద్ధి చెందాయి. భారత్, రోమన్ దేశాల మధ్య వాణిజ్యం అభివృద్ధి చెందింది. చైనాలో బౌద్ధమతం వ్యాప్తికి దారి తీసిన సిల్క్‌రూట్‌లోని పెద్ద భాగాలను కుషాణులు నియంత్రించారు. ఈ సమయంలోనే బౌద్ధమతం కొరియా, జపాన్‌లో వ్యాపించడం ప్రారంభమైంది.

నిర్మాణాలు: కుషాణుల ఆధ్వర్యంలో నూతన నగరాలు నిర్మించారు. పురుషపురం, కశ్మీర్ మొదలైనవి. చైత్యాలు, అందమైన శిల్పాలను నిర్మించారు.

- మొదట కుషాణులను విదేశీయులుగా భావించినప్పటికీ... వారి పద్ధతులు, పాలన సంస్కరణలు పూర్తిగా భారతీయాకరించబడ్డాయి.
- భారతీయ చరిత్రలో కుషాణుల కాలం గుప్తుల స్వర్ణయుగానికి నాంది అని చెప్పవచ్చు.

శిల్పకళ

గాంధార శిల్పకళ: దీనిని కనిష్కుడు ప్రారంభించాడు. గాంధార ప్రాంతం విదేశీయుల ప్రభావానికి లోనైంది. ఈ శిల్పాల్లో బుద్ధుని ముఖంలో సాత్విక స్వభావంతో కాకుండా, పౌరుషత్వం కనిపిస్తుంది. కండలు తిరిగిన శరీరం, రింగులు తిరిగిన జుట్టుతో బుద్ధుని విగ్రహాలు...ఆత్మలేని శరీరాల్లా ఉన్నాయి. అందువల్ల భారతీయ శైలిపై గాంధార శిల్పం ప్రభావం చూపలేదు.

క్రీ.శ. 5వ శతాబ్దంలో హూణుల దండయాత్రలో గాంధార శిల్పాలు కొంత వరకు ధ్వంసం అయ్యాయి. గ్రీకు-రోమన్ శిల్పకళ ప్రేరణతో ఇండో-గ్రీకు లక్షణాలతో ఏర్పడిందే గాంధార శిల్పకళ. బూడిదరంగు రాతితో చెక్కేవారు. దక్షిణాసియాలోని 'హెలెనిస్టిక్' కళతో దీనిని రూపొందించారు. తొలి విగ్రహం బిటర్‌గాం వద్ద లభించింది. ఎక్కువ విగ్రహాలు కాందహార్ లేదా గాంధార్‌లో లభ్యమయ్యాయి. బమియాన్‌లో ఉన్న అతిపెద్ద విగ్రహాన్ని గొప్ప ఉదాహరణగా చెప్పవచ్చు.

మధుర శిల్పకళ: ఈ శిల్పకళ కూడా క్రీ.శ.100 ప్రాంతంలో కనిష్కుని కాలంలోనే పుట్టింది. మధుర శిల్పకళలో మత, మతేతర శిల్పాలు ఉన్నాయి. మధుర శిల్పకళలో బౌద్ధ, జైన, హిందూ మతాల శిల్పాలు, నాగ, నాగిని శిల్పాలు గాక, సాలభంజిక శిల్పాలు ఉన్నాయి. ఈ శిల్పాలను సిక్రీలోని తెల్లచుక్కలు గల ఎర్ర ఇసుక రాతిలో తయారు చేశారు. వీటిలో స్త్రీల శిల్పాలు ఎక్కువగా ఉన్నాయి. భారతీయ రీతిలో మొదటి సారిగా బుద్ధుని శిల్పాన్ని మధుర శిల్పి సృష్టించాడు.

భోదిసత్వుని విగ్రహం: తల వెనుక ప్రభావ మండలంతో, తల చుట్టూ ముడుల టోపీ, కుడి చేయి అభయ ముద్రలో, ఎడమ చేయిలో కమండలం ఉంది. సుల్తాన్ గంజ్‌లో రాగితో చేసిన బుద్ధుని శిల్పం బర్మింగ్‌హోంలో ఉంది. ఇది గుప్తుల కాలంలో మధుర శిల్పకళ నుంచి ప్రేరణ పొందినట్లు తెలుస్తోంది.

సామ్రాజ్య పతనం

కనిష్కుని తర్వాత అతని కుమారుడు వశిష్కుడు రాజ్యానికి వచ్చాడు. వశిష్క తరవాత హువిష్క, రెండో కనిష్క వరుసగా పాలించారు. రెండో కనిష్కుని తరవాత చివరి రాజు వాసుదేవుడు. ఇతని తర్వాత క్రీ.శ. 176లో కుషాణుల రాజ్యం అంతరించింది.



డాక్టర్ ఐ. నీలా,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.

జల గోస



చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి వద్ద ఎండిపోయిన ఆకేరు వాగు

(మొదటిపేజీ తరువాయి)
కూడా వర్షాలు ఎక్కువగా కురవడంతో నీటి నిల్వలు, భూగర్భ జలాలు పెరిగి సాగుకు కొరత ఏర్పడలేదు. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబరుల్లో కురిసిన వర్షాలతో రైతులు వానా కాలం పంటలు సాగు చేసేవారు. ఈ తర్వాత అక్టోబరు, నవంబరుల్లో వర్షాలు పడి మళ్లీ జలాశయాలు నిండిపోయేవి. దీంతో ఒకే సీజన్‌లో రెండు, మూడు సార్లు సాగునీటి వనరులు కళకళలాడాయి. అవే నీళ్లు యాసంగి సీజన్ వరకు ఉండడంతో సాగు నీటికి సమస్య ఏర్పడలేదు. కానీ, ఈ సంవత్సరం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు తక్కువగా పడటంతో నీటికి కొరత ఏర్పడింది.

వర్షపాతం సగటును మించినా..

రాష్ట్ర సగటు వర్షపాతం 866.40 మిల్లీ మీటర్లు. 2022-23లో 1,235 మి.మీ., ఈ సంవత్సరం (2023-24)లో 914.90 మి.మీ. నమోదైంది. గణాంకాల ప్రకారం.. నిరుటి కంటే సాధారణ వర్షపాతం కాస్త ఎక్కువే. అయితే, ఇదేమీ ఉపయోగపడడం లేదు. ఇక నిరుడు నైరుతి రుతు పవనాల సీజన్ (జూన్-సెప్టెంబరు)లో 1,099 మి.మీ వర్షపాతం నమోదైతే ఈ ఏడాది 861 మి.మీ.కు పరిమితమైంది. గత ఏడాది ఈశాన్య రుతు పవనాల సమయంలో (అక్టోబరు-డిసెంబరు) 136 మి.మీ వర్షపాతం ఉండగా ఈ ఏడాది 53 మి.మీ. నమోదైంది. శీతాకాల సమయంలో (జనవరి, ఫిబ్రవరి) 12 మి.మీ సాధారణ వర్షపాతానికి గాను 1.10 మి.మీ. మాత్రమే నమోదైంది. అంటే.. నైరుతి మొదలుకుని ఈశాన్య రుతు పవనాలు, శీతాకాలంలో కురిసే అడపాదడపా వానల వరకు తక్కువే కురిశాయి. ఇదే యాసంగి సాగుకు ప్రతిబంధకంగా తయారైంది. వ్యవసాయ శాఖ తాజా నివేదిక ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి ఆఖరు వరకు భూగర్భ జలాలు సగటున ఉపరితలం నుంచి 8.70 మీటర్ల లోతులోకి వెళ్లిపోయాయి. దీన్నిబట్టే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

వరి కోతలకు వచ్చేది కష్టమే?

ఈ యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా 66.30 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 50.84 లక్షల ఎకరాల్లో వేశారు. 2.09 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 2.55 లక్షల ఎకరాల్లో శనగ, 6.48 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగయ్యాయి. భూగర్భ జలాలు పడిపోవడం, ప్రాజెక్టుల్లో నిల్వలు తగ్గిపోతుండడంతో నీటి కొరత ఏర్పడింది. వివిధ జిల్లాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ప్రధానంగా వరికి సరిపడా అందడం లేదు. ఏప్రిల్, మే నెలల్లో వరి కోతకు వస్తుంది. ముందుగా నాట్లు వేసినచోట ఈ నెల రెండో పక్షంలో కోతలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఈ దశలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. అలాగైతేనే గింజ బలంగా తయారవుతుంది. లేదంటే దిగుబడి గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. గత ఏడాదితో పోలిస్తే యాసంగిలో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. నిరుడు 57.09 లక్షల ఎకరాల్లో వరి వేస్తే ఈసారి 50.84 లక్షల ఎకరాల్లో సాగైంది. అన్ని పంటలు కలిపి నిరుడు యాసంగిలో 73.10 లక్షల ఎకరాల్లో సాగైతే ఈసారి 66.30 లక్షల ఎకరాల్లోనే వేశారు. దీంతోనే పంటల ఉత్పత్తి తగ్గిపోతుందని అనుకుంటుంటే.. సాగునీటి కొరతతో దిగుబడి పడిపోయే ప్రమాదం నెలకొంది.

ఖమ్మంలో ఎండిపోయిన 700 చెరువులు

నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజీ (510 అడుగులు)కి చేరువవుతోంది. పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 514.50 అడుగుల మేర నీరుంది. సాగర్‌తో పాటు ఏఎమ్మార్పీ కింద దశాబ్దం తర్వాత క్రాప్ హాలిడే ప్రకటించడం గమనార్హం. నల్లగొండ జిల్లాలో ప్రధానమైన బత్తాయి, నిమ్మతోటలు ఎండిపోతున్నాయి. సాగర్ నుంచి తాగు నీటి కోసం శనివారం మూడు టీఎంసీలను విడుదల చేయాల్సి వచ్చింది. జూరాల కింద సైతం క్రాప్ హాలిడే ప్రకటించారు. కర్ణాటక నుంచి సీపేజ్ నీరూ రావడం లేదు. దీంతో జూరాల నీటిని తాగడానికే పరిమితం చేశారు. ఉమ్మడి ఖమ్మంలో తాగునీటికి ఈ ఏడాది తండ్లాట తప్పేలా లేదు. ఈ జిల్లాలో మొత్తం 700 చెరువులు ఎండిపోయాయి. పాలేరు నుంచి ఏటా 2 టీఎంసీలను తాగునీటికి వాడుతుంటారు. అయితే, ఫిబ్రవరిలో సాగర్ జలాలు రాలేదు. దీని ద్వారా ఖమ్మం నగరం, జిల్లాలోని 950 గ్రామాలకు తాగునీరివ్వాల్సింది. వారం రోజులుగా ఖమ్మంలో 8 ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 1.28 లక్షల ఎకరాల్లో వరి సాగైనా సగమైనా కోతలకు వస్తుందా? అనే ఆందోళన నెలకొంది. కొందరు రైతులు మూడేసి బోర్లు తవ్వించినా ఫలితం దక్కలేదు. కరీంనగర్ జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టుకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీరు అందజేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో 25 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. పంటలు చివరికి వచ్చేసరికి ఈ నీళ్లు అందవు.

3 జిల్లాల్లో 13 మీటర్ల లోతున జలాలు

మే నెలలో ఎలాంటి వాతావరణం ఉంటుందో ఇప్పుడు అలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. పాలేరు నీరు లేక ఖమ్మం జిల్లాలో భూగర్భ జల మట్టం వేగంగా పడిపోతోంది. జనవరిలో 2 అడుగులు, ఫిబ్రవరిలో 4 అడుగులు పడిపోయియింది. వరంగల్, వికారాబాద్ జిలాల్లో మీటరు మేర పడిపోయాయి. ఎండల తీవ్రతతో ఆవిరయ్యే నీటి శాతం కూడా పెరుగుతోంది. 2023 ఫిబ్రవరిలో భూగర్భ జలాలు ఉపరితలం నుంచి 7.34 మీటర్ల లోతులో ఉండగా.. ఈసారి 1.36 మీటర్ల ఎక్కువ లోతుకు వెళ్లిపోయాయి. 2023 మేలో 8.37 మీటర్ల లోతులో ఉండగా ఈ సంవత్సరం ఫిబ్రవరిలోనే 8.70 మీటర్లకు పడిపోవడం గమనార్హం. దీనికిముందు జనవరిలో 7.72 మీటర్ల లోతులో ఉండగా.. నెల తిరిగేసరికి ఇంకో మీటరు కిందకు వెళ్లిపోయాయి. మార్చిలో 9 మీటర్లకు పడిపోయి ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వికారాబాద్, కామారెడ్డి, మెదక్‌లో 13 మీటర్లు, రంగారెడ్డి, సంగారెడ్డి మేడ్చల్‌లో 12 మీటర్లు, నాగర్‌కర్నూల్, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో 10 మీటర్ల లోతుకు పైగా భూగర్భ జలాలు పడిపోయాయి.

రాష్ట్రంలోని జలాశయాల్లో కూడా నిల్వలు కొడిగడుతున్నాయి. నీటి పారుదల శాఖ నివేదిక ప్రకారం ఈ నెల 6వ తేదీ నాటికి 12 ప్రధాన జలాశయాల్లో 283.41 టీఎంసీల నిల్వలున్నాయి. నిరుటితో పోలిస్తే 155.36 టీఎంసీలు తక్కువ. సాగర్‌లో నిరుడు 196.12 టీఎంసీల నీరుండగా ఇప్పుడు 140.49 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 ప్రధాన రిజర్వాయర్లలో గతేడాది నీటినిల్వలు, ప్రస్తుత నీటి నిల్వలు (టీఎంసీల్లో)

రిజర్వాయర్ పేరు	2023 లో నీటి నిల్వ	ప్రస్తుత నీటి నిల్వ
జూరాల	5	4.04
తుంగభద్ర	25.27	8.01
శ్రీశైలం	42.8	36.4
నాగార్జునసాగర్	196.12	140.49
పులిచింతల	42.57	5.48
సింగూరు	21.7	20.49
నిజాంసాగర్	8.46	7.9
శ్రీరాంసాగర్	41.7	26.65
మిడ్ మానేరు	19.78	12.98
లోయర్ మానేరు	13.26	7.75
కడెం	4.6	3.06
ఎల్లంపల్లి	17.51	10.16
మొత్తం	438.77	283.41



దోమకొండ మండలంలో భూగర్భ జలాలు తగ్గడంతో సన్నగా పోస్తున్న బోరు



పెనుబల్లి మండలం లింగగూడెంలో నీరు రావడంలేదని రోడ్డు ఎక్కిన మహిళలు



నారాయణపేట జిల్లాలో బీటలు వారిన వరి పంట


సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ దంపతులను సన్మానిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

మాతృభాష, సంస్కృతిని కాపాడుకోవాలి

- యువతకు సుప్రీం మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ సూచన
- 'ఎన్టీఆర్‌కు భారతరత్న' ఉద్యమానికి మద్దతు ప్రకటన

ఖమ్మం, మార్చి10 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎంత ఉన్నతస్థానానికి వెళ్లినా, ఎంత కీర్తి గడించినా మూలాలు మరచిపోకూడదని సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. యువత సామాజిక స్పృహ కలిగి ఉండాలని, మాతృభాష, సంస్కృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన అభిమానులు ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి తన భార్య శివమాలతో కలిసి జస్టిస్ ఎన్వీ రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాభివృద్ధి జరగకపోతే ధనికులకు, పేదలకు మధ్య వ్యత్యాసాలు పెరిగి ఆకలి, అశాంతి పెరుగుతాయని అన్నారు. సమాజంతో పాటు మాతృభాషను, సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. అలాగే, మంత్రి తుమ్మల నాగేశ్వరావుతోపాటు ఖమ్మం జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తాను చీఫ్ జస్టిస్‌గా ఉన్న సమయంలో ఖమ్మంలో కోర్టు భవనాలు నిర్మాణానికి చేసిన ప్రయత్నం ప్రతిపాదనల స్థాయిలోనే ఆగిపోయిందని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు ప్రజల కీర్తి పతాకాన్ని ఎర్రకోటపై ఎగురవేసిన వ్యక్తి జస్టిస్ ఎన్వీ రమణ అని కొనియాడారు. నిజాయతీ, నిబద్ధతతో చీఫ్ జస్టిస్ స్థాయికి చేరుకున్న ఎన్వీ రమణ ఎదుగుదలను ప్రభుత్వం కూడా ఆపలేకపోయిందని అన్నారు. ఖమ్మం కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నెని రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్వీ రమణ దంపతులను ఘనంగా సత్కరించారు. కాగా, ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనే డిమాండ్‌తో ఆయన అభిమానులు చేపట్టిన రాష్ట్రపతికి పోస్టు కార్డు కార్యక్రమానికి సుప్రీం కోర్టు పూర్వ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ సంఘీభావం తెలిపారు. పోస్టు కార్డుపై జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు సంతకాలు చేసి దానిని రాష్ట్రపతికి పోస్ట్ చేశారు.



మన్నె జీవన్‌రెడ్డికి బీఫారం ఇచ్చిన సీఎం

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డికి టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం బీఫారం అందజేశారు. ఈ ఎన్నికల నామినేషన్ల దరఖాస్తు ప్రక్రియ సోమవారంతో ముగియనుంది.

40వేల ఎకరాలకు మించి సాగులోకి రాలేదు

- కాళేశ్వరంపై ఒక్క రూపాయి ఖర్చు పెట్టినా వృథా: కోదండ

హైదరాబాద్ సిటీ/ పంజాగుట్ట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టును రూ.లక్ష కోట్లతో కట్టినా 40వేల ఎకరాలకు మించి సాగులోకి రాలేదని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం ఆరోపించారు. అలాగే, భూకంపాలు వచ్చే చోట మల్లన్నసాగర్ కట్టారని చెప్పారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు-బీఆర్ఎస్ అబద్ధాలు-కాగ్ వెల్లడించిన వాస్తవాలు' అనే అంశంపై ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చా వేదిక నిర్వహించారు. కోదండరాం మాట్లాడుతూ కాళేశ్వరంపై మరొక్క రూపాయి ఖర్చు పెట్టిన వృథా అని, ఇప్పటికే ఏటా అప్పులు, వడ్డీ, కరెంట్ బిల్లులకు వేల కోట్లు కడుతున్నామన్నారు. కాళేశ్వరంపై సమగ్ర విచారణ జరపాలని, అంతర్జాతీయ నిపుణుల సర్వే చేయించాలన్నారు. ప్రాణహిత ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో డబ్బు దుబారా చేసిన కేసీఆర్‌ను అరెస్టు చేయాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి పనిచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాళేశ్వరం శనేశ్వరమా? వరమా? అనేది అర్థం కావడం లేదని, ఈ ప్రాజెక్టుకు ఖర్చు చేసింది 1.45 లక్షల కోట్లని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రాణహిత పూర్తి చేస్తే ఇంత ఖర్చయ్యేదికాదని చెప్పారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగానే ముందుకెళ్తే ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, మార్చి 10: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డిపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు రావడంతో ఆయనపై కేసు నమోదు చేశామని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈ నెల 7న కరీంనగర్‌లోని ప్రతిమ మల్టిప్లెక్స్‌లో జరిగిన బీఆర్ఎస్ సమావేశానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన తరువాత కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు మిత్తితో సహా తిరిగి చెల్లిస్తామని ఉద్దేశపూర్వకంగా బెదిరించారని కరీంనగర్‌కు చెందిన ఎన్‌జీవో కార్యకర్త పురుషోత్తమ ఆశిష్ గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సల్వాజుడుం పేరుతో పెరిగిన రాజ్యహింస

- ప్రశ్నార్థకంగా ఆదివాసీల భవిష్యత్తు: నందిని సుందర్

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సల్వా జుడుం పేరుతో ఆదివాసీ ప్రాంతాల్లో పోలీసుల సాయుధీకరణ ఎక్కువ అయిందని ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ నందిని సుందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా రాజ్యహింస పెరిగి ఆదివాసీ, గిరిజన యువకుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం పౌర హక్కుల సంఘం యాభై వసంతాల ముగింపు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నందిని సుందర్ మాట్లాడుతూ అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఇటీవల కాలంలో ఆదివాసీలపై దాడులు మరింత పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్యపాల్ 'కాషాయీకరణ-దళితులపై దాడులు' అంశంపై, 'కార్పొరేటీకరణ-ఆదివాసీ మహిళలపై ప్రభావం' అంశంపై సామాజికవేత్త ప్రొఫెసర్ మాధురి, రైతాంగ హక్కుల విధ్వంసం' అంశంపై కన్నెగంటి రవి, 'కార్మిక హక్కుల విధ్వంసం'పై ఇఫ్టు ప్రసాద్ ప్రసంగించారు. ఉపా చట్టాన్ని రద్దు చేయాలి... ఆ దిశగా ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు కూడా హామీ ఇవ్వాలి అని సభలో నాయకులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, క్రాంతి చైతన్య, చిట్టిబాబు, నారాయణ రావు తదితరులు తీర్మానించారు.

మహారాష్ట్ర అప్పీల్ తిరస్కరించాలి: హరగోపాల్

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించే ఉత్తర్వుకు వ్యతిరేకంగా మహారాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను తిరస్కరించాలని కమిటీ ఫర్ ది డిఫెన్స్ అండ్ రీసెర్చ్ ఆఫ్ జీఎన్ సాయిబాబా చైర్‌పర్సన్ ప్రొఫెసర్ జి. హరగోపాల్ సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. సాయిబాబాను ఢిల్లీ యూనివర్సిటీ వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కమిటీ కోరింది. ఈమేరకు ఆదివారం ఆ కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది.

వన్యప్రాణులకు
దాహం.. దాహం



కొత్తగా సాసర్‌పిట్ల నిర్మాణాలు లేవు.. ఉన్నవాటికి మరమ్మతులు కరువు



హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రతకు అడవుల్లో ఊట కుంటలు, చిన్న చిన్న వాగులు, అటవీశాఖ నిర్మించిన చెక్‌డ్యాంలు, కుంటలు ఎండిపోతున్నాయి. వాటిపై ఆధారపడి జీవిస్తున్న అటవీ జంతువులు దాహం దాహం అంటూ తాగునీటి కోసం పరుగులు పెడుతున్నాయి. ప్రస్తుతం వన్యప్రాణుల తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు అటవీ శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో మూగజీవాలు అల్లాడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి కోసం అడవికి సమీపంలో ఉండే గ్రామాల వైపు వెళ్తూ వేటగాళ్లు, ఊర కుక్కల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నాయి. రోడ్లు దాటే క్రమంలో వాహనాలు ఢీ కొని ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయి. ఎండాకాలంలో అటవీ జంతువుల దాహార్తిని తీర్చేందుకు అటవీశాఖ సాసర్‌పిట్లు నిర్మించాలి. ఉన్న వాటికి మరమ్మతులు చేయాలి. నిత్యం ట్యాంకర్ల ద్వారా వాటిల్లో నీటిని నింపి సమస్య తలెత్తకుండా చూడాలి. సోలార్ బోర్లకు మరమ్మతు చేయడంతోపాటు అవసరం మేరకు కొత్త వాటిని ఏర్పాటు చేయాలి. అటవీశాఖ ఈ పనులు చేపట్టకపోవడంతో వన్యప్రాణులు నీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి.

అటవీ విస్తీర్ణం 27,402.98 చ.కి.మీ.

తెలంగాణలో ప్రకటిత అటవీ ప్రాంతం 27,402.98 చదరపు కిలోమీటర్లు. అందులో 2 టైగర్ రిజర్వులు, 7 అభయారణ్యాలు, 3 జాతీయ పార్కులు ఉన్నాయి. వీటిలో పులులు, చిరుతలు, జింక జాతి వన్యప్రాణులు, మనుబోతులు, ఎలుగబంట్లు, తోడేళ్లు, నక్కలు, అడవిదున్నలు ఇలా వివిధ రకాల జంతువులతో పాటు సరీసృపాలు ఉన్నాయి. వీటన్నింటికి తాగునీరు తప్పని సరి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా రోజురోజుకు నీటివనరుల్లో నీరు అడుగంటిపోతోంది. కాగజ్‌నగర్, కడెం, బెజ్జూరు, పెంచకల్‌పేట, కరమోరి, వాంకిడి, తిర్యాని ప్రాంతాల్లో కొత్తగా సాసర్‌పిట్ల నిర్మాణాలు చేపట్టలేదు. పాడైన వాటికి మరమ్మతులు కూడా చేయలేదు. అక్కడక్కడ బాగున్న సాసర్ పిట్లలలో రెండు మూడు రోజులకొకసారి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి అటవీ ప్రాంతంలో సాసర్‌పిట్లు లేకపోవడంతో వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల్లో కూడా అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారు. మంచిర్యాల జిల్లాలో మూగజీవాలకు నీటిఎద్దడి రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నా క్షేత్రస్థాయిలో నీటి సరఫరా కనిపించడం లేదు. జన్నారం, బెల్లపల్లి, మంచిర్యాల, చెన్నూర్ అటవీ ప్రాంతాల్లో ఇవే పరిస్థితులే కనిపిస్తున్నాయి. వరంగల్ జోన్ ఏటూరు నాగారం, ములుగు, లక్నవరం, కొత్తగూడెం జోన్ కిన్నెరసాని, పోచారం అడవుల్లో సైతం నీటి కొరత మొదలైంది.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అంతంతే

అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా అది అంతంత మాత్రంగానే ఉంది. కొన్నిచోట్ల సోలార్‌బోర్లు పాడైనా వాటిని బాగుచేయించలేదు. మరికొన్ని చోట్ల బోర్ల ద్వారా నీరు అందుతున్నప్పటికీ సరిపడా అందడం లేదు. ఇదీగాక, గతంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ప్రైవేట్ ట్యాంకర్లు ముందుకు రావడంలేదని తెలుస్తోంది. కొత్తగా సాసర్‌పిట్లు నిర్మించేందుకు, పాతవాటికి మరమ్మతులు చేయించేందుకు కాంట్రాక్టర్లు సుముఖత చూపడంలేదని వినికిడి.

కాంగ్రెస్‌లోకి ఇంద్రకరణ్‌రెడ్డి?

- ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కూడా..

నిర్మల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితోపాటు ఆ పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరేందుకు దాదాపుగా రంగం సిద్ధమైంది. కాంగ్రెస్‌లో చేరాలంటూ అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితోపాటు విఠల్‌రెడ్డిపై బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఒత్తిడి తెస్తుండడం, ఇటు బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం వ్యవహరిస్తున్న తీరుతో నేతలంతా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈక్రమంలోనే వీరంతా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు మానసికంగా సిద్ధమైనట్లు తెలుస్తోంది. 'మీ నిర్ణయం ఎలా ఉన్నా మేం పార్టీ మారడం ఖాయం' అంటూ మూడు రోజుల క్రితం ఇంద్రకరణ్‌రెడ్డికి కార్యకర్తలు స్పష్టంచేశారు. అయితే ఇంద్రకరణ్ కూడా వారి వాదనలను ఖండించకుండా వేచిచూద్దామన్న ధోరణితో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే శనివారం పరామర్శల పేరిట బోధన్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నిర్మల్‌లోని ఇంద్రకరణ్‌రెడ్డి ఇంటికి వచ్చి మాట్లాడిన వ్యవహారం.. ఆయన పార్టీ మారుతున్నారనే దానికి బలం చేకూరుస్తోంది. ఈ తరుణంలో ఆదివారం చాలామంది పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులకు స్థానిక కాంగ్రెస్ నేతలు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి, విఠల్‌రెడ్డిలతోపాటు స్థానిక బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకునే వ్యవహారంపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సంధానకర్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన ఈ విషయమై సీఎం రేవంత్‌తో చర్చించారని..సీఎం సానుకూల సంకేతాలిచ్చినట్లు చెబుతున్నారు. ఇంద్రకరణ్‌కు సన్నిహితుడైన ఓ మంత్రి కూడా ఈ మేరకు సీఎంపై ఒత్తిడి తెస్తున్నారంటున్నారు.

భార్యను కొట్టిచంపి.. డస్ట్‌బిన్‌లో పడేసి..

- ఆస్ట్రేలియాలో హైదరాబాదీ ఘాతుకం
- ఏమీ ఎరుగనట్టు హైదరాబాద్‌కు రాక

ఏఎస్‌రావునగర్/హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పన్నెండేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను.. దారుణంగా కొట్టిచంపాడు! పరాయి దేశంలో.. రోడ్డు పక్కన ఉన్న చెత్త కుండీలో అనాథ శవంలా పారేసి.. నాలుగేళ్ల కుమారుణ్ని తీసుకుని స్వదేశానికి పారిపోయి వచ్చాడు!! ఆ పిల్లాణ్ని నేరుగా అత్తారింటికి తీసుకెళ్లి, వారికి అప్పగించి, భార్యను చంపిన విషయం చెప్పి.. క్షమాపణలు చెప్పి పరారైపోయాడు! అల్లుడు చెప్పిన పిడుగులాంటి వార్త విని కుప్పకూలిపోయారా తల్లిదండ్రులు. కుమార్తె మృతదేహం వేల కిలో మీటర్ల ఆవల.. రోడ్డుపక్కన దిక్కులేని స్థితిలో డస్ట్‌బిన్‌లో పడి ఉన్న విషయాన్ని తల్చుకుని కుమిలికుమిలి రోదిస్తున్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఏఎస్‌రావునగర్ డివిజన్ బృందావన్ కాలనీలో నివాసం ఉండే మాదగాని బాల్‌శెట్టిగౌడ్, మాధవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు చైతన్య భారతి అలియాస్ శ్వేత(36), ఏఎస్‌రావునగర్ ఈసీఐఎల్ ప్రాంతానికి చెందిన వరికుప్పల అశోక్‌రాజ్ ఒకే కాలేజీలో చదివేవారు. డిగ్రీలో ఉండగా ప్రేమించుకున్నారు. కులాలు వేరైనా విషయం పెద్దలకు చెప్పి ఒప్పించి, 2012లో వివాహం చేసుకున్నారు. అనంతరం ఉన్నత చదువుల నిమిత్తం ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కు వెళ్లారు. శ్వేత ఎం.ఫార్మసీ, అశోక్‌రాజ్ ఎంబీఏ పూర్తిచేశారు. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. ఆస్ట్రేలియా పౌరసత్వం కూడా పొందారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఆర్య ఉన్నాడు. అయితే.. ఇటీవలి కాలంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. తరచూ ఇద్దరూ గొడవలు పడుతున్నారు. ఈ విషయం తెలిసిన శ్వేత తల్లిదండ్రులు.. ఇద్దరికీ నచ్చజెప్తూ వస్తున్నారు. ఈ క్రమంలో మార్చి 7న.. తెల్లవారుజామున 4 గంటల సమయంలో అశోక్‌రాజ్ తన కుమారుడు ఆర్యతో కలిసి అత్తవారింటికి వచ్చాడు. మనవణ్ని తీసుకుని అల్లుడు ఒక్కడే రావడంతో.. శ్వేత తల్లిదండ్రులు తమ కుమార్తె గురించి అడిగారు. దీనికి అతడు.. ‘‘శ్వేతకు నాకు గొడవ జరిగింది. తోపులాటలో శ్వేత తల గోడకు తగిలి చనిపోయింది. జరిగిందానికి నన్ను క్షమించండి. ఇకపై బాబును మీరే చూసుకోండి’’ అని చెప్పి వారు ఆ షాక్ నుంచి కోలుకోకముందే అక్కడి నుంచి జారుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తేరుకున్న శ్వేత తండ్రి బాల్‌శెట్టి గౌడ్.. జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు.


తల్లిదండ్రులు, చెల్లితో శ్వేత

80 కిలోమీటర్ల దూరంలో..

ఆస్ట్రేలియాలో శ్వేతను చంపేసిన అశోక్‌రాజ్, ఆమె మృతదేహాన్ని మూటగట్టి, తమ ఇంటి నుంచి 80 కిలో మీటర్ల దూరం కారులో తీసుకెళ్లి రోడ్డు పక్కన డస్ట్‌బిన్‌లో పడేశాడు. స్థానిక పోలీసులు శ్వేత మృతదేహాన్ని వెలికితీశారని.. ఇద్దరికీ ఆస్ట్రేలియా పౌరసత్వం ఉండడంతో అక్కడి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని బాల్‌శెట్టి గౌడ్ తెలిపారు. ఇక్కడి పోలీసులకు తాను ఎలాంటి ఫిర్యాదూ చేయదలుచుకోలేదని ఆయన వెల్లడించారు. కాగా.. ఈ విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం ఏఎస్‌రావునగర్‌లో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. శ్వేత మృతదేహాన్ని నగరానికి త్వరగా రప్పించేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, భారత ఎంబసీ అధికారులతో చర్చించినట్లు చెప్పారు.

మంగళవారం చివరిగా ఫోన్‌లో..

తమ కుమార్తె శ్వేత చివరిసారిగా గత మంగళవారం ఫోన్‌లో మాట్లాడిందని, ఆ మరుసటిరోజే హత్యకు గురైందని అప్పటి నుంచి తమకు ఫోన్ చేయలేదని చెబుతూ.. బాల్‌శెట్టిగౌడ్, మాధవి కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆరోజు తమతో బాగానే మాట్లాడిందని, గొడవల ప్రస్తావన తేలేదని చెప్పారు. భార్యాభర్తల మధ్య గొడవలు సహజమని, కానీ ప్రాణాలు పోయేంత ఘోరం జరుగుతుందని ఊహించలేదని వాపోయారు.

'సిద్ధం' సభలో తొక్కిసలాట

- పారిశుధ్య కార్మికుడి మృతి
- బస్సునుంచి జారిపడి మరొకరు..

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'సిద్ధం' సభలో చోటుచేసుకున్న అపశృతుల వల్ల ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. సభ ముగిసిన తర్వాత జరిగిన తొక్కిసలాటలో ఒంగోలుకు చెందిన పారిశుధ్య కార్మికుడు ఊసరగుడి మురళీకృష్ణ (35) మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన మురళీకృష్ణకి సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే ఆయనను అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించడానికి ప్రయత్నించగా.. ట్రాఫిక్ వల్ల దాదాపు రెండున్నర గంటల పైనే సమయం పట్టినట్లు తెలుస్తోంది. వాస్తవానికి రోజువారీ పనులు ముగించుకుని ఇంటికొచ్చి కుటుంబంతో గడుపుతున్న మురళీకృష్ణను స్థానిక వైసీపీ కార్పొరేటర్ భర్త వచ్చి సభకు తీసుకెళ్లడంతో అక్కడ ఆయన ప్రాణాలు కోల్పోయారు. అయితే పోలీసులు మాత్రం మురళీకృష్ణ ఒక గ్యాలరీ నుంచి మరొక గ్యాలరీకి దూకుతూ కిందపడి ఒత్తిడికి గురై చనిపోయాడని వెల్లడించారు. కాగా, పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన గేదెల బాల దుర్గారావు (27) మేదరమెట్ల సిద్ధం సభకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు నుంచి జారి పడ్డాడు. తలకి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. అలాగే చిత్తూరు జిల్లాకు చెందిన ఓ ఏఎస్ఐ కూడా గుండెపోటుకు గురయ్యాడని, సకాలంలో చికిత్స అందడంతో ప్రాణాపాయం తప్పిందని సమాచారం.

ఆ 300 ఎకరాలు తిరిగి రైతులకే ఇవ్వాలి

- హెటిరోకు మావోయిస్టుల హెచ్చరిక

తొగుట, మార్చి 10: సిద్దిపేట జిల్లాలో హెటిరో డ్రగ్స్ ఫార్మా కంపెనీ రైతుల నుంచి సేకరించిన 300 ఎకరాలను తిరిగి రైతులకే అప్పగించాలంటూ ఆ భూముల్లో మావోయిస్టుల పేరుతో బ్యానర్, వాల్‌రైటింగ్ వెలిశాయి. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. 2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తొగుట మండలంలోని పెద్దమాసాన్‌పల్లి గ్రామంలో 260 ఎకరాలు, కొండపాక మండలంలోని సిర్సనగండ్ల గ్రామ శివారులో 40 ఎకరాల భూమిని ఫార్మా కంపెనీ యాజమాన్యం రైతుల నుంచి తక్కువ ధరకు సేకరించింది. అప్పట్లో కంపెనీ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా రైతులకు అండగా నిలవడంతో కంపెనీ యాజమాన్యం ఆ భూముల్లో ఎలాంటి పనులను ప్రారంభించలేదు. అప్పట్లో 22 మంది గ్రామస్థులపై కంపెనీ యాజమాన్యం కేసులు పెట్టడంతో ఇప్పటికీ వారు కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక పదిహేను రోజుల నుంచి ఆ భూముల్లో కంపెనీ యాజమాన్యం పనులను చేపట్టింది. దీంతో బాధితులు గతనెల 28న కలెక్టర్‌ను కలిసి తమ భూములను తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.